తర తరాల పిల్లల కథలు
రూ॥70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్).హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

2024, మార్చి 23 శనివారం

హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 275, పేజీలు: 8
ఖమ్మం : 8+8, కరీంనగర్ : 8+8
మహబూబ్‌నగర్: 8, వెల రూ. 5.00

Published from: Hyderabad
Khammam, Karimnagar, Mahabubnagar




# ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌కు 6 రోజులు కస్టడీ

**ఈనెల 28 వరకు ఇడి విచారణ**

మద్యం అవినీతిలో ఢిల్లీ సిఎం కీలక కుట్రదారుడని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపణ

అరెస్టు అవసరం లేదు

ఆచితూచి నిర్ణయం తీసుకోండి : సింఘ్వీ

భారీ భద్రతమధ్య కోర్టుకు తరలింపు

**న్యూఢిల్లీ :** మద్యం అవినీతి కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఆరు రోజులపాటు రిమాండ్ విధిస్తూ రౌస్ ఎవెన్యూలోని కేంద్ర దర్యాప్తుసంస్థ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం రాత్రి ఉత్తర్వు జారీచేసింది. దీంతో ఈనెల 28వ తేదీ వరకు కేజ్రీవాల్‌ను కస్టడీలోకి తీసుకొని ఇడి విచారించనుంది. ఈ అంశంపై ఇడి తరపు కేంద్ర ప్రభుత్వ న్యావాదులకు, కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి మధ్య రెండున్నర గంటలససేపు వాదనలు కొనసాగాయి. ఆయనను పది రోజులపాటు విచారణ చేయడానికి అనుమతించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) న్యాయస్థానాన్ని కోరింది. తొలుత ఈ విషయంపై ప్రత్యేక న్యాయస్థానం తీర్పును ప్రకటించకుండా రిజర్వు చేసింది. దీంతో సాయంత్రం వరకూ ఉత్కంఠ నెలకుంది. మద్యం అవినీతి కేసులో కేజ్రీవాలే కీలక కుట్రదారుడని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టులో ఆరోపించింది. కేసు విచారణకు ఆయన సహకరించడంలేదని, మద్యం వ్యాపారులకు అనుకూలంగా ఢిల్లీ ఎక్సైజు విధానాన్ని రూపొందించడంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేజీవాల్‌తోపాటు ఇతర మం త్రులు, ఆమ్ ఆద్మీపార్టీ నాయకులు కూడా బాధ్యులుగా ఉన్నారని ట్రయల్ కోర్టులో

తరువాయి 2లో



## బిజెపికి తగినన్ని సీట్లు వస్తే ఎవరినీ బతకనివ్వరు

లక్ష కోట్ల అవినీతిపరుణ్ణి వదిలేసి రూ. వంద కోట్ల అవినీతి వంకతో కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తారా?

దేశానికి శాశ్వత అధ్యక్షుడిగా మారాలని మోడీ యోచన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

లక్ష కోట్ల అవినీతికి పాల్పడిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బయట వదిలేసి, రూ.వంద కోట్ల వ్యవహారంలో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా ప్రధాని మోడీ తన ప్రత్యర్థుల పట్ల ఎలా వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బిజెపి అనుకున్నట్లుగా సీట్లు వస్తే ఏ రాష్ట్రంలో ఏ వ్యక్తిని కూడా బతనివ్వబోరని, చివరకు సిఎం రేవంత్‌రెడ్డికి కూడా ప్రమాదం తీసుకువస్తారని అన్నారు. ఒక హిట్లర్, ఒక ముస్సోలిని, ఫాసిజం, నాజీయిజం అన్ని కలబోసిన వ్యక్తి మోడీ అని, అధికారం కోసం ఏమైనా చేసే ఔరంగజేబ్ ఆయనలో దాగి ఉన్నాడని మండిపడ్డారు. భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చి, దేశానికి శాశ్వత అధ్యక్షునిగా మారాలని మోడీ భావిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి కుర్చీలో కూర్చునేందుకు ఏ నిమిషం, ఏదైనా చేసేందుకు నరేంద్రమోడీ సిద్ధంగా ఉంటారని విమర్శించారు. ప్రమాదకరమైన ప్రధాని నరేంద్రమోడీపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలలో చైతన్యం రావాలన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగాయి. సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్యపద్మ, కళవేణ శంకర్, బాలనర్సింహా, ఇ.టి.నర్సింహాతో కలిసి కూనంనేని సాంబశివరావు హైదరాబాద్‌లోని మగ్ధూంభవన్‌లో

తరువాయి 2లో

## ప్రతిపక్షాలను రాజకీయంగా ఎదుర్కోండి

**ప్రధానమంత్రి మోడీకి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సవాల్**



**పాట్నా :** దేశంలో సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల ఐక్యతను బలహీనపరచడంకోసమే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి. రాజా విమర్శించారు. ధైర్యం ఉంటే దేశంలో ప్రతిపక్షాలను రాజకీయంగా ప్రతిఘటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆయఇ సవాలు విసిరారు. పాట్నాలో పిటిఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ, దేశ ప్రజలు బిజెపికి, నరేంద్రమోడీ ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలు పరిష్కరించలేకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉండటంతో మోడీ భయపడి ప్రజలను సమస్యల నుండి తప్పుతోవ పట్టించేందుకు కేజ్రీవాల్‌ను అరెస్టు

తరువాయి 2లో

## ప్రతిపక్షం ఐక్యతతో మోడీ గుండెల్లో దడ

**కేజ్రీవాల్ అరెస్టు మోడీ భయానికి తార్కాణం**



**న్యూఢిల్లీ :** దేశంలో ప్రతిపక్షాలన్నీ ''ఇండియా'' కూటమి ఛత్రం కింద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్యం కావడంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ గుండెలు దడదడలాడుతున్నాయని, అందుకే ఆయన భయపడి అరెస్టులకు పూనుకున్నారని కాంగ్రెస్‌పార్టీ శుక్రవారంనాడు విమర్శించింది. కేజ్రీవాల్ అరెస్టు పర్వం నరేంద్రమోడీ భయానికి తార్కాణమని కాంగ్రెస్‌పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయభేరీ మోగిస్తుందని చాలా స్పష్టంగా తేటతెల్లమవుతోందని అన్నారు. ''ఇండియా'' కూటమి మరింత బలపడుతున్నదని పిటిఐ

తరువాయి 2లో

## కవితకు బెయిలు తిరస్కరించిన సుప్రీంకోర్టు

ట్రయల్ కోర్టుకు వెళ్ళమని సలహా

**న్యూఢిల్లీ :** మద్యం అవినీతి కేసులో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు కుమార్తె, ఎంఎల్‌సి కె.కవితకు బెయిలు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా ఎం త్రివేదీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. న్యాయస్థానం అనుసరిస్తున్న పద్ధతులకు విరుద్ధమైన ఆచరణ ఉండబోదనీ, చట్టపరమైన కార్యవిధాన పద్ధతులకు వ్యతిరేకంగా

తరువాయి 2లో

## 'ఈసారి నాలుగు వందల పైన... నిజమా, కలయా!

04

## బెగుసరాయ్ నుంచి సిపిఐ మాజీ ఎంఎల్‌ఎ అవధేశ్ పోటీ

**పాట్నా:** బీహార్‌లోని బెగుసరాయ్ లోక్‌సభ స్థానం నుంచి మహాఘటబంధన్ అభ్యర్థిగా సిపిఐ మాజీ ఎంఎల్‌ఎ అవధేశ్ రాయ్ పోటీ చేస్తారని పార్టీ ప్రధాన కార్యదర్శి డి రాజా శుక్రవారం ప్రకటించారు. రాష్ట్రంలోని 40 సీట్లలో తమ పార్టీ కి కనీసం మరొక్క సీటు ఇవ్వాలని రాజా స్పష్టం చేశారు. అంతకు ముందు రాజా ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్, గురువారం సాయంత్రం ఆయన కుమారుడు తేజస్వి యాదవ్‌తో భేటీ అయ్యారు. బీహార్‌లో ఐక్యం గా మహాఘట్ బంధన్‌ను కొనసాగించాలని సూచించారు. కాగా, బెగుసరాయ్ నుంచి బరిలోకి దిగనున్న అవధేశ్ రాయ్ ఒబిసికి చెందిన వారు. బచ్వారా నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎంఎల్‌ఏగా పనిచేశారు. 2009లో జెడియుకు చెందిన మొనజీర్ హసన్ గెలవడం మినహాయిస్తే... బెగుసరాయ్‌లో ఎప్పుడు కూడా అగ్రవర్ణ భూమిహార్ వ్యక్తే ఎన్నికవుతూ వస్తున్నారు. ప్రస్తుతం బెగుసరాయ్ నుంచి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోసారి కూడా ఆయనే బిజెపి నుంచి పోటీ చేయనున్నారు. 2019లో, అప్పటి సిపిఐ అభ్యర్థిగా ఉన్న జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్ పోటీ చేశారు.



## గొంతులేని సామాన్యుల భావ వ్యక్తీకరణకు సోషల్ మీడియా దోహదం

ఉచ్చరించేందుకు వీలుకాని భాషను ఉపయోగించడాన్ని కట్టడి చేయాలి

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

గొంతులేని సామాన్యుల భావ వ్యక్తీకరణకు సోషల్ మీడియా వేదిక ఎంతో దోహదపడుతుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దీనిని కొందరు హద్దు,అదుపు లేకుండా స్వేచ్ఛ పేరుతో ఉచ్ఛరించేందుకు వీలు కాని భాషను ఉపయోగిస్తున్నారని, ఇలాంటి వాటిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్, ఫిల్మ్ నగర్‌లోని, ఫిల్మ్ ఛాంబర్‌లో టియుడబ్ల్యుజె అనుబంధ సంస్థ అయిన ఫిల్మ్ క్రిటిక్స్ (సినిమా బీట్ జర్నలిస్టుల) అసోసియేషన్ శుక్రవారం 'ఆత్మీయ సత్కార' కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిర్భీతితో పనిచేస్తూ, ప్రజల గొంతుకగా నిలబడే మీడియా సంస్థలకు, జర్నలిస్టులకు తాత్కాలికంగా కష్టాలు ఎదురైనా, భవిష్యత్తులో కచ్చితంగా మంచిరోజులే ఉంటాయన్నారు. మీడియాను తమ చేతుల్లోకి తీసుకుంటున్న బడా వ్యాపార, వాణిజ్యవేత్తలు వృత్తి ధర్మాన్ని విస్మరిస్తూ, ఇష్టానుసారంగా వ్యవహరించడం సహించరానిదని చెప్పారు. దాదాపు ఆరు దశబ్దాల నుండి పనిచేస్తున్న ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్‌కు నాటి నుండి నేటి వరకు తాము సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నామని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నాడు దేశోద్ధారక భవన నిర్మాణానికి ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అందించిన సహకారం చిరస్మరణీయమన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ఎన్నికల

తరువాయి 2లో

## కాంగ్రెస్‌లోకి రండి

బిఆర్‌ఎస్ సెక్రెటరీ జనరల్ కె.కేశవరావును ఆహ్వానించిన దీపాదాస్ మున్షి





ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ సెక్రెటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావుతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి భేటీ అయ్యారు. ఇప్పటికే బిఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. తాజాగా బిఆర్‌ఎస్‌లో ముఖ్య నాయకుడు కెకెతో కాంగ్రెస్ నేతలు సమావేశం కావడంత రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నది. హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని కెకె నివాసంలో కేశవరావుతో దీపాదాస్ మున్షితోపాటు ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, డిసిసి ఖైరతాబాద్ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. సుమారు 40 నిమిషాల పాటు వారి మధ్య చర్చజరిగింది. ఈ చర్చలో కెకె కుమార్తె, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. కెకెను కాంగ్రెస్‌లోనికి ఆహ్వానించినట్టు తెలిసింది. కెకెతో పాటు మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే పార్టీ మార్పుపై ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి సమాచారం రాలేదు.

### మరో ఇద్దరు అభ్యర్థులను ప్రకటించిన బిఆర్‌ఎస్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బిఆర్‌ఎస్ మరో ఇద్దరు అభ్యర్థులను ప్రకటించింది. నాగర్ కర్నూల్ లోక్‌సభ అభ్యర్థిగా విశ్రాంత ఐపిఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మెదక్ అభ్యర్థిగా విశ్రాంత ఐఎఎస్ అధికారి పి. వెంకట్రామిరెడ్డి పేర్లను బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు శుక్రవారం ప్రకటించారు. ఇప్పటి వరకు మొత్తం 13 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, నల్గొండ, భువనగిరి మరో నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అంతకు ముందు మెదక్ నియోజకవర్గ ముఖ్య నేతలతో కెసిఆర్ సమావేశమయ్యారు. ఎర్రవల్లిలోని

తరువాయి 2లో



## మంత్రిగా పొన్ముడి ప్రమాణం స్వీకారం

**సుప్రీంకోర్టు మొట్టికాయలతో దిగొచ్చిన తమిళనాడు గవర్నర్ రవి**

**చెన్నై :** సుప్రీంకోర్టు మెట్టికాయలు వేసిన తరువాత ఎట్టకేలకు తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి శుక్రవారం నాడు డిఎంకె సీనియర్ నేత కె. పొన్ముడితో మంత్రిగా ప్రమాణం చేయించారు. అక్రమ ఆస్తుల కేసులో డిసెంబరు 19, 2023లో మద్రాస్ హైకోర్టు పొన్ముడిని దోషిగా నిర్ధారించిన తరువాత మంత్రి పదవి కోల్పోయాడు. అయితే ఇపుడు మళ్లీ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో సాదాసీదాగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ రవి పొన్ముడితో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి సిఎం స్టాలిన్, మంత్రులు ఉధయనిధి స్టాలిన్, సుబ్రమణియన్‌లు హాజరయ్యారు. పొన్ముడి రాష్ట్ర ఉన్నత విద్యా శాఖను కేటాయించారు. ఇప్పటి వరకు ఈ శాఖను వెనుకబడిన తరగతుల శాఖమంత్రి ఆర్‌ఎస్ రాజకన్నప్పన్ నిర్వహించారు. అయితే గతంలో నిర్వహించిన ఖాధి, గ్రామ పరిశ్రమల బోర్డు శాఖనే రాజప్పన్‌కు కేటాయించారు. ఇదిలా

తరువాయి 2లో



## ఎసిబికి చిక్కిన తస్లీమా

**లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్**

ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి

ఎప్పుడూ స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి మీడియాలో ఎదో ఒక రూపంలో దర్శనం ఇచ్చే మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఓ వ్యక్తి నుంచి రూ. 19,200 ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలేటి వెంకటేష్ ద్వారా తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులకు పట్టుపడ్డారు. బాధితుడు ఫిర్యాదుతో శుక్రవారం మధ్యాహ్నం ఎసిబి అధికారులు మాటు వేసి వలపన్ని పట్టుకున్నారు. ఎసిబి

తరువాయి 2లో

## భారత్–భూటాన్ మధ్య రైలు బంధం

ఎంఓయు ఖరారు

పలు ఒప్పందాలపై సంతకాలు



**థింపూ :** భారత్ – భూటాన్ దేశాలమధ్య రైళ్ళ రాకపోకలకు ఒప్పందం కుదిరింది. అదేవిధంగా రెండు దేశాలమధ్య పలు ఒప్పందాలపై కూడా సంతకాలు జరిగాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ భూటాన్ పర్యటన సందర్భంగా ఆ దేశ రాజధాని థింపూలో ఈ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఈ మేరకు రెండు దేశాలమధ్య రెండు రైళ్ళతో అనుసంధానం చేస్తారు. కోక్రార్ఝూర్–గెలెఫూ మధ్య రైళ్ళ రాకపోకలతో అనుబంధం, బనర్‌హట్–సమ్త్సేలమధ్య కూడా రైల్వే లైను ద్వారా అనుబంధం ఏర్పాటు చేసుకునేందుకు ఒప్పందాలు జరిగాయి. పెట్రోలియం, ఆయిల టూబ్రికెంట్స్ సాధారణ సరఫరాలపై కూడా అగాహనా ఒప్పందాలు జరిగాయి. ఇంధన ఆదా, ఔషధాల రంగంలో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు సహకారాన్ని పెంచేవిధంగా అవగాహనా పత్రంపై సంతకాలు చేశారు. అంతరిక్ష సహకారంపై కూడా ఒక ఉమ్మడి కార్యాచరణకు రెండు దేశాలు శ్రీకారం చుట్టాయి. సామర్థ్యం పెంచుకునే విషయంపై కూడా రెండు దేశాలమధ్య ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా భారత్‌కు భూటాన్ ప్రధానమంత్రి షేరింగ్ తోబ్గాయ్ కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు దేశాల ప్రధానమంత్రులూ శుక్రవారం మధ్యాహ్నం వర్కింగ్ లంచ్ సమావేశం నిర్వహించారని, పలు

తరువాయి 8లో

## వైద్య ఆరోగ్య శాఖలో మళ్లీ డిప్యుటేషన్ల దందా

**గత నెలలో రద్దు చేసిన ప్రభుత్వం**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అక్రమాలు జోరుగా సాగుతున్నాయి. గత నెల 7వ తేదిన శాఖలోని అని డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్లు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో జిల్లాలో డిప్యుటేషన్‌పై ఉన్న సుమారు 85 మంది తమ సొంత స్థానాలకు వెళ్లిపోయారు. అయితే ఆ ఉత్తర్వుల్లో అత్యవసరమైతే డిప్యుటేషన్లు జిల్లా స్థాయి వరకు చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. దీంతో అత్యవసరం అనే పదాన్ని వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు తమకు నచ్చినట్లు వాడుకుంటున్నారు. దీనిని కొందరు అధికారులు దుర్వినియోగం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇష్టానుసారంగా డిప్యుటేషన్లకు అనుమతులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా చేసుకున్న కొందరు దళారాలు పోస్టుకో రేటు కట్టి పైరవీలు మొదలుపెట్టారు. ఇది వైద్య ఆరోగ్యశాఖలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

**సొంత స్థానాలకు 85 మంది :** చాలా ఏళ్లుగా డిప్యుటేషన్ల పేరుతో

తరువాయి 2లో

## మోడీ గుండెల్లో దడ
(మొదటి పేజీ తరువాయి)

వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. ''ఇండియా'' కూటమిలో కేవలం నితీశ్ కుమార్ మాత్రమే తెల్లమొహం వేసి తప్పుదోవ పట్టారని విమర్శించారు. జయంత్ చౌధరి పార్టీ నుండి వెళ్ళిపోయారనీ, కానీ ఆయనే నిజమైన లోక్‌దళ్ అనీ అన్నారు. గురువారం రాత్రి నుండీ దేశంలో జరుగుతున్న పరిణామాలపై ఆయన వాఖ్యానిస్తూ, ఇవన్నీ కేవలం ప్రతీకారేచ్ఛతో చేస్తున్న రాజకీయకక్ష సాధింపు చర్యలేనని అన్నారు.మొదట జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారని, తర్వాత ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారనీ, అనేకమంది నాయకుల అరెస్టుల వెనుక ఇడి, సిబిఐ, ఐటీ శాఖాధికారులే ఉన్నారన్నారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసినంత మాత్రాన 'ఇండియా' కూటమి చేస్తున్న పోరాటం ఆగిపోదని హెచ్చరించారు. ''ఈ విధంగా జరుగుతుందని మాకు బాగా తెలుసు. ఇది ఒక కుట్ర, ప్రతిపక్షాలను బలహీన పరచడమే, ప్రజలపై మాకు పూర్తి విశ్వాసం ఉంది, ఇండియా కూటమి మరింతగా బలపడుతున్నది'' అని జైరామ్ రమేశ్ అన్నారు. ''కాంగ్రెస్‌పార్టీ సహా ఇతర ప్రతిపక్షాలన్నీ దేశంలో ప్రజల సమస్యలను తెరమీదకు తెస్తున్నాయి, ఇవే నిజమైన ప్రజా సమస్యలు, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, కార్మిక సమస్యలు, రైతుల సమస్యలు, ఆర్థిక అసమానతలు, సామాజికంగా ప్రజలను విడదీసే ప్రయత్నం చేయడం వంటివన్నీ ప్రజల ముందు పెడుతున్నాం'' అని ఆయన అన్నారు.

**దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజు : కెసిఆర్**

ప్రజాపక్షం/హైదరాబాద్: ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజు అని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అభివర్ణించారు. ప్రతిపక్షాన్ని నామరూపాలు లేకుండా చేయాలనే ఏకైక సంకల్పంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందనేందుకు ఇటీవల జరిగిన జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్, బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కవిత అరెస్టు ఘటనలు రుజువు చేస్తున్నాయని కెసిఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇడి,సిబిఐ, ఐటి తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం పావులుగా వాడుకుంటున్నదని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా పరిణమిస్తున్న బిజెపి ప్రభుత్వ చర్యలను బిఆర్‌ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్ రాజకీయ ప్రేరేపిత అరెస్ట్ అని, అక్రమ కేసులను వెంటనే వెనక్కి తీసుకుని, అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కెసిఆర్ డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌లోకి రండి
(మొదటి పేజీ తరువాయి)

తన వ్యవసాయ క్షేత్రంలో మెదక్ పార్లమెంట్ పరిధిలోని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ముఖ్య నాయకులతో సమీక్షించారు. 13 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు వీరే : వరంగల్ కడియం కావ్య, చేవెళ్ల కాసాని జ్ఞానేశ్వర్,జహీరాబాద్ గాలి అనిల్ కుమార్, నిజామాబాద్ బాజిరెడ్డి గోవర్దన్, కరీంనగర్ బి.వినోద్ కుమార్,పెద్దపల్లి కొప్పుల ఈశ్వర్, మహబూబాబాద్ మాలోత్ కవిత, మహబూబ్‌నగర్ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం నామా నాగేశ్వరరావు, ఆదిలాబాద్ ఆత్రం సక్కు, మల్కాజిగిరి రాగిడి లక్ష్మారెడ్డి, మెదక్ పి.వెంకట్రామి రెడ్డి, నాగర్ కర్నూల్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## రాజకీయంగా ఎదుర్కోండి
(మొదటి పేజీ తరువాయి)

చేయించారని డి.రాజా విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తన ప్రత్యర్థులైన ప్రధాన పార్టీలను భయభ్రాతులు కలిగించడం కోసమే ఆయన ఈ విధంగా అరెస్టులకు దిగారని విమర్శించారు. ప్రతిపక్షాల్లో భయం సృష్టించేందుకు తప్ప ఈ అరెస్టుకు మరో ప్రయోజనం లేదని కానీ, ఆయన ఆశయం నెరవేరబోదని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేయడం ఆర్థిక ఉగ్రవాదం తప్ప మరోచర్య కాదని మండిపడ్డారు. కేజ్రీవాల్ అరెస్టును తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల తరుణంలో ఈ విధంగా ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడిని అరెస్టు చేసి జైలులో పెడితే ఆయన ఏ విధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనగలరని ప్రశ్నించారు. ప్రజలను తప్పుతోవ పట్టించేందుకే ఆయన ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ''లోక్‌సభ ఎన్నికల ప్రకటన విడుదలైన తర్వాత కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు, ఆయన ప్రచారంలో పాల్గొనేదెలా? వారి పార్టీ తరపున ఆయన ఎలా ప్రచారం చేయగలరు? దేశంలో ప్రతిపక్షాలను బలహీన పరచేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు, మేం ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం, మేం నరేంద్ర మోడీని సవాలు చేస్తున్నాం, రాజకీయంగా ఆయన ప్రతిపక్షాలను ప్రతిఘటించాలి'' అని డి.రాజా అన్నారు. ప్రతిపక్షాలను భయపెట్టేందుకే దర్యాప్తుసంస్థలను ఆయన ఉపయోగించుకుంటున్నారన్నారు. దక్షిణాదిన తిష్టవేసేందుకు బిజెపి ప్రయత్నాలు చేస్తోందనీ, కర్ణాటకలో బిజెపి అధికారం కోల్పోయిందని, తెలంగాణ ఎన్నికల్లో కూడా చిరునామా కోల్పోయిందని విమర్శించారు. తమిళనాడులో కూడా బిజెపి పార్టీ సీట్లు గెలిచే అవకాశాలు లేవని అన్నారు. ఇదిలా ఉండగా, కేజ్రీవాల్, హేమంత సోరెన్ (జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి)ల అరెస్టులను ఖండిస్తూ సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ముందు బిజెపి నిరాశానిస్పృహలకు గురైనందువల్లనే అరెస్టులకు పాల్పడుతోందని పేర్కొంది. ప్రజలను ఎదుర్కోలేక ఈ విధమైన జిమ్మిక్కులకు బిజెపి పాల్పడుతోందని తేటతెల్లమైపోయిందని ఆ ప్రకటనలో విమర్శించింది. ఎన్నికల ముందు చేస్తున్న అప్రజాస్వామిక పద్ధతులలో ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకున్న ఈ విధమైన నీచమైన రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని ప్రకటనలో పార్టీ జాతీయ కార్యదర్శివర్గం నరేంద్రమోడీని హెచ్చరించింది.

**కేజ్రీవాల్ అరెస్టుకు సిపిఐ(ఎం) ఖండన**

కేజ్రీవాల్ అరెస్టును సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ మాట్లాడుతూ మోడీని ఓడించేందుకు దేశంలో ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ప్రతినపూనాయని, కలసికట్టుగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ప్రతిపక్షాలను బలహీనపరచేందుకే కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ ప్రయోగిస్తున్నారని విమర్శించారు. ''లోక్‌సభ ఎన్నికలు ప్రకటించారు. ఈ సమయంలో ప్రతిపక్ష నాయకుల అరెస్టులు ఎంత మాత్రం క్షంతవ్యం కాదు, దీనిని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం, ఆప్ తో పాటు మేం కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటాం, కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రతిఘటిస్తున్నాం, వెంటనే ఈ అరెస్టులను నివారించాలి'' అని ఆమె డిమాండ్ చేశారు. ఈ అరెస్టు చట్ట విరుద్ధం, అరాచక చర్య, ప్రజలు మోడీ ప్రభుత్వంతో విసిగిపోయారు అని ఆమె అన్నారు.

## ఎసిబికి చిక్కిన తస్లీమా
(మొదటి పేజీ తరువాయి)

డిఎస్‌పి సాంబయ్య, సిఐ శ్యామ్ సుందర్‌లు తెలిపిన కేసు పూర్వపరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన గుండగాని హరీష్ 108 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. స్థలం రిజిస్ట్రేషన్ కోసం మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఈ నెల మొదటి వారంలో వచ్చారు. అయితే గజానికి ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 108 ఉండగా అందుకు రూ.200 ఇస్తే రిజిస్ట్రేషన్ అవుతుందని సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ స్పష్టం చేశారు. అలా అయితేనే స్లాట్ బుక్ చేసి రిజిస్ట్రేషన్ అవుతుందని పేర్కొన్నారు. అయితే అంత డబ్బు రిజిస్ట్రార్‌కు ఇవ్వడానికి ఇష్టపడని హరీష్ వరంగల్‌లోని ఎసిబి అధికారులకు పిర్యాదు చేశాడు. అయితే శుక్రవారం తమ సూచనల మేరకు తిరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి సబ్ రిజిస్ట్రార్ తస్లీమాను ఆశ్రయించి గజానికి రెండు వందలు కాదని రూ. 150 ఇస్తానని చెప్పి బేరమాడుకుని అందు కోసం రూ. 19,200 ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలేటి వెంకటేష్‌కు ఇస్తే ఆయనే అన్ని చూసుకుంటాడని తెలిపినట్లు వివరించారు. ఆమె కోరిన డబ్బును సబ్ రిజిస్ట్రార్ మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఆలేటి వెంకటేష్‌కు ఇస్తుండగా తాము రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఎసిబి అధికారులు వెల్లడించారు. అలాగే కార్యాలయంలో సోదాలు నిర్వహించడంతో పాటు వెంకట్ వద్ద ఉన్న లెక్కలేని నగదు రూ. 1లక్షా 72 వేల నగదును కూడా స్వాధీనం చేసుకుని సబ్ రిజిస్ట్రార్ తస్మీమా మహ్మద్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆలేటి వెంకటేష్‌లను అరెస్టు చేసి వరంగల్‌లోని ఎసిబి కోర్టులో వారివురిని హాజరుపర్చనున్నామని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఎసిబి అధికారులు దాడుల సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ఈ దాడుల్లో పలువురు ఎసిబి అధికారులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

ప్రజాపక్షం/హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలపై అధికార కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. రాష్ట్రం 14 ఎంపి సీట్లను 'హస్త'గతం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నది. దీనికి సంబంధించి ఇందులో భాగంగా అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికలయ్యేంత వరకు ముఖ్య నేతలందరూ కలిసికట్టుగా, బాధ్యతలను పంచుకోవాలని, కార్యకర్తలకు వెన్నంటి ఉండాలని రేవంత్‌రెడ్డి వారికి సూచించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అమలు చేసిన 'మల్కాజిగిరి ఎన్నికల మోడల్'ను రాష్ట్ర వ్యాప్తంగా అనుసరించాలని ఇప్పటికే పార్టీ ముఖ్యులకు రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఒకటి, రెండు రోజుల్లోనే అన్ని నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. పార్లమెంట్, అసెంబ్లీ, బూత్ స్థాయిల్లో మూడంచెలుగా పార్టీ సమన్వయ కమిటీలను నియమించనున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కమిటీలో ఎఐసిసి పరిశీలకులతో పాటు అక్కడి పార్టీ ముఖ్యులు సభ్యులుగా ఉంటారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గ స్థాయి కమిటీలో ఎంఎల్‌ఎ లేదా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ , ప్రతి మండలం నుండి ముఖ్య నేతలు ఉంటారు. బూత్ స్థాయి కమిటీల్లో ఆ పరిధిలోని చురుకైన పార్టీ సభ్యులు అయిదుగురికి అవకాశం కల్పించనున్నారు. బూత్ కమిటీలో ఉండే అయిదుగురు ఈ సారి ఎన్నికల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తారని, వీరే సైనికులుగా నిలబడుతారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీ అభ్యర్థికి ఆ బూత్ లో వచ్చిన ఓట్ల సంఖ్య బూత్ కమిటీ సభ్యుల పని తీరుకు ప్రాతిపదికగా ఉంటుందన్నారు.

**బూత్ కమిటీ సభ్యులకు తగిన గుర్తింపు**

బూత్ కమిటీల్లో ఉన్న సభ్యులకు భవిష్యత్తులో తగిన గుర్తింపునిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య నేతలతో అన్నారు. పని తీరును బట్టి త్వరలో నియమించే ఇందిరమ్మ కమిటీల్లో వారికే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, అర్హులైన లబ్ధిదారుల ఎంపికను పర్యవేక్షించే బాధ్యతలను కూడా నిర్వహించేందుకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తామని ఇది వరకే సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

## కేజ్రీవాల్ అరెస్టు దుర్మార్గం

### ఆప్ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఏ పాత్రలేని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఇడి అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలను అణచివేసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపి చేతిలో ప్రధాన సాధనాలుగా మారాయని విమర్శించారు. సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఇడి అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఆప్ శ్రేణులు హైదరాబాద్, నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. బారికేడ్ లను తోసుకుంటూ బిజెపి రాష్ట్ర కార్యాలయంలోపలికి వెళ్లేందుకు ఆప్ నేతలు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. బిజెపి విభజన రాజకీయాలు సిగ్గుచేటు,'బిజెపి భారత్ చోడో', బిజెపిని గద్దె దించాలి'' అంటూ వారు పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో తోపులాట జరిగి, పరిస్థితి ఉద్రిక్తతకంగా మారడంతో దిడ్డి సుధాకర్‌తో పాటు పలువురు ఆప్ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి, అక్కడి నుండి తరలించారు. అంతకుముందు డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి ఓటమి భయం పట్టుకున్నదని, అందుకే ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత సిఎం అరవింద్‌ను అరెస్ట్ చేశారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులను వేటాడేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇడిలను ఉపయోగించుకుంటుందని దుయ్యబట్టారు. దేశంలో ప్రతిపక్షం,ప్రజాస్వామ్యం గొంతు ణిచివేసేందుకు నిరంకుశ మోడీ ప్రభుత్వం 'రాజ్యాంగ విరుద్ధ ఎమర్జెన్సీ' పాలనాను కొనసాగిస్తోందని విమర్శించారు. తక్షణమే అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌ను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని సుధాకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, అన్సారీ, ఎం.ఎ. మజీద్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ మల్లంగి, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, అధికార ప్రతినిధులు జావీద్, అక్షయ్, నేతలు మదన్ లాల్, హైదర్, టి. రాకేష్ సింగ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.






మీడియా అకాడమీ చైర్మన్‌ను సన్మానిస్తున్న సుమన్ టివి ఎండి సుమన్

## ఎంఎల్‌సిలపై అనర్హత వేటుకు వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్‌ఎస్ బి ఫారంపైన ఎంఎల్‌సిలుగా గెలుపొంది, కాంగ్రెస్‌లో చేరిన కె .దామోదర్ రెడ్డి , పి .మహేందర్‌రెడ్డిపై ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలని బిఆర్‌ఎస్ నేతలు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని ఛైర్మన్ నివాసంలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌సిలు ఎం .ఎస్ ప్రభాకర్ రావు , యాదవ రెడ్డితో పాటు పలువురు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. తమ పిటిషన్ పైన ఛైర్మన్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

## తిరస్కరించిన సుప్రీంకోర్టు
(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం వ్యవహరించబోదని స్పష్టం చేసింది. ఢిల్లీ మద్యం అవినీతి కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కవితను అరెస్టు చేసి ప్రత్యేక న్యాయస్థానం ఎదుట నిలబెట్టింది. ఈ విషయాన్ని సవాలు చేస్తూ కవిత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై ధర్మాసనం పైవిధంగా స్పందించింది. లెక్కల్లో చూపించని ధనాన్ని అక్రమంగా తరలించారన్న నిబంధనల కింద పిఎంఎల్‌ఎ చట్టం ప్రకారం ఇడి అధికారులు తనను అరెస్టు చేశారని కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఐతే ఈ విషయంపై ఇడి అధికారుల స్పందన ఏమిటో ఆరు వారాల్లో తెలియజేయాలని కూడా సుప్రీం కోర్టు ధర్మాసనం ఇడిని లిఖితపూర్వకంగా ఆదేశించింది. కవిత తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ ధర్మాసనం ఎదుట వాదించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలతోపాటు పిటిషన్‌లో సవాలు చేసిన అంశాలు కూడా విచారణకు వస్తాయని ధర్మాసనం కపిల్ సిబాల్‌కు తెలియజేసింది. ఐతే హైకోర్టుకు వెళ్ళమని మాత్రం ఈ కేసులో తనకు ఆదేశాలు ఇవ్వవద్దని సిబాల్ ముందుగానే సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ''దయచేసి చూడండి, మన దేశంలో ఏం జరుగుతోందో, అపూర్వంగా మారిపోయేవిధంగా ప్రకటనలు ఇచ్చే ప్రాతిపదికపై అరెస్టులు జరుగుతున్నాయి, ఈ విషయంలో నేను చాలా ఆందోళన పడుతున్నాను, నిరాశకు గురవుతున్నాను'' అని కపిల్ సిబాల్ అన్నారు. ''ఒక న్యాయవాదిగా మీరు నిరాశకు గురి కాకూడదు, భావోద్వేగం చెందకండి, ప్రధానమైన రిట్ పిటిషన్‌ను పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి విచారణ చేస్తాం, .జులై నెలలో ఈ విచారణ చేపడతాం, బెయిలుకు సంబంధించి మేం చాలా స్పష్టతతో ఉన్నాం, మీరు ట్రయల్ కోర్టుకు వెళ్ళాల్సిందే, వారినే ఆశ్రయించండి, మీరు అడుగుతున్నట్టుగా మేం చేయలేం, రాజ్యాంగంలోని 32వ అధికరణ కింత ప్రతి విషయంలోనూ అందరూ నేరుగా సుప్రీంకోర్టుకే వచ్చేస్తున్నారు, ఇది సాధ్యం కాదు, వీలు కాదు'' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం కపిల్ సిబాల్‌కు స్పష్టం చేసింది. తాత్కాలిక ఉపశమనం కోసం తాము ట్రయల్ కోర్టుకు వెళతామని సిబాల్ అన్నారు. మార్చి 15వ తేదీన కవితను ఇడి అధికారులు హైదరాబాదులో అరెస్టు చేశారు. ఈనెల 23న ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు. కాగా కవిత తాజాగా న్యాయవాది నితేశ్‌రాణా ద్వారా మరో పిటిషన్ దాఖలు చేశారు. ''ఇడి తీసుకున్న చర్యలన్నింటినీ రద్దు చేయండి, వారి ఆరోపణలు చట్ట విరుద్ధం, ఏకపక్షం, రాజ్యాంగ విరుద్ధం, వివాదాస్పదం'' అని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా కవిత వాదనలను తిరస్కరించారు. సౌత్ గ్రూపులో కవిత భాగస్వామిగా ఉన్నారని, ఆమె రూ.100 కోట్లు ముడుపులను ఢిల్లీ ప్రభుత్వానికి సమర్పించారని, ఆమెకు తెలిసే ఇవన్నీ జరిగాయని ఇది అధికారులు పేర్కొన్నారు.

## డిప్యుటేషన్ల దందా
(మొదటి పేజీ తరువాయి)

పాతుకుపోయిన సిబ్బందిని తమ సొంత స్థానాలకు పంపేందుకు ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసింది. దీంతో 85 మంది రిలీవ్ అయ్యారు. పొరుగున ఉన్న ములుగు, భూపాపలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం నుండి డిప్యుటేషన్లపై వచ్చారు. కాగా ప్రభుత్వం డిప్యుటేషన్లతో పాటు వర్క్ ఆర్డర్ విధానాన్ని సైతం రద్దు చేయడంతో ఆస్పత్రులు సిబ్బందితో నిండుకున్నాయి. ఈ జిల్లా నుండి డిప్యుటీ జిల్లా మెడికల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, సిహెచ్‌ఒ, ఎల్‌టిలు, ఎఎన్‌ఎంలు, పబ్లిక్ హెల్త్ నర్సులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సూపర్ వైజర్లు, స్టాఫ్ నర్సులు, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు రిలీవ్ అయ్యారు. ప్రభుత్వం డిప్యుటేషన్లు రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఉన్న ఒక చిన్న పదం ఇప్పుడు తంటాతెచ్చిపెట్టింది. దీనిని ఎవరికి నచ్చినట్లుగా వారు ఆపాదించుకుని మళ్లీ అక్రమ డిప్యుటేషన్లకు తెరలేపారు. కలెక్టర్ అనుమతితో అత్యవసరమైతే డిప్యుటేషన్లు ఇచ్చే అవకాశాన్ని డిఎంహెచ్‌ఓలకు ఇవ్వడంతో దందా మొదలైంది. ఇప్పటికే సుమారు 40 మందికి పైగా ఆ చిన్న పదాన్ని వాడుకుని డిప్యుటేషన్లు కోసం సిద్ధమయ్యారు. వీరిలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డిప్యూటీ సిహెచ్‌ఒ, హెచ్‌ఇఒలు, హెల్త్ సూపర్వైజర్లు ఉన్నారు. వీరి జాబితా డిఎంహెచ్‌ఓ కార్యాలయం నుండి ఆమోదం కోసం కలెక్టర్ ఛాంబర్‌కు చేరుకుంది. మరో ప్రక్క కలెక్టర్ ఆదేశాలు లేకుండా కూడా కేవలం మౌఖికంగా తెలియజేసి డిప్యుటేషన్లు ఇస్తున్నట్లు సైతం ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారం వైద్య ఆరోగ్యశాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.

**ఒక్కో పోస్టుకు ఒక్కో ధర**

వైద్య ఆరోగ్యశాఖలో సాగుతున్న అక్రమ డిప్యుటేషన్లు దళారులకు కాసులు కురిపిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోస్టును బట్టి దళారులు రేటు కడుతున్నట్లు తెలుస్తోంది. మండలం నుండి జిల్లా కేంద్రానికి వెళ్లడానికి చాలా మంది ఆసక్తి ఉండటంతో దళారుల పంట పండుతున్నట్లు సమాచారం. గెజిటెడ్ పోస్టుకు రూ.3 లక్షల వరకు, నాన్‌గెజిటెడ్ పోస్టుకు రూ.1 లక్ష నుండి రూ.2 లక్షల వరకు పలుకుతున్నట్లు వినికిడి. ప్రభుత్వం రద్దు చేసిన డిప్యుటేషన్లు అత్యవసరం పేరిట మళ్లీ మొదలు కావడం, లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఎవరినీ బతకనివ్వరు
(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సమావేశ వివరాలను వెల్లడించారు. ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం అన్యాయమని, ఇదొక బ్లాక్ డేగా కూనంనేని అభివర్ణించారు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న ఇద్దరు సిఎంలను ఇప్పటికే అరెస్ట్ చేశారన్నారు. ఇండియా కూటమి నుండి బయటకు రావాలని, కేజ్రీవాల్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారని, అనేక వేధింపులకు గురిచేసినా ఆయన బయటకు రాకపోవడంతోనే ఆలస్యంగా అరెస్ట్ చేశారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ప్రధాని మోడీ అణచివేస్తున్నారని విమర్శించారు. పెద్ద షాడిస్టు, నియంతగా మోడీ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో మోడీలాంటి దుర్మార్గమైన ప్రధానిని చూడలేదన్నారు. సిఎఎ చట్టాన్ని అమలు చేసి, భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చి, దేశ అధ్యక్షుడిగా శాశ్వతంగా ఉండేందుకు నరేంద్రమోడీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. మోడీ అధికారంలోనికి వచ్చిన తర్వాత ఏ ఒక్క బిజెపి నేతలను కూడా అరెస్ట్ చేయలేదన్నారు. సిసోడియాను అరెస్ట్ చేసినప్పుడే కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదని, వారి మధ్య అవగాహన ఉన్నందునే అప్పుడు అరెస్ట్ చేయలేదని విమర్శించారు.

**బాండ్స్ రూపంలో బిజెపికి అక్రమ సంపాదన**

లాటరీ కంపెనీ, మెయిల్ కంపెనీలకు చెందిన అక్రమ సంపాదన బాండ్స్ రూపంలో బిజెపికి చేరాయని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఈ బాండ్స్ విధానాన్ని సిపిఐ, సిపిఐ(ఎం) వ్యతిరేకించామని గుర్తు చేశారు. దొంగల నుండి దోపిడీదారులు దోచుకున్నట్టు అక్రమ సంపాదనను మోడీ బాండ్స్ రూపంలో తీసుకున్నారని దుయ్యబట్టారు. దీనిపైన మోడీతో పాటు ఇతరుపైన కూడా కేసుల నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాండ్స్‌రూపంలో వచ్చిన అక్రమ సంపాదను సుప్రీంకోర్ట్ సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని, తద్వారా న్యాయస్థానంపై మరింత విశ్వాసం పెరుగుతుందని ఆయన సుప్రీంకోర్ట్‌ను కోరారు. చట్టబద్ధత రూపంలో బిజెపి రూ.6వేల కోట్లు తిన్నదన్నారు. బాండ్స్ ద్వారా సేకరించిన అక్రమ డబ్బుతో ప్రతిపక్షాలను, 'ఇండియా కూటమి'ని ధ్వంసం చేసి, 400 స్థానాల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని, మరోవైపు మేధావులు, సాఫ్ట్ వేర్ నిపుణులతో ఇవిఎం యంత్రాలను ట్యాపింగ్ చేసేందుకు .ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

**కమ్యూనిస్టులను కాంగ్రెస్ కలుపుకొని పోవాలి**

లోక్‌సభ ఎన్నికలు, కాంగ్రెస్ ఎన్నికల అవగాహన అంశంపైన సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో చర్చించామని, కాంగ్రెస్‌తో సీట్లు సర్దుబాటుపై స్పష్టత వచ్చిన తర్వాత మరోసారి చర్చించి, తగిన నిర్ణయం తీసుకుంటామని కూనంనేని వెల్లడించారు. ప్రమాదకరమైన బిజెపిని ఎదుర్కొనే క్రమంలో కాంగ్రెస్ పార్టీ సిపిఐ, సిపిఐ(ఎం) కలుపుకుపోవాలని కూనంనేని సాంబశివరావు సూచించారు. కమ్యూనిస్టు పార్టీలను కూడా కాంగ్రెస్ కలుపుకుని పోతే మంచిదన్నారు. దక్షిణాదిలో బిజెపి రాకుండా జాగ్రత్త వ్యవహరించాలన్నారు. బిజెపిని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సమర్థవంతమైన పాత్రను పోషించడంలేదని విమర్శించారు. తెలంగాణలో సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసీటులో కూడా సర్దుబాటు జరగలేదని, తమిళనాడు రాష్ట్రాన్ని చూసైనా నేర్చుకోవాలని ఆయ కాంగ్రెస్‌కు సూచించారు. మరోసారి బిజెపి అధికారంలోనికి వస్తే దేశంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను బతకనివ్వబోదని, ఇక్కడ సిఎం రేవంత్‌రెడ్డికి కూడా కష్టమేనని వ్యాఖ్యానించారు. మునుగోడు ఉప ఎన్నికలో బిజెపి ప్రయత్నాలను తాము అడ్డుకున్నామని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్రంలో బిఆర్‌ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీ బతకబోదని, బిజెపి రాక్షస పార్టీగా మారిన నేపథ్యంలో బిఆర్‌ఎస్ ఉండాలని ఆకాంక్షించారు. ప్రధాని పర్యటన సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారని, తమను అరెస్ట్ చేయడమేంటేనే తమను చూసి మోడీ భయపడుతుందని స్పష్టమవుతుందన్నారు.

**ఆ కేసులో మోడీని వదిలిన ఇడి**

బిర్లా, సహారా కంపెనీలపై ఐటి దాడులు నిర్వహిస్తే, 2013లో అప్పటి గుజరాత్ సిఎం నరేంద్రమోడీకి బిర్లా కంపెనీ రూ. 24 కోట్లు, సహారా కంపెనీ రూ.40 కోట్లు చెల్లించినట్టుగా ఆధారాలు లభించాయని, దీనిపైన ఇడి ఎందుకు విచారణ చేపట్టలేదని కూనంనేని ప్రశ్నించారు. ఈ కేసులో మోడీపై ఇడి కేసు నమోదు చేయకుండా వదిలిపెట్టిందని విమర్శించారు. అమిత్‌షా కొడుకు రూ.50 కోట్లతో వ్యాపారం మొదలు పెట్టి, ఒక సంవత్సరంలోనే 16 వేల రెట్లు రూ. 80వేల కోట్ల వరకు సంపాదించారని తెలిపారు. సృజనాచౌదరి లాంటి వారి బిజెపిలోచేరగానే పవిత్రులయ్యారా? అని నిలదీశారు.

**బిజెపికి 270 స్థానాలు దాటవు: అజీజ్ పాషా**

సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ సిఎఎ తర్వాత ఎంపిఆర్‌ను కూడా అమలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ లాంటి వారి అరెస్ట్ ప్రభావం బిజెపిపై పడుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 270 ఎంపి స్థానాలు దాటబోవన్నారు. మతం ఆధారంగా పౌరసత్వాలను ఇస్తున్నారని విమర్శించారు. ప్రతి రోజూ 350 మంది భారతదేశ పౌరసత్వాన్ని వదులుకుని వెళ్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## 6 రోజులు కస్టడీ
(మొదటి పేజీ తరువాయి)

ఇడి పేర్కొంది. ఆయనను విచారించడానికి పది రోజులు తమ కస్టడీకి పంపించాలని కోర్టును ఇడి అధికారులు కోరారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు భారీ భద్రత మధ్య కేజ్రీవాల్‌ను అధికారులు కోర్టులో హాజరుపరిచారు. ఆయన తరపున అభిషేక్ మను సింఘ్వి కోర్టులో వాదిస్తూ, భారతదేశ చరిత్రలో మొదటిసారి పదవిలో ఉన్న ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆరోపణలు చేసి అరెస్టు చేశారని విమర్శించారు. అరెస్టు చేసే అధికారం ఉంటే ఉండవచ్చుననీ, కానీ అరెస్టు చేసే అవసరం, అరెస్టు చేసే అధికారం ఈ రెండింటికీ సమానస్థాయి లేదని, ఈ రెండూ సరిసమానం కాదని హెచ్చరించారు. ఆయనను అరెస్టు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. ''కేజ్రీవాల్‌ను రిమాండ్‌కు పంపించాలని రొటీన్ పద్ధతిలో ఆలోచించవద్దని సింఘ్వి కోరారు. అలా చేయాలంటే చాలా జాగ్రత్తగా ఆచితూచి సమధర్మంతో న్యాయబద్ధంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సింఘ్వి కోర్టును కోరారు. కేజ్రీవాల్ తరపున కోర్టులో వాదిస్తున్న మరో న్యాయవాది విక్రమ్ చౌధురి మాట్లాడుతూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేటే న్యాయమూర్తిగా, వ్యవహర్తగా అన్ని బాధ్యతలూ నిర్వహిస్తోందని విమర్శించారు. ట్రయల్ కోర్టులో రిమాండ్ విచారణ తర్వాత తాము సుప్రీకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన చెప్పారు. లెక్కల్లో చూపించకుండా సుమారు రూ.600 కోట్లు అక్రమంగా తరలించారన్న కేసులో కేజ్రీవాల్‌కు రూ.45 కోట్లు ముట్టాయని ఇడి పేర్కొంది. హవాలా మార్గంలో ఈ సొమ్మును గోవా ఎన్నికల ప్రచారంలో ఖర్చు చేశారని కూడా ఇడి అధికారులు కోర్టుకు తెలియజేశారు. సౌత్ గ్రూపు నుండి రూ.100 కోట్లు ఆయన డిమాండ్ చేశారని, పంజాబ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఈ మొత్తాన్ని ఆయన ఆశించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదించారు.ఇడి అధికారులు అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు నుండి ఉపసంహరించుకున తరువాత కొద్ది సేపటికే ఆయనను ట్రయల్ కోర్టు ఎదుట హాజరుపరిచారు. 2021—22 సంవత్సరంలో ఢిల్లీ ప్రభుత్వం రూపొందించిన ఎక్సైజు విధానాన్ని అమలు చేయడానికి సౌత్ గ్రూపు నుండి కోట్లాది రూపాయలు ముడుపులుగా చెల్లించాలని కేజ్రీవాల్ కోరారని ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఎదుట ఇడి అధికారులు చెప్పారు. ఫోన్ కాల్ వివరాలన్నీ ఈ అనుమానాలను బలపరుస్తున్నాయని అధికారులు కోర్టుకు చెప్పారు. 'ఆప్' అనేది ఒక వ్యక్తి కాదనీ, ఒక సంస్థ అనీ, అందువల్ల అందులో ప్రతి ఒక్కరూ బాధ్యులేనని ఇడి కోర్టులో వాదించింది.

**సుప్రీంలో కేజ్రీవాల్ పిటిషన్ ఉపసంహరణ**

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనను అక్రమంగా అరెస్టు చేసిందంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన పిటిషన్‌ను శుక్రవారం ఉపసంహరించుకున్నారు. తాము ఈ విషయాన్ని పరశీలిస్తామని, విచారణ చేస్తామని సుప్రీంకోర్టు భరోసా ఇచ్చిన వెంటనే ఆయన తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ చేస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యానగల ధర్మాసనం స్పష్టం చేసిన కొద్ది గంటలకే కేజ్రీవాల్ తన పిటిషన్ ఉపసంహరించుకున్నారు. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జస్టిస్ ఖన్నా ధర్మాసనాన్ని ఆశ్రయించాలని సింఘ్వికి చంద్రచూడ్ సలహా ఇవ్వగానే ఆయన వెంటనే అక్కడికి వెళ్ళారు. ఐతే అప్పటికే అక్కడ బిఆర్‌ఎస్ పార్టీ నేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కుమార్తె కవితను ఇదే కేసులో ధర్మాసనం విచారణ చేస్తున్నది. ఆ తర్వాత మళ్ళీ సింఘ్వి ధర్మాసనాన్ని ఈ కేసు విషయమై ఆశ్రయించారు.కేసును తాము చేపడతామని చెప్పగానే సింఘ్వి పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. కాగా ఇడి తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అట్లాడుతూ, పిటిషన్ ఉపసంహరణలోతమకు అభ్యంతరం లేదని చెప్పారు. పిటిషన్ ఉపసంహరించుకున్నందువల్ల కేజ్రీవాల్‌ను ట్రయల్ కోర్టుకు హాజరుపరచవచ్చునన్నారు. చార్జిషీటులో ఇడి అధికారులు అనేకసార్లు కేజ్రీవాల్ పేరును లిఖిత పూర్వకంగా ప్రస్తావించారు.

## సోషల్ మీడియా దోహదం
(మొదటి పేజీ తరువాయి)

నోటిఫికేషన్ ముగిసిన వెంటనే సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో తాను సమావేశమై, దశల వారీగా వీలైనంత తొందరలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీనివాస్ రెడ్డి హామీనిచ్చారు. ప్రముఖ దర్శకులు తమ్మిరెడ్డి భరద్వాజా మాట్లాడుతూ నాడు ఉమ్మడి రాష్ట్రంలో ప్రెస్ అకాడమీకి తొలి చైర్మన్‌గా సమర్థవంతంగా సేవలను అందించి, నేడు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్‌గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో ఆ పదవికి మరింత గౌరవం పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విరాహత్ అలీ మాట్లాడుతూ తమ సంఘానికి ఎంత చరిత్ర ఉన్నదో ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్‌కు అంతే చరిత్ర ఉందన్నారు. నాటి నుండి నేటి వరకు తమ సంఘానికి అనుబంధగా పని చేస్తూ, సినిమా బీట్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ కృషి చేయడం అభినందనీయమన్నారు. సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీర శంకర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్, ఐజెయు జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, వయోధిక జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ రావు,ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, లక్ష్మీ నారాయణ, సహాయ కార్యదర్శి అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణం స్వీకారం
(మొదటి పేజీ తరువాయి)

ఉండగా, గవర్నర్ రవి, సిఎం స్టాలిన్ మధ్య ఏర్పడిన వివాదం సమసిపోవడంతో పొన్ముడి ప్రమాణం స్వీకారానికి మార్గం ఏర్పడింది. పొన్ముడి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో స్టాలిన్, రవిల మధ్య వాగ్వాదం ముగిసింది. పొన్ముడిని మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఉన్నత విద్యను కేటాయించాలని స్టాలిన్ మార్చి 13న రవికి లేఖ రాగా, పొన్ముడి నేరారోపణపై మాత్రమే స్టే వచ్చిందని, శిక్షణను పక్కన పెట్టలేదని గవర్నర్ తిరస్కరించారు. దీంతో డిఎంకె ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ విషయాన్ని విన్న అత్యున్నత న్యాయస్థానం, పొన్ముడిపై విధించిన శిక్షను సస్పెండ్ చేసిన తర్వాత కూడా గవర్నర్ రవిని తిరిగి చేర్చుకోవడానికి నిరాకరించినందున, అతని ప్రవర్తనపై సుప్రీంకోర్టు 'తీవ్ర ఆందోళన' వ్యక్తం చేసింది. దీనిపై 24 గంటల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రవి అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరిస్తున్నారని గమనించిన ప్రధాన న్యాయమూర్తి డి వై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పొన్ముడిని తిరిగి నియమించడం రాజ్యాంగ నైతికతకు విరుద్ధమని గవర్నర్ ఎలా చెప్పగలరని ఆశ్చర్యపోవడం గమనార్హం.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి : చాడ వెంకట్ రెడ్డి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలను, ప్రశ్నించే గొంతులను లేకుండా చేస్తోందన్నారు. ఎన్నికల సీట్ల సర్దుబాటు అంశంలో కాంగ్రెస్ గౌరవంగా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలని సూచించారు. బిజెపి, ఎన్‌డిఎను ఓడించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని, ఇందుకు అందరినీ కలుపుకునే అంశంలో కాంగ్రెస్ పెద్దన్న పాత్రను పోషించాలని తెలిపారు. వామపక్షాలు దేశ,రాష్ట్ర ప్రయోజనాలను ఆలోచిస్తాయన్నారు. తీవ్రమైన కరువు, వడగండ్ల వానతో పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద కేంద్ర ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం కోరాలని రాష్ట్ర ప్రభుత్వానికి చాడ వెంకట్ రెడ్డి సూచించారు.



## మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులకు వ్యతిరేకంగా

# నేడు వామపక్షాల నిరసన

**ప్రజాపక్షం / హైదరాబాద్:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులను సమావేశం తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈనెల 23వ తేదీన రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాదులోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశాయి. తెలంగాణ రాష్ట్ర వామపక్ష పార్టీల సమావేశం మార్చి 22న సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం మాకినేని బసవపున్నయ్య భవన్‌లో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్దన్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో వామపక్ష పార్టీ నాయకులు ఎన్.బాలమల్లేష్ (సిపిఐ), ఎస్.వీరయ్య, డి.జి.నరసింహారావు (సిపిఐ(ఎం), రమ (సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్), గోవర్ధన్ (సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ), వనం సుధాకర్ ఎంసిపిఐ(యు), తేజ (ఎస్‌యుసి(యు), కోటేశ్వరరావు (సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ, ప్రసాద్ (సిపిఐ (ఎంఎల్) పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలైన ఈడి, ఐటి, సిబిఐలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటున్నదని విమర్శించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకుండా, బిజెపియేతర రాష్ట్రాల్లో మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నదన్నారు. దీనిలో భాగంగానే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తోపాటు, బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కవితను అరెస్టు చేసిందని పేర్కొన్నారు. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేసి ఎన్నికల్లో దెబ్బతీయాలని చూస్తున్నదని విమర్శించారు. ఈ నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని, మార్చి 23న జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# బిఆర్‌ఎస్‌కు ఓటు వేయొద్దు

## ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తోందని ప్రధాని మోడీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడారు. మాదిగ జాతి అభివృద్ధికి వ్యతిరేకంగా పని చేస్తున్న బిఆర్‌ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయవద్దని మాదిగ సామాజిక వర్గానికి ఆయన పిలుపునిచ్చారు. జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందని అన్నారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులను ఓడించేందుకు ఎమ్మార్పీఎస్ పని చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఎన్నో సార్లు హామీలు ఇచ్చి మోసం చేశారని అన్నారు.



రెండు పార్టీలను ఓడగొట్టడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. మాదిగ జాతి జాతీయ నేతగా చెలామణి అవుతున్న బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాదిగ జాతి నేతలను రాజకీయంగా ఎదగనివ్వలేదని అన్నారు. రాజకీయంగా మాదిగ జాతిని అణచివేస్తూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాల సామాజిక వర్గంలోని ఉపకులం బైండ్ల వర్గానికి చెందిన ఆయన ఎమ్మార్పీఎస్ నేపథ్యం నుంచి ఎదిగిన ఆరూరి రమేశ్, తాటికొండ రాజయ్య, పసునూరి దయాకర్‌లను ఎదగనివ్వకుండా కట్టడి చేశారని అన్నారు. మాజీ సీఎం కెసిఆర్‌కు లేనిపోని మాటలు చెప్పి రాజయ్యకు వచ్చిన డిప్యూటీ సీఎం పదవిని బర్తరఫ్ చేయించడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బిజెపి అత్యధిక సీట్లు గెలువడానికి ఎంఆర్‌పిఎస్ పని చేస్తుందన్నారు.

# ఎన్నికల్లో సహకారం అందించాలి

## మల్లు రవిని సన్మానించిన సంపత్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**కాంగ్రెస్ నాగర్ కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి మల్లు రవి ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మల్లు రవిని సంపత్ కుమార్ సన్మానించారు. లోక్‌సభ ఎన్నికల్లో తనకు సహకారం అందించాలని సంపత్ కుమార్‌ను కోరారు. కాంగ్రెస్ విజయానికి చేయాల్సిన వ్యూహాలపై వారిద్దరూ చర్చించారు. సంపత్ కుమార్, మల్లు రవి ఇద్దరూ కలిసి సిఎం నివాసానికి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.



# బిజెపి పాలనలో దళితులపై పెరిగిన దాడులు

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. బాల నరసింహ్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు తీవ్రస్థాయిలో పెరిగాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ్మ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో శుక్రవారం టి. లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశానికి హాజరైన బాల నరసింహ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో దళితులపైన దాడులు జరుగుతున్నాయన్నారు. మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయడం కోసం నరేంద్ర మోడీ ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ పరివార్ శక్తులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో గోమాంస తిన్నాడని అక్లాక్‌ను హత్య చేయడం ఘటన నుండి మొదలుకొని అనేక చోట్ల మత ఉన్మాదం పెరిగిపోయిందన్నారు. దళితుల మీద దాడులు జరగడం ఆ దాడుల్లో ప్రత్యక్షంగా ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్‌పరివార్ శక్తులు ఉండటం దేశంలో ఉన్న దళిత జనాభా, దళిత ప్రజానీకం గమనించాల్సిన అవసరం ఉందన్నారు.

**సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించిన గత ప్రభుత్వం..**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో దళితులకు అనేక రకాల వాగ్దానాలు తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చినా కూడా ఎక్కడ అమలు కాలేదని తెలిపారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ చట్టం కింద కేటాయించిన కోట్లాది నిధులు దారిమళ్లించి, దొరగడీలలోకి




వెళ్లాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు దళితులలో ఉన్న 59 ఉప కులాలు, వారి వారి స్థితిగతులపై ప్రభుత్వాలు ఎక్కడ కూడా మాట్లాడకపోవడం 75 ఏళ్ల స్వతంత్ర్య భారతదేశంలో దళితులను ఓటు బ్యాంకుగానే చూశారన్నారు. దళితుల అభివృద్ధి కోసం ఏ ఒక్క ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోకపోవడం గమనించాల్సిన విషయమన్నారు. భారతదేశంలో నరేంద్ర మోడీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తొలగిస్తామని ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్‌పరివార్ శక్తుల ద్వారా బాహాటంగానే ప్రచారం చేస్తున్న క్రమంలో దళితులంతా ఏకమై బిజెపిని ఈ భారతదేశంలో బొంద పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దళితులంతా ఏకమై బిజెపిని ఓడించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

**ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకోవాలి..**

దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దళితుల రక్షణ కోసం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని రక్షించడం కోసం, దళితులకు భూమి ఇళ్లు ప్రభుత్వాలు పక్కా స్థలాలు ఇచ్చి నిర్మించేంతవరకు, దళితుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన నిధులను కేటాయించి, అభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. సబ్‌ప్లాన్ చట్టం నిధుల ద్వారా దళితవాడలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వల్ల అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని కోరారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం నుండి బిజెపి ప్రభుత్వానికి ఒక హెచ్చరికలు జారీ చేస్తున్నామని దళితులను మోసం చేసే కుట్ర చేస్తున్న దళిత ద్రోహులను కూడా హెచ్చరిస్తూ దళితుల రక్షణ కోసం మీరు ఇటు వైపు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో కె. ఏసురత్నం, మారుపాక అనిల్ కుమార్, బి.లక్ష్మి పతి, జె. కుమార్, ఎ.రాజ్ కుమార్, సహదేవ్, లక్ష్మి నారాయణ, వై. ఉష్రశీ, సుగుణ, డి. రాములు, జున్ను, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ జెఎన్‌యులో ప్రజాస్వామ్యానికి పాతర

## లెఫ్ట్ యూనిటీ అభ్యర్థి స్వాతి సింగ్‌పై అనర్హత వేటు వేయడం గర్హనీయం

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ప్రజాస్వామ్యాన్ని, క్యాంపస్ ఎన్నికలను నిర్వీర్యం చేసే జెఎన్‌యు అడ్మినిస్ట్రేషన్ చర్యను ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఖండించింది. జెఎన్‌యుఎస్‌యు ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి పదవికి లెఫ్ట్ యూనిటీ అభ్యర్థి స్వాతి సింగ్‌పై చివరి నిమిషంలో అనర్హత వేటు వేయడాన్ని ఎఐఎస్‌ఎఫ్ తీవ్రంగా ఖండించింది. నామినేషన్, పరిశీలన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు తలెత్తలేదని, చట్టవిరుద్ధమైన పద్ధతిలో అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడం జెఎన్యులోనే కాకుండా దేశమంతటా ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఖూనీ చేసే ప్రయత్నమని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ ఒక ప్రకటనలో విమర్శించారు. బిజెపి నేతృత్వంలోని పాలన ప్రజాస్వామ్యాన్ని, పారదర్శకతను పూర్తిగా దెబ్బతీసిందని, 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగే జెఎన్‌యుఎస్‌యు ఎన్నికలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. వామపక్ష ఐక్యత విజయం ప్రజలకు రాజకీయ సందేశాన్ని పంపుతుందని ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు ఉన్న పరిపాలనకు తెలుసునన్నారు. ప్రజాస్వామ్యం, వామపక్షాల విజయాన్ని అడ్డుకునేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఏ స్థాయికైనా వెళ్లొచ్చని, కుటిల చర్యలకు పాల్పడతాయని స్వాతి సింగ్ నామినేషన్ రద్దుతో రుజువైందన్నారు.

పోలింగ్‌కు కేవలం ఏడు గంటల ముందు అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడం ప్రజావ్యతిరేక, మితవాద శక్తి అందుకున్న ఆదేశాల ఆధారంగా పరిపాలన, ఎన్నికల సంఘం పనిచేస్తున్నాయని రుజువు చేస్తుందన్నారు. స్వాతి సింగ్ స్క్రూటినీ ప్రక్రియను క్లియర్ చేసినందున, క్యాంపస్ నుండి ఆమె రస్టికేషన్‌ను హైకోర్టు రద్దు చేసినందున, ఎన్నికల చివరి గంటల్లో ఆమె నామినేషన్‌ను రద్దు చేయడానికి తార్కిక లేదా బలమైన కారణం లేదన్నారు. ఎన్నికలను ఆర్‌ఎస్‌ఎస్ విద్యార్థి విభాగం ఎబివిపికి అనుకూలంగా మార్చేందుకే రద్దు ఉత్తర్వులు జారీచేశారని, తొలిదశ నుంచి ఎన్నికలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. క్యాంపస్ లోపల హింస, ద్వేషాన్ని ప్రచారం చేసే ఎబివిపిని ఓడించడానికి జెఎన్‌యు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు ఉన్న పరిపాలనకు తెలుసునన్నారు. జెఎన్‌యు అడ్మినిస్ట్రేషన్ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యను దేశంలోని విద్యార్థులు, అభ్యుదయ, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఖండించాలని, జెఎన్‌యుతో పాటు భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పోరాటంలో పాల్గొనాలని వారు కోరారు.




# తెలంగాణ లేబర్ పార్టీ.. కాంగ్రెస్‌లో విలీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ లేబర్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైంది. ఎంఎల్‌సి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిండెట్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షుడు రమేష్, ఆయనతో పాటు వందలాది మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో విలీనమైమయ్యారు. వారికి మహేశ్ కుమార్ గౌడ్ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉండే పార్టీ అన్నారు. లేబర్ పార్టీని మనస్ఫూర్తిగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నా రు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎఐసిసి ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సూచన మేరకు లేబర్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకున్నామని తెలిపారు. పార్టీలో వీరికి తగిన గౌరవం, ప్రాధాన్యత ఇస్తామని మహేశ్ కుమార్ గౌడ్ వారికి భరోసా ఇచ్చారు.

# పాటరాయాలంటే కత్తుల వంతెన దాటాలి..కన్నీటి సంద్రం చూడాలి

## పల్లెల్లో పనిచేసేవారు పాడుకున్న పాటలే నా రచనలకు పునాది

### ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

**ప్రజాపక్షం/సూర్యాపేటః** పాట రాయాలంటే కత్తుల వంతెన దాటాలని, కన్నీటి సంద్రం చూడాలని, పల్లెలో పనిచేసే వారు పాడుకున్న పాటనే నా రచనలకు పునాది అని ప్రముఖ సీనిగేయరచయిత,జాతీయ ఉత్తమ గేయరచయిత అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ అన్నారు. ప్రపంచ కవిత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి మనమ్ వికాసవేదికఅధ్యక్షుడు,సాహితి పిపాసి పెద్దిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పివిసి ఎండి. మీలామహదేవ్ అధ్యక్షతన నిర్వహించిన అశోక్ తేజతో ఓ సాయంత్రం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చేసి సాహితిప్రియులను సుద్దాల అశోక్‌తేజ ఓలలాడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటయోధుడు తన తండ్రి సుద్దాల హనుమంతుడిలోని డిఎన్ఏ, తల్లి జానకమ్మలోఎని జన్యువు తన పాటలకు ఆధారమని, నాలోని ప్రతిభ తన అమ్మనాన్నలకు చెందుతుందని ప్రకటించారు. కత్తిని కౌగిలించుకోవడమే కవిత్వమని, పాట రాయడం తెలిసిన వారికి చాలా సులువని, రాయడం తెలియని వారికి ఎన్నడు రాని విద్య అని వివరించారు. ప్రజా గళంలోనే కావ్య లక్షణం ఉంటుందన్నారు. ప్రతి పాటకు సిగ్నేచర్, అండర్‌లైన్ మెరుపులా ఆకట్టుకుంటుందని, మహాకవి కాళీదాస్ గురించి మల్లినాధుడు, చామకూర వెంకటస్వామి గురించి తాపీ ధర్మారావు, శ్రీశ్రీ మహాప్రస్థానంకు ముందు మాట చలం వివరించడం కవిత్వానికి



ఉన్న గొప్పదనమన్నారు. తాను కవిగా, వక్తగా, రసజ్ఞుడుగా ముప్పేటగా ఉన్నానని, ఎక్కడ నెగ్గా లో, ఎక్కడ తగ్గాలో తెలిసినవాడే గొప్పవక్త అన్నారు. తన శ్రమకావ్యం, నేను అడవిని మాట్లాడుతున్నా శూద్రగంగావతరిణి ప్రత్యేక రచనలుగా నిలుస్తాయన్నారు. పాటను ద్వితీయ శ్రేణి కవిత్వంలాగా పరిగణిస్తున్నారని, నన్నయ్య,తిక్కన,యఱ్ఱప్రగడకు ఉన్న గౌర వం అన్నమయ్యకు లేదన్నారు. కవిత్వం పుట్టింది పాటతోనేనని పనిపాట అన్నారు. కాని పని పద్యం, పనిశ్లోకం అనలేదన్నారు. పాటను కావ్యం లాగా రాయాలనే ఆలోచన ఉన్నదని, 18 పద్యాల విలువు, 18 కావ్యాల విలువ ఒకటి ఉండాలన్నదే తన సంకల్పమన్నారు.

ఇప్పటి వరకు 1950 సినిమాలలో 2950 పాటలు, 2వేల ప్రజాగేయాలు రాసినట్లు వివరించారు. ప్రముఖ కవి, జర్నలిస్టు ప్రసేన్ ప్రధానవక్తగా సుద్దాల అశోక్‌తేజ పాటలను సమీక్షించా రు. మరో ఘంటసాలగా పేరుందిన బుర్రి వెంకటేశ్వర్లు బృందం ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. గుండా రమేష్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ప్రముఖ రైస్ మిల్లర్ కక్కిరేణి చంద్రశేఖర్,క్లాత్ మార్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గందూరి శంకర్, ప్రముఖ రియల్టర్ బొలిశెట్టి మధు, గెల్లి అంజనప్రసాద్, శేఖర్, చిట్టిపాక వీరయ్య,వీరారెడ్డి,యామ ప్రభాకర్, బోనగిరి భాస్కర్, శీల అవిలేను కవులు, కళాకారులు, సాహితి ప్రియు లు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇంత గొప్ప సాహితి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దురంధరుడు పెద్దిరెడ్డి గణేష్, సహకరించిన సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, ముఖ్య అతిదిగా విచ్చేసిన రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రధాన వక్తగా విచ్చేసిన కవి ప్రసేన్, ఆహుతులను, ఆహ్వానితులను, కవులను ఘనంగా సన్మానించారు.




# మాదిగ హక్కులను రాజకీయలబ్ధి కోసం వాడుకోవడం సరైంది కాదు : సంపత్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాజ్యాంగ బద్ధమైన మాదిగల హక్కులను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం మంద కృష్ణ మాదిగకు సరైంది కాదని ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ సూచించారు.ఎప్పుడు ఎన్నికలు వచ్చిన, మాదిగల, రిజర్వేషన్ అంశంలో కుట్ర జరుగుతోందని విమర్శించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం 341/ఎ ద్వారా సవరణ చేసి రాష్ట్రాలకు నిర్ణయాధికారం కట్టబెట్టాలన్నదే ఉద్దేశ్యమని, దీని విషయంలో కాంగ్రెస్ పార్టీ ముందడుగు వేసిందని, ఈ విషయం మంద కృష్ణ మాదిగనే చెప్పారని గుర్తు చేశారు.

వర్గీకరణ అంశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే అన్ని కమిషన్లను వేసిందని, 2005 లో ఉషా మెహ్రా కమిషన్ వేసినట్టు వివరించారు.బిఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిగలపై వివక్షత చూపిందని,ఆ రోజు రేవంత్ రెడ్డి మాత్రమే అసెంబ్లీలో తనతో గొంతు కలిపిన విషయాన్ని గుర్తు చేశారు.పదేళ్ల కాలంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో బిఆర్‌ఎస్ మాదిగలకు ద్రోహం చేశాయని విమర్శించారు.అటువంటి ద్రోహులతో మంద కృష్ణ మాదిగ కలిసి, తమ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్నారని, బిజెపి ముసుగులో ఉండి మాట్లాడుతున్నారని, ఆయన మాదిగ జాతి ప్రయోజనాలను నరేంద్ర మోడీ కాళ్ళ దగ్గర తాకట్టు పెట్టారని మండిపడ్డారు. తనకు ఎంపి టికెట్ ఇవ్వక పోయినా బాధ లేదని, కాంగ్రెస్ పార్టీ తనకు గాడ్ ఫాథర్ అని అన్నారు. మాదిగ జాతికి అన్యాయం జరిగితే,జాతి ప్రయోజనాల కోసం ఎప్పుడైనా తాను అధిష్టానానికి లేఖ రాస్తానన్నారు.

# ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టంపై జిహెచ్‌ఎంసి ఐటి విభాగం అవగాహన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసిలో పారిశుధ్య కార్మికుల హాజరుకు సంబంధించి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం అమలు చర్యలలో భాగంగా మొబైల్ ద్వారా సంబంధిత యాప్‌లో హాజరు నమోదుపై సహాయ వైద్యధికారులు(ఎఎంఒహెచ్)లు, (శానిటరీ ఫిల్డ్ అసిస్టెంట్)లకు ఎస్‌ఎఫ్‌ఎలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సమావేశ మందిరంలో ఐటి శాఖ ఆధ్వర్యంలో ఎఎంఒహెచ్‌లు, ఎస్‌ఎఫ్‌ఎలకు వీడియో ఆధారితంగా ప్రక్రియ ద్వారా అవగాహన కల్పించారు. సంబంధిత అప్లికేషన్ ఏ విధంగా ఉపయోగించాలన్న విషయమై ఆవివరించారు. ఎంప్లాయ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, వర్కర్ల హాజరు ప్రక్రియలపై వివరించారు. జిహెచ్‌ఎంసి ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రికాంగ్నిన్సిసెడ్ సిస్టమ్) మొబైల్ యాప్‌లో హాజరు తీసుకోవాలని, వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఎస్‌ఎఫ్‌ఏ సెల్ఫ్ హాజరు తీసుకుని, ఆ తర్వాతే తనకు ఉద్యోగుల గ్రూప్ అటెండెన్స్ తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులందరూ హాజరు క్యాప్చర్ యాఫ్‌లో నమోదు ప్రక్రియ ముఖ్యమైనదన్నారు. ప్రాక్టికల్‌గా మొబైల్‌లో హాజరు నమోదు ఏవిధంగా చేయాలో ఐటి అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్(సిఎంఒహెచ్) పద్మజా, ఐటి ప్రతినిధులు, ప్రాజెక్టు లీడ్, ఎఎంఒహెచ్‌లు, ఎస్‌ఎఫ్‌ఎలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై పీటముడి

## కరీంనగర్ బరిలో ఆశావహుల ఉత్కంఠ ✻ వెలిచాల రాజేందర్ వైపు అధిష్టానం మొగ్గు!

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రధానంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై పీటముడి వీడలేదు. ఇప్పటికే పలుదఫాలుగా లిస్టులు తయారు చేసినప్పటికీ సామాజిక సమీకరణాలు, ఫ్లాష్ సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఖరారు చేసేందుకు పునరాలోచనలో పడింది. కాంగ్రెస్ హైకమాండ్ ఆచితూచి వ్యవహరిస్తుండడంతోనే అభ్యర్థుల ప్రకటన ఆలస్యమవుతోందని తెలుస్తోంది. ప్రధానంగా కరీంనగర్ నుంచి వెలమ సామాజిక వర్గానికి చెందిన వెలిచాల రాజేందర్ రావు, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, బిసి సామాజిక వర్గానికి చెందిన రుద్ర సంతోష్‌లు అధిష్టానం పరిశీలనలో ఉన్నాయి. అయితే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డివైపే అధిష్టానం తొలుత మొగ్గు చూపినప్పటికీ సామాజిక సమీకరణాలు, నేతలకు ఇచ్చిన హామీలు, సర్వే నివేదికలు, ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కరీంనగర్‌లో వెలమ నేతగా పేరున్న వెలిచాల రాజేందర్‌రావును అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు మెండుగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం వెలమ కంచుకోటగా ఉండేది. ఇక్కడ 16 సార్లు ఎన్నికలు జరిగితే 13 సార్లు వెలమ సామాజిక వర్గానికి చెందిన నేతలే ఎంపీలుగా గెలిచిన సంధర్భాలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ వెలమ సామాజిక వర్గానికి చెందిన నేతలు కరీంనగర్‌లో పలుమార్లు గెలిచారు. చొక్కారావు, ఎం.సత్యనారాయణ రావు ఎంపిలుగా, మంత్రులుగా అటు రాష్ట్రంలో.. ఇటు కేంద్రంలో చక్రం తిప్పారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం సామాజిక సమీకరణాల నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కోసం తర్జనభర్జన పడుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కరీంనగర్ పార్లమెంటు బరిలో రెడ్డిలకా? వెలమలకా? బిసిలకా? అనే కోణంలో ఆలోచిస్తోంది. అందులోనూ ఫ్లాష్ సర్వే, ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకుంటోంది. ఈ క్రమంలో పక్కనే ఉన్న నిజామాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని రెడ్డిలకే కేటాయించేందుకు సుముఖంగా ఉంది. అక్కడ కాంగ్రెస్‌లో పరిశీలనలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే.. అయితే పక్కనే ఉన్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సైతం రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే పరిస్థితి భిన్నంగా ఉంటుందని పునరాలోచనలో పడింది. కాంగ్రెస్ పరిశీలనలో ఉన్న బిసి సామాజిక వర్గానికి చెందిన రుద్ర సంతోష్ అనే వ్యక్తికి కేటాయిస్తే ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపే అవకాశమూ లేకపోలేదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన కరీంనగర్‌కు చెందిన వెలిచాల రాజేందర్ రావు పేరునే ఫైనల్ చేసే అవకాశముందని తెలుస్తోంది.

**తోడు కానున్న తండ్రి చరిష్మా...** తండ్రి వెలిచాల జగపతి రావు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఓ సారి పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందారు. రామడుగు మండలం గుండిగోపాలరావు పేట సర్పంచ్ నుంచి ఎమ్మెల్యేగా.. ఎమ్మెల్సీగానూ కొనసాగారు. అపారమైన రాజకీయ నేపథ్యమున్న వెలిచాల జగపతి రావు కుమారుడైన రాజేందర్‌రావు తండ్రి







వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని రాజకీయాల్లోకి వచ్చారు. క్రియాశీలక రాజకీయాల్లో పనిచేసి సింగిల్ విండో చైర్మన్‌గా, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, మార్కెట్ కమిటీ చాంబర్ స్టేట్ సెక్రటరీగా కొనసాగారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, కార్యదర్శిగా కొనసాగారు. నెడ్‌క్యాప్ డైరెక్టర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. 2009లోనే ప్రజారాజ్యం పార్టీలో లోక్‌సభకు పోటీ చేసి ఓడినప్పటికీ మెజార్టీ ఓటు బ్యాంకు సంపాదించారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగానూ పోటీ చేసి అధిక ఓట్లను సంపాదించారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కెసిఆర్‌కు ఆకర్షితుడై టిఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి టిఆర్‌ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. కాగా ఆయనకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఎటువంటి పదవులు ఇవ్వనప్పటికీ టిఆర్‌ఎస్‌లోనే కొనసాగారు. అప్పటి సిఎం కేసిఆర్ ఆయనను వినియోగించుకుని వదిలేశారంటూ బహిరంగంగానే చెప్పుకొచ్చారు.

**ప్రకటనే ఆలస్యం...**పార్టీని వీడి దాదాపు దశాబ్ద కాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ సేవా కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ లో చేరి ఎంపి టికెట్‌ను ఆశిస్తూ ప్రజాక్షేత్రంలోకి రావాలని పోటీపడుతున్నారు. జనరల్ స్థానాలన్నింటినీ రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే ఇతర సామాజిక వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశముందని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఓటు బ్యాంకు అధికంగానే ఉంది. అటు వెలిచాల ఫ్యామిలీని పరిగణలోకి తీసుకుంటారని తెలుస్తోంది. ఆయనకే టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్, సెకండ్ క్యాడర్ కోరుతోంది. అలాఅయితేగెలుపు సులువు అవుతుందేమోనని ఆలోచనలో ఉంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగాబిజెపి, బిఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో ఉంది. వ్యూహాత్మకంగా వ్యహరించి అభ్యర్థిని ప్రకటించాలని కాంగ్రెస్ శ్రేణులు కోరుతున్నారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP15TC 7690 | MALLIKARJUN PALLAPU | SWARAJ 735 FE | 2014 |
| 2 | TS07UE 2889 | BHUKYA NARESH | TATA LPR 3118 CUMMINS FBT | 2016 |
| 3 | TS08GL 5836 | SHIVARATRI SATHISH | AJAX ARGO 2000 SELF LOADING CONCRETE MIXER | 2014 |
| 4 | TS03UA 6993 | RUPESH KUMAR ERLLA | EICHER 11.10 XP FBT | 2015 |
| 5 | TS03FB 1363 | SATHISH KOTE | MAHINDRA YUVO 585DI MAT | 2020 |
| 6 | TS26TA 1016 | ARUNA LAKAVATH | MAHINDRA 475 DI | 2017 |

AUCTION DATE: 23-03-2024

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
D.No: 24-7-29, 1st Floor, Fathima Complex, Fathimanagar, Kazipet, Warangal
Cell : 9989809938 , 9989313186

ప్రజాపక్షం

శనివారం, మార్చి 23

## ప్రతిపక్షాల ధ్వంసానికి బిజెపి కుట్ర!

కేంద్రంలో అధికారాన్ని నిలబెట్టుకోవడం... దేశ వ్యాప్తంగా ఇప్పటికే దక్కించుకున్న రాష్ట్రాలేగాక, మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై పట్టు సాధించడం.. ఇవే బిజెపి ముందున్న ప్రధాన లక్ష్యాలు. తాను గెలవడానికి ప్రజాస్వామ్యాన్ని ఓడిస్తుంది. లౌకిక వాదాన్ని అటకెక్కిస్తుంది. మతవాదాన్ని రెచ్చగొడుతుంది. సమాఖ్య విధానానికి తెరదించుతుంది. కేంద్రీకృతమైన అధికారమే ప్రధాని మోడీ, ఆయన మద్దతుదారుల 'మతం'. అడ్డదారులైతేనేం... గెలవడమే ప్రధానమనే రీతిలో వ్యవహరిస్తున్న మోడీ సర్కారు నిరంకుశ పాలనను అమలు చేస్తున్నది. ప్రశ్నించిన గొంతుకలను నొక్కేస్తున్నది. సుప్రీం కోర్టు జోక్యం చేసుకునే వరకూ, 'రాజద్రోహం' చట్టం కింద వేలాది మందిని జైళ్లలోకి నెట్టింది. ఈ చట్టం అమలును సుప్రీం కోర్టు అడ్డుకున్న తర్వాత, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వంటి సంస్థలను అడ్డం పెట్టుకొని కక్షసాధింపు చర్యలను ముమ్మరం చేసింది. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ సంస్థలను ప్రధాన ప్రతిపక్ష పార్టీలను ధ్వంసం చేయడానికి రంగంలోకి దింపుతున్నది. ఈ సంస్థల నిఘా నేత్రాలకు ఒక్క బిజెపి నేత కూడా కనిపించకపోవడం దృష్టిలోపం కావచ్చు లేదా యజమానుల కనుసన్నల్లో మెలగటం కావచ్చు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు ఈ వ్యూహాల్లో భాగమే. ఆయనను అరెస్టు చేయబోమని కోర్టును నమ్మబలికి, సోదాల పేరుతో ఇంట్లోకి చొరబడి ఆయనను అరెస్టు చేసిన విధానం ప్రజాస్వామ్య, న్యాయ వ్యవస్థలను అపహాస్యం చేస్తున్నది. దేశంలో, ప్రత్యేకించి ఉత్తర భారత దేశంలో బిజెపికి బలమైన ప్రత్యర్థుల్లో కాంగ్రెస్ తర్వాతి స్థానం 'ఆప్'దే. పంజాబ్‌లో అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ పార్టీ వివిధ రాష్ట్రాల్లో క్రమంగా బలపడుతున్నది. అందుకే, ఆప్ పునాదులు కదిలించేందుకు బిజెపి సర్కారు ఇడిని రంగంలోకి దించిందన్న విమర్శలున్నాయి. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, సీనియర్ నేత సంజయ్ సింగ్‌సహా 16 మందిని ఇడి ఇప్పటికే అరెస్టు చేసింది. తెలంగాణ ఎమ్మెల్సీ, బిఆర్‌ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవితను కూడా జైల్లోకి నెట్టింది. ఇప్పుడు నేరుగా ఆప్ మూలస్తంభం కేజ్రీవాల్‌ను అదుపులోకి తీసుకుంది. ఒక వైపు లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తుండగా, ముఖ్యమైన ప్రతిపక్ష నేతను అరెస్టు చేయడం వెనుక బిజెపి వ్యూహాత్మక కుట్ర ఉందన్న అనుమానాలను తోసిపుచ్చలేం. నిన్నగాక మొన్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత సోరెన్‌ను అవినీతి ఆరోపణలపై ఇడి అరెస్టు చేసింది. నైతిక బాధ్యతతో హేమంత తన పదవికి రాజీనామా చేశారు. కేజ్రీవాల్ కూడా ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగుతారన్నది బిజెపి ఆలోచన కావచ్చు. నిజానిజాలు ఏదో ఒక రోజున నిగ్గు తేలుతాయి. ఇడి పెట్టిన కేసుల్లో కేవలం 0.5 శాతమే కోర్టులో నిలబడుతున్నాయి. 2005–2022 మధ్యకాలంలో ఇడి 5,422 కేసులు పెడితే, వాటిలో 23 కేసుల్లో మాత్రమే నేరం రుజువైంది, దోషులకు శిక్ష పడింది. మిగతా వారంతా నిర్దోషులే. కానీ, చాలా మంది విచారణ పేరుతో ఏళ్లకు ఏళ్లు జైళ్లలో మగ్గుతున్నారు. ఢిల్లీ మద్యం కేసు కూడా ఇలాంటిదే కావచ్చు. చివరికి, అరెస్టయిన వారందరికీ క్లీన్‌చిట్ లభించవచ్చు. కానీ, అప్పటికే పుణ్యకాలం ముగిసిపోతుంది. కేజ్రీవాల్ అరెస్టుతో ఆప్, కవిత అరెస్టుతో బిఆర్‌ఎస్, సొరెన్ అరెస్టు కారణంగా జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) గందరగోళంలో పడడం, సార్వత్రిక ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించలేక విఫలం కావడం జరిగిపోతాయని బిజెపి ఆశిస్తున్నట్టు కనిపిస్తున్నది. 'ఇండియా' కూటమి భాగస్వామ్య పార్టీలు, నాయకులకు ఎరవేసి, తనవైపు తిప్పుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో సఫలమవుతామన్న ధీమా మోడీ బృందానికి ఉండవచ్చు. కానీ, ప్రతిపక్షం అనేదే లేకుండా చేయాలన్న ఆలోచన ప్రజాస్వామ్యానికి మంచిదికాదు. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది. సమాఖ్య దేశాన్ని యూనిటరీ రాజ్యంగానూ, లౌకికవాదాన్ని మతతత్వంగానూ, ప్రజాస్వామ్యాన్ని ఏకస్వామ్యంగానూ మార్చాలన్న మోడీ ప్రయత్నాలు ఫలించడం కల్ల. నిర్బంధాలతో, అణచివేతలతో కలకాలం అధికారంలో ఉండడం ఎవరికీ సాధ్యం కాదు. బిజెపికిగానీ.. మోడీకిగానీ ఇందులో ఎలాంటి మినహాయింపు లేదు.

## మానవ తప్పిదాలతోనే వాతావరణ ప్రతికూలతలు!

నిత్యం వాతావరణంలో జరిగే మార్పులు, రాబోయే వారం,నెల,ఏడాదిలో జరుగబోయే వాతావరణ మార్పుల సూచనలను ప్రజలకు ముందస్తు హెచ్చరికలుగా తెలిపే విధులను 'ప్రభుత్వ వాతావరణ శాఖ' నిర్వహిస్తుంది. ప్రపంచ వాతావరణ దినం( వరల్ మెటీరోలాజికల్ డే) వేదికగా మానవాళి శ్రేయస్సు కోసం 'వెదర్', 'క్లైమేట్', 'నీటి'కి సంబంధించిన అంశాలను మానవాళి సుఖ జీవనం, మానవ జాతి భద్రత కోసం వాతావరణ శాస్త్ర నిపుణులు అనునిత్యం సేవలను అందిస్తున్నారు.

**క్లైమేట్, వెదర్‌ల మధ్య వ్యత్యాసం:** 23 మార్చి 1950న 193 దేశాలతో కూడిన 'ప్రపంచ వాతావరణ సంస్థ' అంతర్జాతీయ సమావేశానికి నిర్వహించడం జరిగింది. ఈ చారిత్రక సమావేశానికి గుర్తుగా 1961 నుంచి ప్రతి ఏటా 23 మార్చిన 'ప్రపంచ వాతావరణ దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. స్వల్పకాలిక వాతావరణ పరిస్థితులను 'వెదర్' వివరిస్తుంది. ఒక ప్రత్యేక ప్రాంతపు దీర్ఘకాలపు సగటు 'వెదర్' సమాచారాన్ని 'క్లైమేట్'గా అభివర్ణిస్తారు. ఉష్ణోగ్రత, పీడనం, నీటి తేమ, మబ్బులు, గాలి, దూళి, వర్షం, వరదలు, మంచు తుఫానుల లాంటి అంశాల మీద 'వెదర్' ఆధారపడి ఉంటుంది. ఒక ప్రత్యేక ప్రాంతపు దీర్ఘకాలపు వాతావరణ పరిస్థితులైన నీటి తేమ, ఉష్ణోగ్రత, సూర్యకాంతి, గాలి లాంటి అంశాల మీద 'క్లైమేట్' ఆధారపడి ఉంటుంది. నేటి డిజిటల్ యుగంలో ప్రపంచ మానవాళిలో 33 శాతానికి వాతావరణ హెచ్చరికలు సకాలంలో అందకపోవడంతో అపార నష్టాలను భరించాల్సి వస్తున్నది.

**విపత్తుల్లో నష్ట నివారణకు వాతావరణ హెచ్చరికలు:** ఐరాస తీర్మానం ప్రకారం 202130 కాలాన్ని 'ఐరాస సముద్ర వైజ్ఞానికశాస్త్రంతో సుస్థిరాభివృద్ధి దశాబ్దం'గా నిర్ణయించిన నేపథ్యంలో ప్రపంచ వాతావరణ దినం2024 నినాదాన్ని 'ముందస్తు వాతావరణ చర్యలు (ఎట్ ది ఫ్రంట్‌లైన్ ఆఫ్ క్లైమెట్ ఆక్షన్)'గా తీసుకొని చర్చించడం జరుగుతోంది. దేశ ప్రజల శ్రేయస్సు, భద్రత కోసం వాతావరణశాస్త్రం, ఆపరేషనల్ హైడ్రోలజీ, ఎర్త్ సైన్సెస్‌ల మధ్య సమన్వయం అత్యంత అవసరం అని మరువరాదు. 2030 వరకు ప్రపంచ దేశాలు తీవ్రమైన వెదర్, క్లైమేట్, నీరు, ఇతర పర్యావరణ ప్రతికూలతలను ఎదుర్కొంటూ, సామాజిక ఆర్థిక దుష్పరిణామాలను అనుభవించనుందని ఐరాస అంచనా వేస్తున్నది. మానవాళి మనుగడకు కావలసిన వాతావరణ మార్పులు చర్చించడానికి సభలు, సమావేశాలు, విద్యాలయాల్లో పోటీలు, ప్రదర్శనలు, కార్యశాలలు నిర్వహించుటకు ప్రపంచ వాతావరణ దినం వేదిక దోహదపడుతుంది. వాతావరణ ప్రతికూలతలు నేటి మానవ తప్పిదాలని, మానవ ప్రమేయమే వాటికి కారణమని గుర్తిద్దాం.

ప్రకృతి ప్రళయాలకు, అసాధారణ మార్పులకు అడ్డుకట్ట వేద్దాం. భూమాతను నివాసయోగ్య గ్రహంగా, గృహంగా పునర్‌ప్రతిష్టిద్దాం.

(నేడు 'ప్రపంచ వాతావరణ దినం' సందర్భంగా)

**మధుపాళీ,** 9949700037

లేఖ

## కార్పొరేట్ కళాశాల యాజమాన్యాల కబంధహస్తాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు!

ఏ ప్రాంతంలో అయితే కార్పోరేట్ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారో అక్కడ విద్యారంగం మొదలుకొని అన్ని రంగాలకు చెందిన అధికారులు వారు ఇచ్చే ముడుపులకు తలొగ్గి ఎటువంటి ప్రభుత్వ నియమ, నిబంధనలు లేకున్నా వారికి యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. వారికి వత్తాసు పలుకుతూ ముడుపులు జేబులోకి వేసుకుంటున్న ప్రజాప్రతినిధులు తద్వారా వారు చేసే విద్యా వ్యాపారానికి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతున్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి, అనేకమైన కోర్సుల పేర్లతో లక్షల రూపాయలు విద్యార్థుల తల్లితండ్రుల నుండి అక్రమంగా వసూలు చేస్తున్నారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం పనిచేసే విద్యార్థి సంఘాలు వారు చేస్తున్న అక్రమాలపై అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోరు. కళాశాలల యాజమాన్యాలు అధికారులకు ఏమైనా మర్యాదలు తక్కువ చేస్తే, విద్యార్థి సంఘాలు ఇచ్చిన ఫిర్యాదులు అడ్డం పెట్టుకొని, మర్యాద పొందుతారు.

కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు చేస్తున్న ఆగడాలను అధికారులు పట్టించుకోకపోవడంతో కళాశాల యాజమాన్యాలతో లాలూచీ పడి వారికి వత్తాసు పలికే పరిస్థితి ఉన్నది. కళాశాలలో అనేకమైన సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతుంటారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపైన ఏదో ఒక నెపం వేసి బైటికి పంపించే ప్రయత్నం చేస్తారు. తినే ఆహారం మొదలుకుంటే అన్ని విషయాల్లో అక్రమాల్లే జరుగుతవి. అందులో పనిచేస్తున్న సిబ్బంది బాధలు వర్ణనాతీ తం. యాజమాన్యానికి అనుకూలంగా ఉంటె ఒక రకమైన లబ్ది, వ్యతిరేకంగా ఉంటే ఇంకోరకమైన లబ్ది. యాజమాన్యాలు సిబ్బందిని పెట్టే మానసిక వేదనను తట్టుకోలేక వారు తమ ప్రతాపం విద్యార్థులపై చూపిస్తారు. భరించలేని విద్యార్థులు ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు.

ఇంత జరిగిన ప్రభుత్వాలు స్పందించవు. ఇటువంటి విద్యాసంస్థలు లేకపోతె అన్ని వర్గాల విద్యార్థులకు విద్యను అందించలేము అని తప్పించుకునే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తున్నాయి. కనీసం ఇన్ని ఆగడాలు జరుగుతున్న కార్పొరేట్ కళాశాలలో కనీస ప్రమాణాలు పాటించాలి అని గట్టిగ చెప్పలేని పరిస్థితిలో విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులు ఉన్నారు.

భారతరాజ్యంగంలో విద్య అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. విద్య అనేది కొందరిది కాదు, విద్య అనేది ప్రతి ఒక్కరి సొత్తు అనే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలని తెలియజేస్తున్నాను.

**పుట్ట లక్ష్మణ్**
ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

# 'ఈసారి నాలుగు వందలు పైన'....నిజమా, కలయా!

ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోడీకి హాట్రిక్ విజయం ఖాయమన్న నమ్మకాన్ని ప్రజల మనస్సులోకి ఎక్కించటానికి, తద్వారా అనిశ్చిత ఓటర్లను, తొలిసారి ఓటర్లను ఆకర్షించటానికి సర్వ ప్రచార మార్గాలు అనుసరిస్తున్న భారతీయ జనతాపార్టీ తనకుతానుగా 370 సీట్లు గెలుపును లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలను కలుసుకుని 'ఈసారి నాలుగు వందలు పైన' సాధించి భారత పార్లమెంటు చరిత్రలో రికార్డు నెలకొల్పాలన్నది సంకల్పం. విస్తృతంగా ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటున్న నరేంద్రమోడీ ఏ రాష్ట్రం వెళ్లినా అక్కడి ప్రాంతీయ భాషలో ఆ వాక్యం ఉచ్ఛరిస్తున్నారు. స్థానిక యాసతో ఆకట్టుకునేందుకు కృత్రిమమేధ టెక్నాలజీ ఉపయోగిస్తున్నారు. అది ఆయన ఉపన్యాసాలను కూడా తర్జుమా చేస్తున్నదట! అయితే 370 లేదా 400 సీట్లు సంపాదించే అవకాశాలున్నాయా? ఎన్‌డిఎ నుండి నిష్క్రమించిన పాత మిత్రపక్షాలన్నిటినీ దాదాపుగా తిరిగి ఆ ఛత్రం కింద కూడగట్టేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలు చూస్తుంటే ఆ లక్ష్యసాధనకు అది తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నదని అనిపించక మానదు. మోడీగారు శపథం చేశారు గనుక ఆ లక్ష్యం సిద్ధించి తీరుతుందని విశ్వసించే మూఢభక్తులకూ కొదవలేదు. అయితే అది వాస్తవం అయినా కాకపోయినా – అది సాధ్యమేనన్న మానసిక స్థితిని పార్టీ కార్యకర్తల్లో, ప్రజల్లో సృష్టించటం ముఖ్యం గనుక ప్రధానమంత్రిగారు ఏకంగా పార్లమెంటులోనే ఆ గంభీర ప్రకటన చేశారు. 'మేము తిరిగి వస్తున్నాం – ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నాం' అన్నారు. అంతేనా! అరమరికలకు తావివ్వకుండా, తన మంత్రివర్గాన్ని సమావేశపరిచి, 'మనం మళ్లీ అధికారంలోకి వస్తున్నాం, రాగానే తొలి 100 రోజుల్లో అమలు చేయాల్సిన కార్యక్రమాలను రూపొందించండి' అని హుకుం జారీ చేశారు. 28 ప్రతిపక్షపార్టీలు 'ఇండి' అలయెన్స్‌గా ఏర్పడి, బిజెపి ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రజావ్యతిరేక పాలనను అంతం చేయటానికి కలిసికట్టుగా పోటీచేయాలని నిర్ణయించినప్పుడు ప్రతిపక్ష ప్రజాశ్రేణుల్లో ఏర్పడిన ఉత్సాహం బిజెపిలో తత్తరపాటు కలిగించిన మాట వాస్తవం. అదే సమయంలో ఆ ప్రచార ప్రభావాన్ని వమ్ముచేసేందుకు మోడీ–షా బృందం 30 పైబడిన చిన్న – చితక పార్టీలతో ఎన్‌డిఎను పునరుద్ధరించింది. మోడీ ప్రభుత్వాన్ని సాగనంపటమనే జాతీయ లక్ష్యంతో ఏకీభవించినా, రాష్ట్ర స్థాయిలో భాగస్వాముల మధ్య వైరుధ్యాలు, ఘర్షణల కారణంగా 'ఇండి' కూటమిలో బీటలు, ఒంటెత్తు పోకడలు బయటపడటం బిజెపిలో ఉత్సాహం నింపింది. హిందూ ఓట్లను మరింతగా ఆకర్షించే వ్యూహంలో భాగంగా అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని ఆదరాబాదరా పూర్తిచేసింది. అసంపూర్తి నిర్మాణానికి ప్రారంభోత్సవం చేయకూడదని నలుగురు శంకరాచార్యులు చెప్పినా చెవినపెట్టలేదు. వారు బహిష్కరించినా ప్రధాని నరేంద్రమోడీ గ్రాండ్‌గా – వందలాదిమంది ప్రముఖుల సమక్షంలో – వారిని ఎండలో కూర్చోబెట్టి – బాలరామ ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ఆర్‌ఎస్‌ఎస్ సొంత కార్యక్రమం అన్నట్లుగా నిర్వహించారు. ఆ మరుసటి రోజునుండి యాత్రికుల రవాణా కార్యక్రమం చేపట్టారు. రోజూ లక్షపలక్షల్లో భక్తులు సందర్శిస్తున్నట్లు ప్రచారం చేశారు. సెక్యులర్ రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రధానమంత్రి నిర్వహించిన ఈ హైందవ ధర్మ క్రతువు హిందుత్వ శక్తుల ఆత్మవిశ్వాసాన్ని సహజంగానే పెంపుచేసింది.

ఉత్తరాది రాష్ట్రాల్లో ఓట్లను ఖరారు చేసుకున్న తదుపరి ప్రధానమంత్రి తూర్పు, దక్షిణాది రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అదే సమయంలో ఎన్‌డిఎ పాత మిత్రుల్ని కూడగట్టే యత్నాలను హోంమంత్రి అమిత్ షా మొదలుపెట్టారు. డబ్బుకు ఎలాగూ కొదువ లేదు. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు కొట్టివేసేనాటికే కేంద్ర దర్యాప్తు సంస్థల బెదిరింపులు, అదిరింపులుతో, క్విడ్ ప్రోకో పద్ధతుల్లో బడా పారిశ్రామిక వేత్తల నుండి రాబట్టుకున్న వేలకోట్ల రూపాయల్లో ఇంకా ఎంతో ధనం మూలుగుతున్నది. ఇన్ని సానుకూలతలున్నప్పుడు, ప్రతిపక్ష ఐక్యత బలహీనంగా కనిపిస్తున్నప్పుడు బిజెపి గెలుపు నల్లేరు మీద నడక కాక మరేమవుతుంది! అయితే బిజెపిలో ఏ మూలనో సందేహం పీడిస్తున్నది. అందుకు క్షేత్రస్థాయిలోని పరిస్థితులు, బిజెపి పాలనపట్ల వివిధ తరగతుల్లో అట్టడుకుతున్న అసంతృప్తి కారణం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వివిధ రాష్ట్రాల్లో బిజెపి ఫలితాలను **(పక్క పట్టిక చూడగలరు)** పరిశీలిస్తే ఆ పార్టీ ప్రస్తుత లక్ష్యాలు అత్యాశ అనిపించకమానవు.

హిందీభాషా రాష్ట్రాలుగా లేదా ఉత్తరాది రాష్ట్రాలుగా పరిగణించబడే 8–10 రాష్ట్రాల్లో గత ఎన్నికల్లోనే బిజెపికి గరిష్ఠ స్థాయిలో సీట్లు లభించాయి. ఈ ఎన్నికల్లో బిజెపి భావిస్తున్నట్లు అయోధ్య రామాలయ ప్రభావం పనిచేసినా ఆ పార్టీకి లభించే ఓట్ల శాతం పెరగవచ్చుగాని సీట్లు పెరిగే అవకాశం లేదు – కొన్ని తగ్గినా తగ్గవచ్చు.

తూర్పు రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, ఒడిసాల్లో యథాతథస్థితి పునరావృతం కావచ్చు. అయితే గత ఐదేళ్లలో ప్రభుత్వానికి వెలుపలినుండి తోడ్పాటిచ్చిన బిజెడి (ఒడిసా)ని ఈసారి ఎన్‌డిఎలోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పశ్చిమాన మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సిపిలను చీల్చి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసినా లోక్‌సభ ఫలితాల్లో గణనీయమైన కూర్పు రాకపోవచ్చు. పంజాబ్‌లో అకాలీలతో మైనర్ పార్టనర్‌గా పొత్తు కుదిరినా బిజెపికి విజయావకాశాలు అల్పమే.

అందువల్ల, బిజెపికి కొరకరాని కొయ్యగా ఉన్న దక్షిణ రాష్ట్రాలపై అది ప్రత్యేకించి దృష్టి పెట్టింది. దక్షిణాదిలో చెప్పుకోదగ్గ బలమున్న కర్నాటకలో అది గత ఎన్నికల్లో గెలిచిన సీట్ల సంఖ్యను నిలుపు కోలేకపోవచ్చు. జెడి(ఎస్) అవకాశవాద పొత్తువల్ల పెద్దగా లాభించేదేమీ ఉండకపోవచ్చు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల్లో బిజెపికి ప్రాతినిధ్యం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, జనసేనలతో అది పొత్తుపెట్టుకుంది. అరడజను సీట్లు పోటీ చేస్తుంది. దాని గెలుపు సంగతెలా ఉన్నా – ఎన్‌డిఎలో తిరిగి చేరిన టిడిపి, జనసేన, వైసిసి పక్షాన ఎవరెన్ని గెలిచినా – గెలిచిన వారందరూ మోడీకి జై కొట్టేవాళ్లే కదా! తెలంగాణాలో ప్రత్యామ్నాయంగా ఎదుగుదలకు సర్వశక్తులు ఒడ్డుతున్నది. ఏమైనా 130 సీట్లు ఉన్న దక్షిణ రాష్ట్రాల్లో బిజెపి అడ్రసు వెతుక్కోవలసిన స్థితే. అయితే పార్టీని నిర్మించుకునే దీర్ఘకాల వ్యూహంతో అది ఆర్థిక, మానవ వనరులను విరివిగా వెచ్చిస్తోంది. అనూహ్యమైన పరిస్థితుల్లో ఏ ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రమైనా చేజారితే బిజెపిని ఆదుకోగల రాష్ట్రం మరేదీ లేదు.

చిత్రమేమంటే, భారతదేశంలో స్వాతంత్ర్యం నాటినుండీ ఏ ప్రభుత్వానికీ 50 శాతం ఓట్లు లభించలేదు. అందువల్ల ప్రతిపక్ష పార్టీలు విఫలమై ఉండవచ్చుగాని, ప్రజలెప్పుడూ ప్రధాన ప్రతిపక్షంగానే ఉన్నారు. కాబట్టి వారి మనోగతం తమ స్వీయానుభవం నుండి ఎప్పుడు ఎటు మారుతుందో కచ్చితంగా చెప్పగల సెఫాలజిస్టులు ఇంకా పుట్టలేదు.

**ఎమ్మెస్సార్**

### 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాల తీరుతెన్నులు

పోలింగ్ : 11 ఏప్రిల్ నుండి మే 19 వరకు
ఓట్ల లెక్కింపు : మే 23
అలయెన్స్ వారీ సీట్లు
బిజెపి :303+52
కాంగ్రెస్: 52+33
మొత్తం సీట్లు : 543; ఎన్నికలు జరిగినవి 542

మొత్తం ఓటర్లు : 88,18,18,391
పోలైన ఓట్లు : 61,31,41,974
పోలింగ్ శాతం : 69.5
పాపులర్ ఓట్లు : బిజెపి – 22,90,76,879 (37.36 శాతం)
కాంగ్రెస్ – 11,94,95,214 (19.49 శాతం)

| రాష్ట్రం /యుటి | మొత్తం సీట్లు | బిజెపి+ఎన్‌డిఎ | | కాంగ్రెస్+ యుపిఎ | | ఇతరులు |
|---|---|---|---|---|---|---|
| 1. ఆంధ్రప్రదేశ్ | 25 | 0 | 0 | 0 | 0 | 22 వైసిపి 3 టిడిపి |
| 2. అరుణాచల్‌ప్రదేశ్ | 2 | 2 | 0 | 0 | 0 | 0 |
| 3. అసోం | 14 | 9 | 0 | 3 | 0 | 2 |
| 4. బిహార్ | 40 | 17 | 16 జెడియు 6 ఎల్‌జెపి | 1 | 0 | 0 |
| 5.చత్తీస్‌ఘడ్ | 11 | 9 | 0 | 2 | 0 | 0 |
| 6.ఢిల్లీ | 7 | 7 | 0 | 0 | 0 | 0 |
| 7. గోవా | 2 | 1 | 0 | 1 | 0 | 0 |
| 8. గుజరాత్ | 26 | 26 | 0 | 0 | 0 | 0 |
| 9. హర్యానా | 10 | 10 | 0 | 0 | 0 | 0 |
| 10.హిమాచల్‌ప్రదేశ్ | 4 | 4 | 0 | 0 | 0 | 0 |
| 11.జమ్మూ–కశ్మీర్ | 6 | 3 | 0 | 0 | 0 | 3 |
| 12.జార్ఖండ్ | 14 | 11 | 1 ఎజెఎస్‌యు | 1 | 1 జెఎంఎం | 0 |
| 13.కర్నాటక | 28 | 25 | 1 ఇండి 1 జెడిఎస్ | 1 | 0 | 0 |
| 14.కేరళ | 20 | 0 | 0 | 15 | (2ఐయుఎంఎల్ 1 కెసిఎం) | 1 సిపిఎం 1ఆర్‌ఎస్‌పి |
| 15.మధ్యప్రదేశ్ | 29 | 28 | 0 | | 1 | 0 |
| 16. మహారాష్ట్ర | 48 | 23 | 18 శివసేన | 1 | 0 | 4ఎన్‌సిపి 2 |
| 17.మణిపూర్ | 2 | 1 | 0 | 0 | 0 | 1 ఎన్‌డిఎఫ్ |
| 18.మేఘాలయ | 2 | 0 | 1 ఎన్‌సిపి | 1 | 0 | 0 |
| 19.మిజోరం | 1 | 0 | 1 ఎంఎన్‌ఎఫ్ | 0 | 0 | 0 |
| 20.నాగాలాండ్ | 1 | 0 | 1 ఎన్‌డిపిపి | 0 | 0 | 0 |
| 21.ఒడిసా | 21 | 8 | 0 | 1 | 0 | 12 బిజెడి |
| 22.పంజాబ్ | 13 | 2 | 2 అకాలీ | 8 | 0 | 1ఆప్ |
| 23.రాజస్థాన్ | 25 | 24 | 1 ఆర్‌ఎల్‌పి | 0 | 0 | 0 |
| 24.సిక్కిం | 1 | 0 | 0 | 0 | 0 | 1 ఎస్‌కెఎం |
| 25.తమిళనాడు | 39 | 0 | 1 ఎడిఎంకె | 8 | 23 డిఎంకె 2 సిపిఐ 2 సిపిఎం 1 ఎస్‌వికె 1 ఐయుఎంఎల్ | 0 |
| 26.తెలంగాణ | 17 | 4 | 0 | 3 | 0 | 9టిఆర్‌ఎస్ 1ఎంఐఎం |
| 27.త్రిపుర | 2 | 2 | 0 | 0 | 0 | 0 |
| 28.ఉత్తరప్రదేశ్ | 80 | 62 | 2 అప్నాదళ్ | 1 | 0 | 10బిఎస్‌పి 5 ఎస్‌పి |
| 29.ఉత్తరాఖండ్ | 5 | 5 | 0 | 0 | 0 | 0 |
| 30.పశ్చిమబెంగాల్ | 42 | 18 | 0 | 2 | 0 | 22టిఎంసి |
| **కేంద్రపాలిత ప్రాంతాలు** | | | | | | |
| 1.అండమాన్ నికోబార్ దీవులు | 1 | 0 | 0 | 1 | 0 | 0 |
| 2.చండీఘడ్ | 1 | 1 | 0 | 0 | 0 | 0 |
| 3.దాద్రానాగర్ హవేలీ | 1 | 0 | 0 | 0 | 0 | 1ఇండి |
| 4.డామన్–డియూ | 1 | 1 | 0 | 0 | 0 | 0 |
| 5.లక్షదీవులు | 1 | 0 | 0 | 0 | 0 | 1 ఎన్‌సిపి |
| 6.పుదుచ్చేరి | 1 | 0 | 0 | 1 | 0 | 0 |
| | **543** | **303** | **52** | **52** | **33** | **102** |

# ఉద్యమ జ్వాల.. పోరాట కెరటం.. భగత్ సింగ్

భగత్ సింగ్.. అది పేరు కాదు.. ఉద్యమ జ్వాల... వలస పాలనపై ఉవ్వెత్తున ఎగసిపడిన పోరాట కెరటం... ఆయన ధైర్యం ఎంతో మందిని దేశ భక్తులుగా మార్చింది. ఆయన ధైర్యం స్వాతంత్ర్య సమరంలో లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చింది. త్యాగాలకు ప్రతీకగా నిలిచిన 'షహీద్' భగత్ సింగ్ మన దేశానికేగాక, యావత్ మానవాళికే ఆదర్శంగా నిలిచాడు. ఆయనది విలక్షణమైన, విశిష్టమైన వ్యక్తిత్వం. బ్రిటిషర్లు కొనసాగిస్తున్న అమానవీయ దోపిడీకి వ్యతిరేంగా నినదించిన గళం ఆయనది. అణచివేతను ఎదుర్కొనేందుకు, ఆత్మ బలిదానానికి కూడా వెనుకాడని తెంపరితనం ఆయనకే సొంతం. అన్ని రకాల పీడనలు, వేదనలు, అణచివేతల నుంచి దేశ ప్రజలను విముక్తి చేయటం కోసం నిరంతరం శ్రమించిన త్యాగశీలి భగత్ సింగ్. అందుకే, ఆ పేరు వినగానే నరాల్లో నెత్తురు శరవేగంతో ప్రవహిస్తుంది. రోమాలు నిక్కబొడుచుకుంటాయి. గాంధీ అహింసా పోరాటాన్ని భగత్ సింగ్ వ్యతిరేకించి ఉండవచ్చు. భారత దేశ దాశ్యశృంఖలాలు తెంచేందుకు ఆయన ఎంచుకున్న మార్గాన్ని కొంత మంది వ్యతిరేకించి ఉండవచ్చు. కానీ, భగత్ సింగ్‌కు ఉన్న దేశ భక్తిని, ఆయన త్యాగ నిరతిని ఎవరూ కాదనలేరు. హింసకు అసింస సమాధానం కాదన్నది ఆయన అభిప్రాయం. తాను నమ్మిన సిద్ధాంతానికే కట్టుబడ్డాడు. 1907 సెప్టెంబర్ 28న పంజాబ్ ప్రావిన్స్‌లో జన్మించిన భగత్ సింగ్, చిన్నతనం నుంచే బ్రిటిష్ పాలన పట్ల ఆగ్రహం వ్యక్తం చేసేవాడు. ఆయనకు 13 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు జలియన్‌వాలా మాగ్ ఉదంతం జరిగింది.ఆ దుర్ఘటన భగత్ సింగ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. జలియన్‌వాలా బాగ్‌లో డయ్యర్ అకృత్యానికి బలైన వారి రక్తంతో తడిసిన మట్టిని ఇంటికి తీసుకొచ్చి, తిలకంగా దిద్దుకోవడం ఆయన దేశ భక్తికి అద్దం పడుతుంది. క్రూరమైన బ్రిటిష్ పాలనకు తెరదించాలంటే, యుద్ధం తప్పదని నమ్మాడు. చిన్నతనంలో మహాత్మా గాంధీ ప్రసంగాలకు అకర్షితుడైనప్పటికీ, చౌరీ చౌరా దగ్గర జరిగిన సహాయ నిరాకరణోద్యమం హింసాత్మకంగా మారడంతో, గాంధీ ఆ ఉద్యమాన్ని ఆపేయడం ఆయనకు నచ్చలేదు. గాంధీ అహింసా నినాదంతో స్వాతంత్ర్యం సాధ్యం కాదన్న అభిప్రాయానికి వచ్చాడు. మరోవైపు, రష్యాలో బోల్షివిక్ విప్లవం సక్సెస్ కావడంతో యూరప్ ఉద్యమాల చరిత్రను అధ్యయనం చేయడం మొదలు పెట్టాడు. లెనిన్, కార్ల్ మార్క్స్, ఎంగిల్స్ రచనలు విస్తృతంగా చదివాడు. క్రమంగా సామ్యవాదం వైపు మళ్ళాడు. లాహోర్‌లోని నేషనల్ కాలేజ్‌లో చేరాడు. భగత్ సింగ్ స్వతహాగా మంచి గాయకుడు.. కవిత్వం బాగా చెప్పేవాడు. 1923లో హిందీ సాహిత్య సమ్మేళన్‌లో అద్భుతంగా కవితలు చెప్పడంతో దాని అధ్యక్షుడు భీమ్ సేన్‌తో పరిచయమైంది. భగత్ సింగ్‌లోని సొతంత్ర్య ఆకాంక్షను గమనించిన భీమ్ సేన్ ఆయనను రాంప్రసాద్ బిస్మల్, అష్ఫకుల్లాఖాన్‌లతో నడపబడుతున్న హిందూస్తానీ రిపబ్లిక్ అసోషియేషన్‌లో చేరమని సలహా ఇచ్చాడు. అప్పటికి భగత్ సింగ్ వయసు కేవలం 16 సంవత్సరాలు మాత్రమే. మీసం కూడా రాలేదు.




1925లో కాకోరీ కుట్ర కేసులో భగత్ సింగ్ కీలకంగా వ్యవహరించాడు. 1927లో బిస్మిల్, అష్ఫకుల్లాఖాన్, రోహన్ సింగ్‌లతో పాటు భగత్ సింగ్ బాబాయ్‌ని కూడా బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసింది. దీనితో ఆయనలో పట్టుదల మరింత పెరిగింది. బ్రిటిష్ పాలనకు తెరపడాలంటే సాయుధ పోరాటం ఒక్కటే మార్గమని నమ్మాడు. 'నాకు దేవుడిపై నమ్మకం లేదు.. నేను నాస్తికుడిని' అని ప్రకటించుకున్న భగత్ సింగ్, కాన్సిట్యుయెంట్ అసెంబ్లీలో బాంబ్ విసిరాడు. తద్వారా దేశ పరిస్థితులపై ప్రపంచ దృష్టిని ఆకర్షించాలని తపనపడ్డాడు. తరువాత లార్డ్ కర్జన్‌ను తుపాకీతో కాల్చాడు. ఈ కేసులో భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురులకు శిక్ష పడింది. 25 ఏళ్ల వయసులో భగత్ సింగ్ దేశం కోసం ప్రాణాలు వదిలాడు.

ముగ్గురు దేశభక్తులు ఉరికొయ్యకు వేలాడిన మార్చి 23 మన దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఓ చీకటి రోజు. వీరిని ఉరితీయడం ద్వారా, ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను అణగదొక్కేందుకు ప్రయత్నం చేసిన రోజు. కానీ, ఆ నిర్ణయం కారణంగా బ్రిటిషర్లు భారీ మూల్యం చెల్లించక తప్పలేదు. ప్రజల్లో ఉవ్వెత్తున స్వాతంత్ర్య ఆకాంక్షను జాగృతం చేసిన ఆ రోజునే మనం ఇప్పుడు షాహీద్ దివస్‌గా జరుపుకుంటున్నాం. దేశం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అంకితమిచ్చిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాన్ని స్మరించుకుంటున్నాం. దేశ స్వాతంత్ర సంగ్రామ చరిత్రలో ఎంతోమంది వీరులు ఉన్నప్పటికీ, వారిలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ మాత్రం ప్రత్యేకం. బానిస సంకెళ్ల నుంచి భరతమాతను విడిపించేందుకు వీరు చేసిన త్యాగం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించి ఉంది. మదమెక్కిన బ్రిటిషర్లకు ఎదురు తిరిగి తమ ప్రాణాలను ఈ దేశానికి అంకితం ఇచ్చారు. అది 1931, మార్చి 23వ తేదీ. బ్రిటిష్ ఇండియా (ప్రస్తుతం పాకిస్తాన్)లోని లాహోర్ సెంట్రల్ జైలులో బ్రిటీషర్లు ముగ్గురిని ఉరితీశారు. లాహోర్ కుట్ర కేసులో వీర దేశభక్తులకు మరణశిక్ష విధించారు. వారు ఎవరో కాదు తమ పోరాటాలతో బ్రిటిషర్లకు కంటిమీద కునుకులేకుండా చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు. నిజానికి వారిని మార్చి 24, 1931న ఉరితీయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. ఎప్పుడు ఎటునుంచి ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న భయంతో, నిర్ణీత సమయానికి దాదాపు 11 గంటల ముందు మార్చి 23, 1931 రాత్రి 7:30 గంటలకు ఉరితీశారు. 1928 సంవత్సరం నవంబర్ నెలలో భారతదేశ స్వాతంత్ర సమరంలో అత్యంత ప్రముఖుల్లో ఒకరైన లాలా లజపత్ రాయ్ మరణించారు. సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా చేసిన అహింసాయుత ఆందోళనకు రాయ్ నాయకత్వం వహించారు. దీంతోపాటు ఆయన బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా, భారత స్వాతంత్ర్యం కోసం పోరాడేందుకు అనేకమంది యువకులను తయారు చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేందుకు అనేకమందిని ప్రేరేపించారు. అతిక్రూరుడైన బ్రిటీష్ పోలీసు అధికారి జేమ్స్ ఎ స్కాట్ ఆధ్వర్యంలో జరిగిన ప్రాణాంతక లాఠీ ఛార్జ్‌లో రాయ్‌కు గాయాలు అయ్యాయి. ఈ గాయాలతోనే ఆయన చనిపోయారు. దీంతో ఆయన మరణానికి ప్రతీకారం తీర్చుకుంటామని భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు ప్రతిజ్ఞ చేశారు. బ్రిటిష్ దళాలకు గుణపాఠం చెప్పాలనే ఉద్దేశ్యంతో ఈ ముగ్గురూ బ్రిటీష్ పోలీసు అధికారి జేమ్స్ ఎ స్కాట్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. ఓ సందర్భంలో స్కాట్‌ను ఉరి తీయాలని భగత్ సింగ్ బహిరంగంగా కూడా ప్రకటించాడు. అయితే ఈ ముగ్గురు వీరులు వేరే బ్రిటీష్ పోలీసు అధికారి జాన్ సాండర్స్‌ను స్కాట్‌గా పొరపడి అతడిని కాల్చి చంపారు. ఈ కేసులో ముగ్గురిపై హత్యా, దేశద్రోహ నేరాలు మోపారు. అయినప్పటికీ భగత్ సింగ్ తన స్వాతంత్ర పోరాటాన్ని కొనసాగించాడు.

1929 సంవత్సరం ఏప్రిల్ నెలలో భగత్ సింగ్ తన సహచరుడు బతుకేశ్వర్ దత్‌తో కలిసి ఢిల్లీలోని సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ఎవరికీ హాని కలిగించకుండా రెండు బాంబులు వేశాడు. ఈ సమయంలో రాజ్‌గురు, సుఖ్‌దేవ్ కూడా ఆయనతోనే ఉన్నారు. ఆ సమయంలో వారు ప్రసిద్ధ స్వాతం త్ర్య పోరాట నినాదం అయిన 'ఇంక్విలాబ్ జిందాబాద్'' అంటూ నినాదాలు చేశారు. తాము అరెస్టుకు సిద్ధంగా ఉన్నామంటూ ముందుకు వెళారు. భగత్ సింగ్ బృందం స్వచ్ఛందంగా ముందుకు రాకపోతే, బ్రిటిషర్లు వారిని ఎప్పటికీ అరెస్టు చేయలేకపోయేవాళ్లేమో! కాగా, భారత స్వాతంత్ర కాంక్ష బలంగా తెలియజేయడానికే బాంబు వేశామని, ఎవరికీ హాని కలిగించాలన్న ఉద్దేశం లేదని వారు కోర్టులో ధైర్యంగా చెప్పారు. అయితే వీరిని కోర్టు దోషులుగానే తేల్చింది. వీరికి ఉరిశిక్ష ఖరారు చేసింది. దీంతో 1931, మార్చి 23వ తేదీన వారు ఈ భరతభూమిలో కలిసిపోయారు. ఆ ముగ్గురు త్యాగాన్ని దేశం ఎప్పటికీ మర్చిపోదు. నేడు ఆ అమరవీరుల దినోత్సవం సందర్భంగా దేశం మొత్తం వారిని స్మరించుకుంటోంది.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎంఎల్‌ఎ ప్రతాప్‌రెడ్డి



ప్రజాపక్షం/షాద్‌నగర్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని స్థానిక మాజీ శాసన సభ్యులు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కలిశారు. శుక్రవారం హైదారాబాద్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ ఎంఎల్‌ఎ ప్రతాప్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత కాశీనాథ్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. షాద్‌నగర్ అభివృద్ధి విషయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు.

## మణికొండ అక్రమ నిర్మాణాల కూల్చివేత



ప్రజాపక్షం/నార్సింగి: మణికొండ మున్సిపల్ పరిధిలోని నెక్నాంపూర్‌లో దేవా దాయ శాఖ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలపై శుక్రవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టిన దేవాదాయ రెవెన్యూ శాఖ అధికారులు. కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కబ్జా చేసి పహారీ గోడలు నిర్మించిన ఓ రియాల్టర్ కబ్జా చేసి వాటిని అమ్మకానికి పెట్టిన దేవుడి భూమిలో ప్రరిగోడలు నిర్మించి ఉన్న వాటిని. తెల్లవారుజామునే అధికారులు కూల్చివేశారు.ఎండోమెంట్ భూములో ఎవరైనా నిర్మాణాలు చేస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అధికారులు తెలిపారు.ఒక ఫుడ్ కోర్టుకు ఓ నిర్మాణానికి నోటీసులు ఇవ్వడం జరిగింది. ఎండోమెంట్ భూములను కొని మోసపోవద్దని ఆ శాఖ ఇఒ అరుణ కుమారి హెచ్చరించారు.

## కేశంపేటలో శివపార్వతుల కల్యాణం



ప్రజాపక్షం/కేశంపేట : కేశంపేట మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం శివపార్వతుల కళ్యాణాన్ని భక్తులు ఘనంగా జరిపించారు. భక్తులు మేలతాళాలతో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను గ్రామం నుంచి దేవాలయానికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన మఠం చంద్రశేఖర్‌చందన దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించి మంగళవాయిద్యాల నడుమ పూజారులు కళ్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు గ్రామ ప్రజలు, భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కళ్యాణం అనంతరం భక్తులు, ప్రజలకు గ్రామానికి చెందిన అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి సజ్జల విశ్వనాథం, గ్రామస్తులు కుమారస్వామి, పాండు గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దత్తకుమార్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధితో పాటు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కొత్తూరు: మహిళలు స్వయం ఉపాధితో పాటు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని కొత్తూరు తహశీల్దార్ రవీందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో పోషణ పక్షం మహిళా దినోత్సవాన్ని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత నివారించేందుకు తీసుకోవాల్సిన అహారం, గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలతోపాటు చిరుధాన్యాలను తీసుకోవాలని అప్పుడే వారి ఆరో గ్యం బాగుటుందని వివరించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే ఆ కుటుంబం ఎంతో బాగుంటుందని తెలిపారు. దాంతో గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ, రాష్ట్రం, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు వీలు ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ సిడిపిఒ నాగమణి, ఎంపిడిఒ అరుంధతి, ఐసిడిఎస్ సూపర్ వైజర్, గ్రామ కార్యదర్శి సురేందర్, వైఎం తండా కార్యదర్శి గీత, హెల్త్ సూపర్ వైజర్, కొత్తూరు ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఆర్.జ్యోతిలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారు

హైతాబాద్ పాఠశాల హెచ్‌ఎం వసంత



ప్రజాపక్షం/షాబాద్ : విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని హైతాబాద్ హెచ్‌ఎం వసంత అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెల్ఫన్ శిక్షణ పౌండేషన్ వారు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో హైతాబాద్‌కు దగ్గరలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటిలో పాల్గొన్నారు. ఈ పోటీలో మాచన్ పల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు బన్ని, రోహిత్, షబానా రజన ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. క్విజ్ పోటీలో గెలుపొందిన వారికి ప్రశంస పత్రం, మహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వసంత మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూన్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. నిరు పేద విద్యార్థులకు స్వచ్ఛంత సంస్థల ద్వారా సహాయ సహకారాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫన్ శిక్షణ పౌండేషన్ నిర్వహకులు భద్రయ్య, రాజు ఉపాధ్యాయులు రామి నాయుడు, మనీలా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రేగులకుంట చెరువు పనుల పరిశీలన



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : రేగులకుంట చెరువు దశ, దిశ మారినదని, ఏన్నో ఏండ్ల సమస్య నేటీతో తీరునని, శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి దిశగా పనులు వేగవంతగా నిర్వహిస్తున్నారని తెలిపారు. శుక్రవారం చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్‌లో గల రేగులకుంట చె రువు సుందరీకరణ పనులను శేరిలింగంపల్లి ఎంఎల్‌ఎ అరికెపూడీ గాంధీ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేగులకుంట చెరువును సెల్స్ ఫోర్స్ ఐటి సంస్థ వారి సిఎస్‌ఆర్ ఫండ్స్ ద్వార స్వచ్ఛందంగా రూ. కోటి యాభై లక్షల వ్యయంతో సుందరికరణ ప నులను చెపట్టారని తెలిపారు. మురికి కూపంలాగ ఉన్న చెరువును సుందరికరించి స్వచ్ఛమైన మంచి నీరు లాంటి చెరువుగా మార్చరని, దీనితో పా టు చెరువు కట్ట పటిష్టంగా ఉండేలా పునరుద్ధణ పనులను చెపడుతున్నామని, చెరువు చుట్టూ పచ్చిని చెట్లని ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెల్స్ ఫోర్స్ ఐటి సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, బిఆర్ఎస్ మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చిన అధికారులు



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : పెద్ద చెరువులో అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రహారి గోడను నిర్మించటంతో రెవిన్యూ,ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా పర్యటించి అక్రమ నిర్మాణాలను జెసిబి యంత్ర సహాయంతో కూల్చీ వేశినట్లు తెలిపారు. శుక్రవారం అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్ర సమీపంలో పెద్ద చెరువు ఇబ్రహీంపట్నం ఖాల్సా సర్వే నెంబర్ 1139 సి క్కం పట్టా భూమిని ఓ రియల్ ఎస్టేదారుడు అక్రమంగా కబ్జా చేసిన సంఘటనపై విచారణ చేసి పైఅధికారుల ఆదేశాల మెరకు ప్రహారి గోడ నిర్మాణాలను కూల్చీ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ,ఇరిగేషన్ శాఖల అధికారులు పుష్పలత,రాజ్యాలక్ష్మి, సిబ్బంది పాల్గోన్నారు.

## తిరుపతిరావు కమిటీ రిపోర్టు బహిరంగ పరచాలి

ఎఐఎస్‌ఎఫ్ ఒయు కౌన్సిల్ కార్యదర్శి నెల్లి సత్య



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌ల పదోన్నతులలో జరిగిన అవకతవకలపై ఇది వరకే నియమించిన తిరుపతి రావు కమిటీ రిపోర్టును బహిరంగ పరచాలని ఎఐఎస్‌ఎఫ్ ఒయు కౌన్సిల్ కార్యదర్శి నెల్లి సత్య అన్నారు. విస్తృత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి, సమగ్ర విచారణ జరిపించాలన్నారు. అక్రమాలకు పాల్పడిన ఎవరిని కూడా వైస్‌ఛాన్స్‌లర్‌గా నియమించకూడదని ఎఐఎస్‌ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు వినతిపత్రం అందచేశారు. సీనియర్ ప్రొఫెసర్‌ల అవకతవకలపై ఏర్పాటు చేసిన తిరుపతి రావు కమిటీ రిపోర్టులో అవకతవకలు జరిగాయని, దానిపైన విస్తృతస్థాయి కమిటీ ఏర్పాటు చేయమని రిపోర్టులో పేర్కొన్నారని, కమిటీ ఏర్పాటు గురించి ప్రభుత్వంతో చర్చిస్తానని, వైస్‌ఛాన్సలర్ నియమకాలలో వారికి అవకాశం ఇవ్వకుండా చర్యలు తీసుకుంటామని బుర్ర వెంకటేశం తెలిపారని అనంతరం నెల్లి సత్య చెప్పారు.

**వర్శిటీల పదోన్నతులపై విచారణ జరిపించాలి**

యుజిసి నిబంధనల ప్రకారం ఒక ప్రొఫెసర్ సీనియర్ ప్రొఫెసర్ కావాలంటే ఆ ప్రొఫెసర్ 10 రీసెర్చ్ ఆర్టికల్స్‌ను కలిగి ఉండాలని నెల్లి సత్య అన్నారు. అవి కూడా యుజిసి కేర్ లిస్ట్, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ లాంటి రీసెర్చ్ జర్నల్స్‌లలో పబ్లిష్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ ప్రొఫెసర్ కింద ఇద్దరు పిహెచ్‌డి అవార్డ్ పొందిన విద్యార్థులు ఉండాలన్నారు. కానీ ఈ అర్హతలు లేకుండా ఒయులో కొంతమంది ప్రొఫెసర్లు అక్రమాలకు పాల్పడి, సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారని విమర్శించారు. విద్యార్థులు ప్రొఫెస ర్లు చేసిన ఆందోళనకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిరావు కమిటీని ఏర్పాటు చేసి, రిపోర్టును కూ డా ఇచ్చిందన్నారు. ఆరిపోర్టును బహిర్గతం చేయాలని, తెలంగాణలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలలో కూడా సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులలో అవకతవకలు జరిగాయన్నారు. వాటన్నిటిని విస్తృత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ మార్గంలో పదోన్నతుల కోసం దరఖాస్తు చేసుకు న్న వారికి అవకాశం ఇవ్వకూడదన్నారు. ప్రభు త్వం స్పందించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. బుర్ర వెంకటేశంను కలిసిన వారి లో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కళ్యాణ్, సుశాంత్, దొని తదితరులు ఉన్నారు.

## పాడిపంటల వృద్ధికి పరిశోధనలు విస్తృతపరచాలి

న్యూఢిల్లీ ఐసిఆర్‌ఒ డైరెక్టర్ డా.రాజీవ్ రంజన్



ప్రజాపక్షం / రాజేంద్రనగర్ : మారుతున్న వాతవరణ పరిస్థితులకు అనుగుణంగా పశు పోషణ, వ్యవసాయ రంగాల్లో పరిశోధనలు విస్తృత పరచాలని, ప్రతి విద్యార్థి ఒక పారిశ్రామిక వేత్తగా మారటానికి కృషీ చేయాలని న్యూఢిల్లీ ఐసిఆర్‌ఒ డైరెక్టర్ డాక్టర్.రాజీవ్ రంజన్ అన్నారు. శుక్రవారం రాజేంద్ర నగర్ పివి నరసింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయం, భారత జాతీయ ఉత్పాదక మండలి(ఎన్‌పిసి) ఆధ్వర్యంలో సమగ్ర ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పశు సుస్థిర పాడి పశువుల ఉత్పాదకత పెంపొందించటంలో సమగ్ర పశుపోషణ యాజమాన్య పద్ధతులు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు స్థానిక విస్తరణ విద్యా సంస్థ(ఇఇఐ) ఆడిటోరియంలో జరిగింది. పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా. సిహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు వీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం కులపతి,ముఖ్యకార్యదర్శి అధార్ సిన్హా తన అధ్యక్ష ఉపాన్యాసంలో ప్రసంగిస్తూ తెలంగాణలో రైతుల పాడి ఉత్పాదక, సుస్థిర పశువుత్పాదకత పెంపొందించటానికి సమీకృత వ్యవసాయ విధానాలను అవలంభించి నేల ఆరోగ్యము, పశువుల సంక్షేమము, అభివృద్ధికి తోడ్పడవచ్చున్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా డాక్టర్.రాజీవ్ రంజన్, జాతీయ ఉత్పాదక మండలి డైరెక్టర్ డా.బి. హెమంత్ కుమార్, పివి నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయ డీన్ డా. జ్ఞాన ప్రకాష్, విశ్వ విద్యాలయ డిన్ డాటీ.రఘునందన్, డైరెక్టర్ డా.ఉదయ్‌కుమార్‌లు హాజరై ప్రసంగించా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... పశు ఉత్పాదకతు పెపొందించే అవశ్యకత ఎంతైన ఉందన్నారు. ఇం దుకుగాను వ్యవసాయ రంగాల్లో పరిశోధనలు విస్తృత పరిచేందుకు ప్ర తి విద్యార్థి కృషీ చేయాలన్నారు.ఈకార్యక్రమం లో ఇండియాన్ పోటాష్ లిమిటెడ్(ఐపిఎల్) మేనేజర్ వి.లోగమూర్తి,తిరుపతి పశు వైద్య విశ్వవిద్యాలయం డాక్టర్.వెంకట శేషయ్య,పశు వైద్య కళశాల ప్రొఫెసర్ ఆర్‌ఎంవి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ దొంగలకు చుక్కలు చూపించిన తల్లీకూతురు



ప్రజాపక్షం / హైదరాబాద్ : ఇంట్లో యజమాని లేని సమయంలో కొరియర్ పేరుతో ప్రవేశించిన దోపిడి దొంగలు డబ్బు, విలువైన ఆభరణాల దోపిడీకి విఫలయత్నం చేస్తూ ఇంట్లోని తల్లీ కూతుళ్ల చేతిలో పిడిగుద్దులు తాళలేక పరారీ లంఘించి పోలీసుల చేతికి చిక్కిన ఉదంతం ఇది. సికింద్రాబాద్ రసూల్‌పురాలోని ప్యాట్నీనగర్ జైన్‌కాలనీలో ఈ దోపిడీ యత్నం సంఘటన గురువారం పట్టపగలు చోటు చేసుకుంది. రాష్ట్ర వ్యాపితంగా చర్చనీయాంశమై సంచలనం సృష్టించిన ఈ ఘటనలో దోపిడీ దొంగలను నార్త్‌జోన్ డిసిపి నేతృత్వంలో పోలీస్ బృందాలు రంగంలోకి ప్రవేశించి సిసి కెమెరాల ఫుటేజీ సహాయంతో 24గంటల వ్యవధిలోపే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రముఖ వ్యాపారి ఎన్.కె.జైన్ నివాసంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. శుక్రవారం పోలీసులు తెలియజేసిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌కు చెంది న సుశీల్, అదే రాష్ట్రంలోని ఫరీదాబాద్‌కు చెందిన ప్రేమ్‌చంద్ అనే ఈ ఇద్దరు నిందితులు ఎస్.కె.మక్తా ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరిద్దరి నుంచి పోలీసులు ఒక తపంచా (దేశవాళీ తుపా కీ), రెండు కత్తులు, రోప్స్, ఒక రబ్బర్ బుల్లెట్ షె ల్, ఒక గిఫ్ట్ పేపర్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నా రు. వీరిద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు సికింద్రాబాద్‌లోని 11వ ఏసిఎంఎం కోర్టుకు రిమాండ్ చే శారు. తల్లీ కూతురి దోపిడీ దొంగలన ఎదుర్కొనేందుకు చేసిన వీరోచిత పోరాటం టీవీ న్యూస్ ఛానెల్స్‌లో చూపించిన సిసి కెమెరాల ఫుటేజీ దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో కూడా బాగా వైరల్ అవడంతో వీరనారులు అంటు ప్రశంసలు వెల్లువెత్తాయి. శుక్రవారం నార్త్ జోన్ డిసిపి రోహిణీ ప్రియదర్శిని బేగంపేట్ డివిజన్ ఏసిపిపి. గోపాల్‌కృష్ణమూర్తి సహా ఎన్.కె.జైన్ ఇంటికి వెళ్లి అమితా మహ్నోట్, ఆమె కూతురు ఇద్దరినీ ప్రశంసించారు. తన 11ఏళ్లకు పైగా సర్వీస్‌లో ఎన్నో దోపిడీ ఘటనలను చూసినప్పటికీ దోపిడీ దొంగలు తుపాకీ, చాకులతో బెదిరించినప్పటికీ వారిని అత్యంత ధైర్యసాహసాలతో ప్రతిఘటించిన వీరనారులు తల్లీ కూతురును ఇక్కడే చూస్తున్నానని, ప్రతీ మహిళ వీరి ధైర్యాన్ని ప్రశంసిస్తున్నారని వారిద్దరినీ అభినందనలతో ముంచెత్తారు. శాలువాలు కప్పి సన్మానించారు. నార్త్‌జోన్ డిసిపి డిసిపి రోహిణి ప్రియదర్శిని మార్గదర్శకత్వంలో బేగంపేట్ డివిజన్ ఏసిపి పి.గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో బేగంపేట్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మల్లేషం బృందం ఈ అరెస్టులలో పా ల్గొన్నారు.

## న్యాయ విద్యార్థుల జీవితం ఆదర్శవంతంగా ఉండాలి

టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : న్యాయ శాస్త్రం చదువుతున్న విద్యార్థుల జీవితం ఎప్పటికీ పదిమందికి ఆదర్శవంతంగా ఉండాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. శుక్రవారం ఎల్‌బినగర్ మహాత్మా గాంధీ లా కాలేజీలో జరిగినటువంటి నూతన విద్యార్థుల స్వాగతోపన్యాస కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, అత్యున్నత శిఖరాలకు అధిరోహించాలని తెలిపారు.అంతే కాకుండా కని పెంచిన తల్లిదండ్రులకు, విద్యా నేర్పిన ఉపాధ్యాయ బృందానికి, చదువుకున్న కాలేజీకి, పుట్టి పెరిగిన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. న్యాయ శాస్త్రం చదువుతున్న మీరందరూ న్యాయం చేసే విధంగా మన భవిష్యత్తు ఎప్పటికీ పదిమందికి ఆదర్శవంతంగా ఉండాలని అన్నారు. ఈ కాలేజీలో చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది జడ్జిలు న్యాయవాదులై ఎంతో మంచి పేరు తీసుకువచ్చారని మధుయాష్కి అన్నారు. అనంతరం కరస్పాండెంట్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులే ఈ దేశానికి పునాదు లాంటి వారిని 22,23 సంవత్సరం గాను విద్యార్థులలో జడ్జి అయినటు వంటి హరీష్ కాలేజీ యాజమాన్యం అభినందనలు చెప్పారు. ఇలాంటి విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా లా కళాశాల ప్రొఫసర్ జి.బి రెడ్డి,లెక్చరర్లు శ్రీలక్ష్మి , సత్యం,రక్షక్,వైష్ణవి, హాసిని, కీర్తి, విద్యార్థిని, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## హస్తంతోనే అభివృద్ధి సాధ్యం

పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



ప్రజాపక్షం/షాద్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి పక్షాల మాటలు వినకుండా హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కోరారు. శుక్రవారం కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ని ర్వహించారు. గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పా ర్టీలో చేరారు. వారందరికి హస్తం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించా రు. ఈ సందర్భంగా అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీల నేతలు అనేక వాగ్ధానాలు ఇస్తుంటాయ ని, వాటిని ఎవరు నమ్మకుండా ప్రతి ఒక్కరు హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలంటే, జాతీ య స్థాయిలో పోరాటం చేయాలన్న కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ని గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, గోనే రవీందర్‌రెడ్డి, చింతకింది సత్యానారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే టోర్నమెంటుకు వేదిక కానున్న గచ్చిబౌలి స్టేడియం



ప్రజాపక్షం/నార్సింగి: జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇన్విటేషన్ ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్ 2025 జనవరి 18 నుంచి 22 వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో భారత్ ఆతిథ్యం ఇవ్వనుందని దయానంద్ కుమార్ చీఫ్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి రాపోలు సుదర్శన్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ 50 ఏళ్ల తర్వాత భారతదేశంలోని హైదరాబాదు లో ఇలాంటి అంతర్జాతీయ టోర్నమెంటు జరపడం ఇదే తొలి సారి అని అన్నా రు. ప్రపంచ నమూల నుండి 30 దేశాల నుండి 3000 మందికి పైగా పా ల్గొంటారని ఆయన అన్నారు.నాలుగు కేటగిరీలుగా ఈవెంట్స్ టోర్నమెంటు నిర్వహించడం జరుగుతుందని 8 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల బాల బాలికలు, 40 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వరకు బ్లాక్ బెల్ట్ మాస్టర్లు టోర్నమెంట్లో పాల్గొంటారని విజేతగా నిలిచిన వారిని విన్నర్‌గా ప్రకటిస్తామని చెప్పారు. అంతర్జాతీయ టోర్నమెంట్లో పాల్గొనేందుకు ఐదుగురు అర్హులైన వారికి ప్రత్యేక శిక్షణ శిబిరం కోసం ఇద్దరు చిప్ ఇన్స్‌పెక్టర్లను రవీందర్ స్పాన్సర్ చేస్తారని వివరించారు. షిహాన్ ఆనంద్ రత్న 70వ దశకంలో జెకెఎని భారతదేశానికి పరిచయం చేసిన వ్యక్తి అని ఆయన ప్రపంచంలోనే మొదటి జపనీస్ కానీ వ్యక్తి అయ్యాడన్నారు. భారత దేశంలో 21 రాష్ట్రాల్లో జపాన్ కరాటే అసోసియేషన్ శాఖలుగా విస్తరించి ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సాంసంగ్ ధనరాజ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌టియు నాయకులు కిరణ్ మరణం.. ఆటోరంగ కార్మిక ఉద్యమానికి తీరనిలోటు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఐఎఫ్‌టియు నాయకులు కిరణ్ గురువారం బాలాజీనగర్ ప్రగతినగర్‌లోని తన స్వగృహంలో మరణించారు. ఎఐటియుసి నాయకులు వివిఎస్.బోస్, ఆటో రాష్ట్ర ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం, కాప్రా ఎఐటియుసి నాయకులు ఎస్.శంకర్ రావు, బాలాజీ నగర్‌లోని పార్టీ నాయకులు శంకర్, ఎఐటియుసి నాయకులు యాదగిరి, లక్ష్మ ణ్, ఎల్ల య్య, హైదరాబాద్ ఆటో యూనియన్ నాయకులు జంగయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు రాజేశ్వరి కిరణ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆటో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ కిరణ్ ఐఎఫ్‌టియులో పనిచేస్తూ ఆటో రంగంలో అనేక సంవత్సరాల నుండి ఆటో కార్మికుల సమస్యలపై ఐక్య ఉద్యమాలలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. కిరణ్ మరణం ఆటో రంగంలోని కార్మిక ఉ ద్యమానికి తీవ్ర నష్టం ఏర్పడిందన్నారు. కిరణ్ నిబద్ధత కలిగిన ఉద్యమకారుడని కొనియ దారు. కిరణ్ మరణం పట్ల వారు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఉపాధీ హామీలో అక్రమాలకు పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు : శ్రీలత



ప్రజాపక్షం/షాబాద్ : ఉపాధి హామి పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని డిఆర్‌డిఎ జిల్లా అధికారిణి శ్రీలత అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ అపర్ణ అధ్యక్షతన ఉపాధి హామి సామాజిక తనిఖీ ప్రజా వేదికపై సోషల్ అడిట్ పరిశీలన సమీక్ష కార్యక్రమాని ప్రారంభించారు. అనంతరం మండలంలోని 41 గ్రామ పంచాయతీలో 2022–2023లో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో విస్తృత స్థాయి అడిట్ చేసిన్నట్లు వివరించారు. చాల గ్రామాల్లో హరితహారం ద్వారా మొక్కలు నాటి వాటిని కాపాడలేదని ఫిల్డ్ అస్సిస్టెంట్‌లు సరిగా శ్రద్ధ చూపలేదని అడిట్ అధికారులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఫిల్డ్ అస్సిస్టెంట్‌లు మాట్లాడుతూ.. మొక్కలు నాటినది వాస్తవం వాటిని పశువుల నుండి కాపాడేందుకు వీలు కాలేదని దీంతో నాటిని మొక్కలు చనిపోయిన్నట్లు వివరించారు. గ్రామ స్థాయిలో చాల మంది ఫీల్డ్ అస్సిస్టెంట్‌లు సరిగా విధులు నిర్వహించకపోవడంతో చాల మందికి ఉపాధి ఇవ్వలేదని అడిట్ అధికారులు ఆరోపించారు. మండల స్థాయిలో అధికారులు పర్యవేక్షణ లోపంతో క్రింది స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా పనులను నిలిపివేసిన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ జిల్లా అధికారిణి శ్రీలత మాట్లడుతూ.. మండల స్థాయిలో అధికారులు వివిధ గ్రామాల ఫీల్డ్ అస్సిస్టెంట్ లతో గ్రామాలోని రైతులతో అవగహాన కార్యాక్రమాలు నిర్వహిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమకంలో జిల్లా స్థాయి అధికారులు సుభాషిణి, సునీతామూర్తి, చరణ్ గౌతమ్, ఈవొపిఆర్‌డి హన్మంత్ రెడ్డి. ఎపిఒ వీరాసింగ్, కొండయ్య, అడిట్ అధికారులు తదితరులు ఉన్నారు.

## రోడ్డు విస్తరణ పనుల్లో ఎవరినీ ఇబ్బందులకు గురిచేయం

షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్ : రోడ్డు విస్తరణ పనుల్లో ఎవరిని ఇబ్బందుల్లో పెట్టమని, విస్తరణ పనులకు ప్రజలందరు సహాకరించాలని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం షాద్‌నగర్‌లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ షాద్‌నగర్ ముఖ్యకూడలి నుండి సోలిపూర్ బైపాస్ రహదారి వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికి గత పాలకుల నిర్లక్ష్య వైఖరీ కారణంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని వివరించారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న భవనాలకు, షాపులకు ఇబ్బందులు కలిగించకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆస్తులకు, భవనాలను ఎక్కువ నష్టం వాటిల్లకుండా సురక్షితంగా ఉండే విధంగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గతంలో నిధులు లేకపోవ డం వల్లనే రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి సమస్యలను పరిష్కరించడంతోపాటు నిధులు మంజూరు చేయించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇసి మార్గదర్శకాల మేరకు అభ్యర్థుల ఖర్చుల వివరాలు నమోదు

సహాయ వ్యయపరిశీల సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్



ప్రజాపక్షం / హైదరాబాద్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో సహాయ వ్య య పరిశీలకులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థు ల ఖర్చుల వివరాలను నమోదు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సహాయ ఎన్నికల సహాయ వ్యయ పరిశీలకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల వ్య య నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు ఇప్పటి వరకు ఎన్నికల వ్య యం నమోదు పనితీరును ఆయన సమీక్షించారు. వ్యయ నిర్వహణ రిజిస్టర్లు పక్కాగా నిర్వహించుటకు, రోజువారీ నివేదికలు ఎన్నికల కమిషన్‌కు పంపించుటకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు చురుకుగా, సమర్థవంతంగా వి ధులు నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకు సంబంధించి ఏ నమూనాలో వివరాలు ఇవ్వాలో వారికి అవగాహన కల్పించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు అనుమతులు ఇచ్చే అధికారులతో సమన్వయం చేసుకుంటూ రోజువారీ ఖర్చు వివరాలు నమోదు చేయాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే బల్క్ ఎస్ఎంఎస్‌లు, స్టార్ క్యాంపెయినింగ్ తదితర వాటికి సంబంధించిన ఖర్చు వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటల్, డి.ఆర్.ఓ వెంకటచారి, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/తాండూరు :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతను తాండూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన ఘనం సన్మానించారు. శుక్రవారం తాండూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేష్ చైర్‌పర్సన్ నియామకమైన కల్వ సుజాత మొదటి సారిగా తాండూరుకు రావడంతో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మాన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మైనర్ బాలుడు మృతి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** మైనర్ విద్యార్థికి బైక్ ఇచ్చి ప్రాణం పోయేలా చేసాడు ఓ బడి పంతులు...మంచినీళ్ల కోసం వెళ్లి ద్విచక్ర వాహనంతో ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన విద్యార్థులు ఈ ఘటనలో ఓ విద్యార్థికి ప్రక్కటేముకులతోపాటు కాలు విరిగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం కేంద్రంలోని ఆదర్శ (మోడల్) పాఠశాలకు వెళ్లే దారిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బస్సులో ఉన్న ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నవాబ్ పేట్ మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు కార్తీక్, వేణులు రోజు మాదిరిగానే ఆర్కతల గ్రామం నుండి నవాబ్ పేటలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఉదయం పాఠశాలకు రావడం జరిగింది.

## విద్యా ప్రయోజనాల కోసమే...



**ప్రజాపక్షం/చర్లపల్లి :** విద్యార్థుల విద్యా ప్రయోజనాల కోసమే సంస్థని స్థాపించడం అభినందనీయమని ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి అన్నారు.శుక్రవారం ఏఎస్ రావు నగర్‌లోని డాక్టర్ హోమిజె బాబా హాలులో డాక్టర్ విక్రమ్ సారాబాయి సైంటిఫిక్ ఎడ్యుకేషన్ శాస్త్రీయ విద్యా ట్రస్టు ఏర్పాటు కార్యక్రమంలో లక్ష్మారెడ్డి అంబర్‌పేట్ ఎంఎల్ఏ కాలేరు వెంకటేష్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు,విద్యాసంస్థలు వంటి లబ్దిదారులకు ఆర్థిక సహాయాన్ని అందించే ఉద్దేశ్యంతో ఈ సంస్థను స్థాపించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు,ట్రస్టు సభ్యులు సిద్ధార్థ్,సోమరాజు,గణేష్‌రావు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా

డ్రైనేజీ సమస్యను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్ర వారం లక్ష్మి నగర్ కాలనీలో ఉదయం వాకింగ్ భాగంగా పర్యటించారు.కాలనీలోని సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు.కాలనీవాసులు డ్రైనేజీ సమస్య గూర్చి వివరించారు.అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని ఎంఎల్ఏ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కాలనీవాసులు ఎంఎల్ఏకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులతోనే వ్యవసాయం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సేంద్రియ ఎరువులతోనే రైతులు వ్యవసాయం చేయాలని భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ రైతు వేదికలో రైతుశిక్షణ కేంద్రం రాజేంద్ర నగర్ వ్యవసాయ సంచాలకులు ఆదిలక్ష్మి రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వలన భూమి సారవంతం కోల్పోతుందని చెప్పారు. సేంద్రీయ ఎరువులు వాడటం వలన భూమిలో జీవరాశి పెరుగుతుందన్నారు. రైతులు ఆవు (గోమాతను) పెంచుకుని ఆవు నుంచి వచ్చే ఆవు మూత్రం, పేడతో అద్భుతాలను ఆవిష్కరించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవియాదవ్, ఎఫ్‌సిఎస్ క్లర్క్ విజయ్‌కుమార్, రైతులు జగన్‌మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, ప్రబాకర్‌రెడ్డి, కుంట మల్లేష్, బిక్షపతి, మల్లేష్, వీరయ్యగౌడ్ పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి వారి పంచలోహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి రాఘవేంద్ర కాలనీ లో శ్రీ హరిహర క్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయం లో పంచలోహ శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి, బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్మిల్ల సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

## ఓటింగ్ శాతం పెంచండి



**ప్రజాపక్షం/ఫేట్ బషీరాబాద్ :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం కొంపల్లి పుర పాలక సంఘం పరిధిలోని సాయి తేజ డిగ్రీ కళాశాల , గ్రేట్ ఇండియా కళాశాలలో స్వీప్ ఆక్టివిటీస్ అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఇట్టి స్వీప్ ఆక్టివిటీస్ లో భాగంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రతి ఓటర్ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని , నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ బి.లతా, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సురేశ్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ డి.రంజిత్ కుమార్, వార్డు అఫ్ఫీసర్లు, మెప్మా సిబ్బంది, రెసోర్స్ పర్సన్స్, డ్వాక్రా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## దేశానికి ప్రతిభావంతులైన మహిళలు అవసరం




**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** దేశానికి ప్రతిభ కలిగిన మహిళలు ఎంతగానో అవసరమని ఎలికో కంపెనీ వైస్ చైర్ పర్సన్ వనిత డాట్ల అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, రాజీవ్ గాంధీనగర్‌లోని బివిఆర్ ఐటి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం నిర్వహించారు. ఈ మేధాన్వేష్ 2కె24 కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎలికో కంపెనీ వైస్ చైర్ పర్సన్ వనిత డాట్ల విచ్చేసి మాట్లాడుతూ మహిళలు తమ కార్యస్థలములో దీర్ఘకాలిక లక్ష్యాలు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎన్ సునిత మాట్లాడుతూ ఈ దశమ సాంకేతిక కార్యక్రమంలో విభిన్నమైన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మేధాన్వేష్ 2కె 24 సమన్వయ కర్త డాక్టర్ అమ్రిత మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విభిన్నంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సాంకేతిక ఉత్సవానికి వివిధ కళాశాలల నుండి మంచి స్పందన లభిస్తుందని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అగ్నిమాపకంపై మాక్‌డ్రిల్

**ప్రజాపక్షం / కొడంగల్ :** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ పరికరాలు ఎగ్జిబిషన్, ప్రజల్లో అవగాహన కోసం.. అగ్నిమాదాలపై కొడంగల్ ఫైర్ స్టేషన్ అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రి కళశాలలో విద్యార్థులకు అగ్నిమాపక పనితీరుపై ప్రత్యక్షంగా మాక్ డ్రిల్ ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ అత్యవసర అగ్ని ప్రమాదాలు నివారించుటకు, రోడ్డు ప్రమాదములు, వరదలు, తుఫానులను ఎదుర్కోనుటకు 24 గంటలు అగ్నిమాపక కేంద్రాములలో అందుబాటులో ఉంటారన్నారు. అగ్నిప్రమాదాలు జరుగకుండా జరిగిన వాటిని నివారించుటకై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

# నీరు పరిమితమైన వనరు

### జలమండలిలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలిలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ సర్వే యాప్, నేటి నుంచి ఈ నెల 28 వరకు నిర్వహించనున్న అవగాహనా కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం దాన కిషోర్ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు నగరంలో ఇంకుడు గుంతలపై సర్వే చేపట్టాలన్నారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. వీటి తనిఖీ కోసం నోడల్ ఆఫీసర్లను నియమించాలని సూచించారు. వీరంతా ఎప్పటికప్పుడు తనిఖీను పర్యవేక్షించాలన్నారు. జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మన జీవితంలో నీరు ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. హైదరాబాద్ నగరంలో ఎలాంటి నీటి కొరత లేదని పునరుద్ఘాటించారు. గతంలో సరఫరా చేసిన దాని కంటే, ప్రస్తుతం అదనంగా 7 ఎంజిడిల నీరు అందిస్తున్నామని తెలిపారు. అవసరమైతే మరో 10 ఎంజిడిల నీరు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అందువల్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాబోయే రెండేళ్ల వరకు తాగు నీటి ఎద్దడి లేకుండా నగరానికి సరిపడా నీటిని తరలించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నగరంలో నేటి నుంచి 28 వరకు, నీటి విలువ పౌరులకు తెలిపేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఇందులో పలు స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కానున్నట్లు చెప్పారు. జిహెచ్ఎంసి కమిషనర్ రొనాల్డ్ రోస్ మాట్లాడుతూ నీరు అనేది పరిమితమైన వనరు అన్నారు. అలాంటి ముఖ్యమైన వనరును అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. నీటి సంరక్షణ, వాడకంలో అప్రమత్తంగా ఉండకపోతే, నీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో నీటిని సంరక్షించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ.డి. డాక్టర్ ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్2 స్వామి, ఆస్కి అధ్యాపకురాలు స్నేహలత, సిజిఎంలు, జిఎంలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



**హైదరాబాద్ :** విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘము రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.దామోదర్ రెడ్డి, సి.చంద్రశేఖర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘము రాష్ట్ర కార్యనిర్వహకవర్గ సమావేశం ఈ శుక్రవారం హైదరాబాద్ బడీచౌడిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర సెక్రెటరీ జనరల్ సి.చంద్రశేకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వి. విశ్వనాథరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. శ్రీనివాస్‌రెడ్డి, గుండం మోహన్ రెడ్డి, పి. ఆర్.మోహన్, రాష్ట్ర కార్యదర్శులు పి.శరత్ బాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు జి.బక్కారెడ్డి, కె.సూర్యప్రకాష్, ఎ. లక్ష్మీ నరసింహ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం. రవీందర్ రెడ్డి, పి.పెంటయ్య, పబ్లిసిటీ కార్యదర్శి బి. ప్రహ్లాద రావు, నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు జి. వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.దామోదర్ రెడ్డి, సి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సిహ్మను విడివిడిగా కలిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలను విన్నవించినట్లు కార్యవర్గ సభ్యులకు విన్నవించారు. అదే విధంగా రాష్ట్ర కర్యనిర్వాక వర్గ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం రాష్ట్ర శాఖ ఆర్థిక కార్యదర్శిగా పెంటయ్యను నియమిస్తూ, పెన్షనర్స్ వాయిస్ కమిటీ సభ్యులుగా భోజాగౌడ్, క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా ఆర్. సాయిలు, భవన నిర్మాణ కమిటీలో విశ్వాస్ రెడ్డి, జి. శ్రీనివాస్ రెడ్డిలను నియమించడాన్ని కార్యదర్శి వర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రితో నిర్వహించ తలపెట్టిన ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. సంఘ పటిష్టం కోసం వివిధ కమిటీలలో అవసరమైన వారిని చేర్చుకునేందుకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అధికారం ఇస్తూ సమావేశం తీర్మానించింది.

## కామ్రేడ్ కిరణ్‌కు కన్నీటి నివాళి



**ప్రజాపక్షం/ జవహర్‌నగర్:** ప్రజా గొంతుక మూగబోయింది. నిత్యం ప్రజా సమస్యలపై తన గొంతుతో గళమెత్తిన కామ్రేడ్ కిరణ్ హస్తమించాడు. తన మాటలతో ప్రజా ఉద్యమాలకు ఊపు తెచ్చిన ఆ గొంతు శాశ్వతంగా మూగబోయింది. ఆటో డ్రైవర్ల హక్కుల కోసం పోరాడుతున్న ఆటో అండ్ మోటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ వి. కిరణ్ గురువారం సాయంత్రం అనారోగ్యంతో జవహర్ నగర్‌లో తన నివాసంలో కన్నుమూశారు. నిజామాబాద్‌లోని సారంగాపూర్ గ్రామానికి చెందిన కిరణ్ జవహర్‌నగర్‌లో స్థిర నివాసం ఏర్పరుచున్నారు. కిరణ్‌కు భార్య గంగమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. చిన్నతనం నుంచి ప్రజల హక్కుల కోసం పోరాడే కిరణ్ 1997లో ఆటో యూనియన్ ప్రారంభించి ఆటో డ్రైవర్ల అభ్యున్నతికి ఎంతగానో కృష చేశాడు. జవహర్‌నగర్‌లో నివసించే గుడిసెవాసులకు అండగా నిలిచి ఎంతో మందికి గూడు కల్పించిన పోరాటయోధుడు. నిరుపేదల ఇండ్ల స్థలాల కోసం ఆటో డ్రైవర్ల హక్కుల కోసం ప్రభుత్వాలను తన గళంతో ప్రశ్నించి హక్కులను సాధించిన ఘనత కిరణ్‌దని, ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**నివాళులర్పించిన ప్రజా సంఘాల నేతలు...**
పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, సీపీఐ(ఎంఎల్) నాయకురాలు అనురాధ, ఐఎఫ్‌టీయూ నాయకుడు షేక్‌షావలీ, పీడీఎం నాయకులు చంద్రమౌళి, జాన్, బాలనర్సింహా, ఎఐటీయూసీ రాష్ట్ర నాయకులు, పీడీఎం, సీపీఐ, ఆటో యూనియన్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొని నివాళులర్పించారు.

## తాండూరులో పూల రైతుపై దాడి

### పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతు



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో దళారులు రెచ్చిపోయారు. పట్టణానికి చెందిన పూల దళారులు పట్టణంలో పూలు విక్రహిస్తున్న రైతుపై దాడిగి దిగారు.ఏకంగా పూలను రోడ్డుపై పారబోశారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన రైతు తాండూరు పోలీసులను ఆశ్రయించారు. పెద్దేముల్ మండల పరిధి జనగాం గ్రామానికి చెందిన రైతు పూల వ్యాపారి తాండూరులో భద్రేశ్వర దేవాలయం సమీపంలో పూలను విక్రయాలు చేస్తుంటారు. నువ్వు ఎట్లా పూలను విక్రహిస్తున్నవంటూ, ఇక్కడ నువ్వు పూలు విక్రహించడానికే వీలు లేదంటూ పూల రైతుపై దళారులు దాడిగి దిగారు. నేను రైతును తన పొలంలో పండించిన పూలను తెచ్చి విక్రహించుకుంటున్నానని చెప్పిన పట్టించుకోకుండా దళారులు పూలను రోడ్డుపై పారబోసి నువ్వు ఇక్కడ పువ్వులు అమ్ముకోవడానికి వీలు లేదన హెచ్చరించారు. హెచ్చరించడంతో రైతుపై మూకుమ్మడి దాడికి దిగారు. ఈ దాడిలో గాయాలపాలైన రైతు తాండూరు పట్టణ పోలీసులను ఆశ్రహించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును అందుకున్న పోలీసులు బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆకెళ్ళ సర్వేశ్వరరావుకు ఎఐలో జీవన సాఫల్య పురస్కారం




**హైదరాబాద్ :** కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటిజెన్స్)ను ఉపయోగించి సంక్లిష్టమైన మొండి వ్యాధులను శరవేగంగా నిర్ధారించి చికిత్సలు అందించేందుకు చేసిన పరిశోధనలకు గాను డా. ఆకెళ్ళ సర్వేశ్వరరావుకు జాతీయస్థాయిలో జీవన సాఫల్య పురస్కారం లభించింది. హైదరాబాద్ కొంపల్లెలోని సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజన్స్ మెడికల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎఐఎంఇఆర్ఐ–24) ఈ పురస్కారాన్ని సర్వేశ్వరరావుకు ప్రకటించింది. దీర్ఘకాలిక, సంక్లిష్టమైన వ్యాధులను గుర్తించేందుకు, వాటికి చికిత్సలు అందించేందుకు కృత్రిమ మేధస్సు ఎంతో ఉపయోగపడుతుందని పురస్కార గ్రహీత డా.పరమేశ్వరరావు ఈ సందర్భంగా అన్నారు. క్యాన్సర్, న్యూరాలజీ సమస్యలు, నేత్రపరమైన సమస్యలు, మహిళలు ఎదుర్కొనే సమస్యలన్నింటినీ జాప్యం లేకుండా కృత్రిమ మేధ ద్వారా రోగనిర్ధారణలు చేయవచ్చు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు చెందిన నేషనల్ రీమోట్ సెన్సింట్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సి) విశ్రాంత శాస్త్రవేత్త, పద్మశ్రీ డా.బులుసు వెంకటలక్ష్మీ దీక్షితులు, గైనకాలజిస్ట్ పద్మశ్రీ డా.మంజుల అనగాని, డిఆర్‌డిఒ రిటైర్డ్ ఆఫీసర్ ఆర్ఎన్ రెడ్డి ప్రభృతులు డా.పరమేశ్వరరావుకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఎఐఎంఇఆర్ఐ అధ్యక్షుడు డా,సాయి సతీశ్, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డా. చక్రపాణి, బిఆర్ఎస్ ఎంఎల్ఏ–అనురాగ్ విశ్వవిద్యాలయం ఛైర్మన్ డా. పి.రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.వి.ఎస్ఆర్ రెడ్డి, సిఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ అధిపతి డా.గోపాల్ రెడ్డి, భావప్రకటనా నిపుణుడు గంపా నాగేశ్వరరావు ప్రభృతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మురికివాడల్లోని డ్రాపౌట్స్ కోసం ఉచిత బ్రిడ్జి స్కూల్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** మురికివాడల్లో చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థుల కోసం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్‌హెచ్‌ఎఫ్) ఆధ్వర్యంలో జల్‌పల్లిలోని స్థానిక మసీదు సహకారంతో పహాడీ షరీఫ్ రోడ్ జల్‌పల్లి గేట్, అల్‌అష్రఫ్ యునానీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న మస్జిద్ ఈ రెహ్మత్ ఈ ఆలమ్‌లో మొదటి బ్రిడ్జ స్కూల్ ఏర్పాటైంది. ప్రైమరీ, మిడ్ స్కూల్ డ్రాపౌట్స్ కోసం ఉచిత బ్రిడ్జ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్‌లో ప్రాథమిక స్థాయి నుంచి మాధ్యమిక స్థాయి వరకు 110 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా సమీపంలోని మురికివాడల నుంచి బ్రిడ్జ స్కూల్ కోసం నమోదయ్యారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ ఫౌండేషన్ ప్రతినిధి ముజ్తబా హసన్ అస్కారీ మాట్లాడుతూ ఈ స్కూల్ కు అర్హులైన ఉపాధ్యాయులు, కౌన్సెలర్లు, ఉచిత రవాణా సదుపాయం ఉన్నాయన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఉడికించిన గుడ్లు, అరటిపండ్లతో కూడిన మధ్యాహ్నం అల్పాహారం ఇవ్వనున్నామన్నారు. పట్టణ మురికివాడల్లో మరిన్ని బ్రిడ్జ్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

# నిజాంపేట్‌లో 21వ సెంచరీ వెంచర్ మాయాజాలం

### ప్రాజెక్టుని వదిలేసినా అక్రమంగా రిజిస్ట్రేషన్లు
### నిజాంపేట్ స్ప్రింగ్ వ్యాలీ కాలనీలో మాయమవుతున్న ప్రభుత్వ స్థలాలు



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మండలం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అక్రమాలకు నెలవుగా మారింది. ప్రభుత్వ స్థలాలు, కాలనీల్లో ప్రజావసరాలకు వదిలేసిన ఖాళీ స్థలాలను భూ బకాసురులు ప్లాట్లుగా చూపించి మింగేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, ఖాళీ స్థలాల్లో యథేశ్చగా నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇరవై సంవత్సరాల క్రితం రియల్ ఎస్టేట్స్ రంగంలోనే ఓ వెలుగు వెలుగిన రియల్ ఎస్టేట్స్ సంస్థ 21వ సెంచరీ వెంచర్. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్, బాచుపల్లి, మల్లంపేట్, బౌరంపేట్ తదితర గ్రామాల్లో ఈ సంస్థ వెంచర్‌లు కోకొల్లలు. ప్రస్తుతం మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మండలం, నిజాంపేట్ గ్రామంలో సర్వేనంబర్లు 340, 341, 343 పార్ట్, 342లలో సుమారు ఏడు ఎకరాల ప్రైవేటు స్థలంలో 21వ సెంచరీ వెంచర్ 2007 సంవత్సరంలో వెలిసింది. గ్రామ పంచాయతీ లే అవుట్ ప్రకారం విల్లాల నిర్మాణానికి అనుమతిని పొందారు. అయితే కొన్ని అవకతవకల కారణంగా 2009 లో 21వసెంచరీ వెంచర్‌ని రద్దు చేశారు. ట్యాక్స్‌ని కట్టని పక్షంలో 21వ వెంచర్ సంస్థను ప్రాజెక్టులన్నీ నిలిపివేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. కాగా 2017 సంవత్సరంలో వెంటర్ యజమాని నిజాంపేట్‌లోని ప్రాజెక్టుని వదిలేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత ఇతర రియల్ ఎస్టేట్స్ సంస్థ మరోసారి లే అవుట్‌ని మార్చి విల్లాల నిర్మాణం చేపట్టింది. తదనంతరం స్ప్రింగ్ వ్యాలీ కాలనీగా అవతరించింది. గత 21వ సెంచరీ వెంచర్ యజమాని తాను ప్రాజెక్టుని వదిలేస్తున్నట్లు చేప్పినప్పటికీ గతంలో బ్రోచర్‌లలో చూపించిన పార్కు స్థలాలను సైతం ప్లాట్లుగా చేయడం, ప్రభుత్వ స్థలాల్లో ప్లాట్లుగా చూపించి ఓ బిల్డర్‌కి విక్రయించడం విశేషం. 2020 సంవత్సరంలో సర్వేనంబరు 338, 343 లోని ప్రభుత్వ స్థలంలో ప్లాట్ నంబర్లు 197, 198, 199, 200, 201, 203లను 21వ సెంచరీ వెంచర్ యజమాని రిజిస్ట్రేషన్లు చేయడం అవినీతికి పరాకాష్టగా మారింది. ప్రభుత్వ సర్వేనంబర్లైన 338, 343లోని ప్రభుత్వ స్థలంలో రిజిస్ట్రేషన్‌లను చేయడం గమనార్హం. కాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామ పంచాయతీ లే అవుట్‌లలోని ఖాళీ ప్లాట్లకు లింకు పత్రాలు లేకుండా రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయగా 21వ సెంచరీ వెంచర్ యజమాని ఏకంగా రిజిస్ట్రేషన్ అధికారులను మేనేజ్ చేసి ఎల్ఆర్ఎస్ లేకుండా, లింకు పత్రాలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయడం విశేషం. ప్రాజెక్టుని చేయలేను అని చేతులెత్తేసిన సదరు బిల్డర్ తాజాగా ప్రభుత్వ స్థలాల్లో, ఎమినిటీస్ కోసం వదిలేసిన ఖాళీ స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు, మున్సిపల్ నుండి భవన నిర్మాణ అనుమతుల పై ప్రస్తుతం ఏర్పాటైన స్ప్రింగ్ వ్యాలీ కాలనీ అసోసియేషన్ సభ్యులు కోర్టును ఆశ్రయించగా ఎలాంటి నిర్మాణాలను చేపట్టవద్దని ఆర్డర్ జారీ చేసింది. అయితే సదరు ప్లాట్‌లను కొనుగోలు చేసిన వ్యక్తి కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ సంబంధిత అధికారులను గుప్పిట్లో పెట్టుకుని నిర్మాణాలను చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ ఏ విధంగా నిర్మాణాలను చేస్తున్నారని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేరని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేస్తున్న సదరు వ్యక్తి పై చర్యలు తీసుకుని కాలనీ వాసులకు కావాల్సిన ఎమినీటీస్‌ని కల్పించే విధంగా చూడాలని స్ప్రింగ్ వ్యాలీ కాలనీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

**స్ప్రింగ్ వ్యాలీలో ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను తొలగించాలి..**
బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ స్ప్రింగ్ వ్యాలీ కాలనీలో ప్రజావసరాలకు వదిలేసిన ఖాళీ స్థలాల్లో మరియు ప్రభుత్వ స్థలాల్లో ఓ బిల్డర్ యథేశ్చగా విల్లాలను నిర్మిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కాలనీలో సర్వేనంబరు 383, 343లలోని ప్రభుత్వ స్థలంలో ప్లాట్ నంబర్లు 196, 197, 198, 199, 201, 202, 203 లలో యథేశ్చగా విల్లాల నిర్మాణాలను చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా రిజిస్ట్రేషన్లను చేసుకోవడంతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ నుండి అనుమతులను పొందడం విశేషం. కాలనీలో ప్రజావసరాలకు ఉపయోగించాల్సిన ప్రభుత్వ స్థలాన్ని, ఖాళీ స్థలాన్ని ఏ విధంగా నిర్మాణాలను చేపడుతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాలనీ వాసులు అక్రమంగా నిర్మాణాలు చేయడం పై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, మండల రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోతుందని స్థానికువు వాపోతున్నారు. కాలనీ వాసులు అక్రమ నిర్మాణాల పై కోర్టును సైతం ఆశ్రయించి ఎలాంటి నిర్మాణాలను చేయకూడదని ఆర్డర్ తీసుకువచ్చినా నిర్మాణాలను మాత్రం కొనసాగించడం వెనుక ఆంతర్యమేమిటని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నిర్మాణాలను తొలగించి స్థలాన్ని కాపాడాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

**స్ప్రింగ్ వ్యాలీ కాలనీలో ప్రభుత్వ స్థలాలను కాపాడేంత వరకు పోరాటం...**
నిజాంపేట్, స్ప్రింగ్ వ్యాలీ కాలనీలో ప్రభుత్వ స్థలాల్లో, ఖాళీ స్థలాల్లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను తక్షణమే తొలగించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. కాలనీలో సర్వేనంబరు 383, 343లోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న కట్టడాలను తక్షణమే తొలగించి నిర్మాణ దారుని పై చర్యలు తీసుకోవాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను తొలగించని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతామని నేతలు హెచ్చరించారు.

## ఇంటర్నేషనల్ స్కూలుకు స్థల పరిశీలన



**ప్రజాపక్షం/అడ్డాకుల:** మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం పక్కన గల పాఠశాల స్థలాన్ని శుక్రవారం డీఈఓ రవీందర్ పరిశీలించారు. అడ్డాకుల మండల కేంద్రంలో సర్వే నెంబర్ 530, 531, 532 లో మూడెకరాలు ఒక్క ఎకరా గ్రామ కంఠానికి చెందిన స్థలాన్ని ఇంటర్నేషనల్ స్కూల్ మండల స్థాయిలో నిర్మించుటకు రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరుగా పరిశీలిస్తున్నట్లుగా డిఇఒ రవీందర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి అడ్డాకుల మండల తహసీల్దార్ మదన్మోహన్ గౌడ్, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎంఇఒ నాగయ్య పాఠశాల ఇన్‌చార్జీ హెచ్ఎం ఉమాపతి రెడ్డి, పిడి అంజిలయ్య గౌడ్ పరిశీలించి స్థలానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అట్టి స్థలంలో కంపచెట్లు తొలగించి బౌండరీస్ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాసులు, సీఈఓ బాలు యాదవ్, మండల పరిషత్ సూపరింటెండెంట్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మల్లురవి గెలుపు ఖాయం



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్‌పార్టీ డాక్టర్ మల్లురవిని ఖరారు చేయడంతో ఎంపి అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలుపు ఖాయమని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముచ్చిపోతుశంకర్ అన్నారు. గత పది సంవత్సరాలకాలంలో డాక్టర్ మల్లురవి నాగర్‌కర్నూల్ జిల్లాతో పాటు అన్ని నియోజకవర్గాల కాంగ్రెస్‌పార్టీకి అన్నివిధాలుగా అండగా ఉంటూ పార్టీ నాయకులను , కార్యకర్తలను కాపాడుతూ వచ్చారని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడానికి కీలకపాత్ర పోషించారని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యంగా డాక్టర్ మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయండి



**ప్రజాపక్షం/వెల్దండ :** కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలముందు ఇచ్చిన రైతు రుణ మాఫీ, గృహలక్ష్మి , గృహజ్యోతి తదితర కార్యక్రమాలను అమలు చేయాలని బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపిపి పుట్టరాంరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన స్థానిక నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే బ్యాంకు దగ్గరికి వెళ్లి రూ.2లక్షల రుణమాఫీ డబ్బులను తీసుకోవాలని, విద్యుత్ బిల్లు చెల్లించవద్దని తదితర విషయాలను ఎన్నికల ప్రచారంలో పదేపదే చెప్పి ఓట్లు దండుకున్నారని ఎన్నికలలో గెలుపొందాకవాటిని పట్టించుకునే పాపాన పోలేదని విమర్శించారు. అదేవిధంగా అప్పటి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అమలుచేసిన రైతుబంధు పథకానికి తూట్లు పొడిచారని, ఇందిరమ్మ రాజ్యంఅంటే రైతులను నట్టేట ముంచడమేనా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీవైస్ ఎంపిపి అనిల్‌కుమార్, సింగిల్‌విండో డైరెక్టర్ ముక్తాల శేఖర్‌ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, నర్సింహ్మముదిరాజ్, శ్రీనివాస్, జంగయ్య, బైరాపూర్ వెంకటయ్య పాల్గొన్నారు.

## చెంచుపెంటలలో దాహార్తిని తీర్చండి

**ప్రజాపక్షం/అచ్చంపేట :** పదర మండలంలోని చెంచు పెంటలలోని నీటి ఇబ్బందిని తీర్చాలని చెంచుసేవాసంఘం నాయకులు కోరుతున్నారు. శుక్రవారం పదర మండలం పిల్లిగుండు చెంచుపెంటలో చెంచుల నీటి ఇబ్బందులగురించి తీవ్రంగా విమర్శించారు. మారుమూల గ్రామాలలో సకల సౌకర్యాలు కల్పిస్తామన్న ప్రభుత్వ నాయకులు వేసవికాలంవస్తే దాహానికి , చలికాలంవస్తే చలికి విభిన్నరీతిలో బాధపడుతున్నట్లు వారు తెలిపారు. గత 15రోజుల నుండి పిల్లిగుండు గ్రామంలో తాగునీరులేక సమీపంలో ఉన్న కృష్ణానది తీరానికి వెళుతున్నట్లు వారు ఆరోపించారు. ఈవిషయంపై పదర ఎంపిడిఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమగ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

## ఎంఎల్ఎ అనిరుద్‌రెడ్డికి వినతి పత్రం అందజేత

**ప్రజాపక్షం/జడ్చర్ల :** హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారుడు నరేందర్‌ను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో ఎంఎల్ఎ మాట్లాడుతూ... రాజాపూర్ మండలం మల్లెపల్లి గ్రామ నివాసి జ్ఞానాచంద్ చైనాలో మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు మృతదేహన్ని చైనా నుంచి స్వగ్రామానికి తీసుకోచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## డయాలసిస్ బాధితునికి ఎల్ఒసి అందజేత



**ప్రజాపక్షం/శ్రీరంగాపురం :** మండల కేంద్రానికి చెందిన మాడిగే కురుమన్న కూతురు భార్గవి డయాలసిస్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు ఎమ్మెల్యే మెగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా భార్గవికి మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహయ నిధి నుంచి రెండు లక్షల ఎల్ఓసి మంజూరు పత్రాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే మెగారెడ్డికి , శ్రీరంగాపురం కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజుకు భార్గవి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట పట్టణ కేంద్రంలో శాఖ గ్రంథాలయంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ గ్రంథాలయంను పరిశీలించడం జరిగింది. రోజువారి పాఠశాలకు అవసరమైన కనీస మౌలిక సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ పరిశీలనకు వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ దృష్టికి కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి తీసుకెళ్లడం జరిగింది. ఆధునాతన పుస్తకాలు, అద్భుతమైన పద ప్రయోగాలతో మనసుకు హత్తుకునేలా ఉండే పుస్తకాలు కావాలని స్టడీ కుర్చీలు, ప్యాడ్‌లు , ద్విచక్ర వాహనాలకు ఆపుటకు పార్కింగ్ సౌకర్యం కావాలని,లైట్లు, ఫాన్స్ కిటికిలకు గ్లాస్ పిటింగ్ చేసి సౌండ్ పొల్యూషన్ రాకుండా కిటికిలకు గ్లాస్ ఫిట్టింగ్ , తాగునీటి వసతి, మహిళలకు బాత్ రూం సౌకర్యాలు లేవని, పాఠకులకు సౌకర్యాలు కల్పించి హాజరు శాతం పెంచేలా కృషి చేయాలని గ్రంథాలయంకు వచ్చిన అదనపు కలెక్టర్‌ని కోరడం జరిగిందని తెలియజేసుకుంటున్నారు.

# దర్యాప్తు సంస్థల అధిపతులను తొలగించండి

### ఇసికి 'ఇండియా' కూటమి మెమొరాండం



**న్యూఢిల్లీ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ''ఇండియా'' కూటమి పార్టీల నాయకులు భారత ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. బిజెపి ప్రభుత్వం పక్షపాత ధోరణితో ప్రతిపక్ష నాయకులపై ఎడతెగని దాడులకు పాల్పడుతోందని, కేంద్ర దర్యాప్తుసంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేజ్రీవాల్ అరెస్టు అనంతరం ఈ పరిణామం సంభవించిందిఇప్పటివరకూ ప్రతిపక్ష నాయకులపై జరిగిన దాడులు, అక్రమ చర్యల వివరాల జాబితాను లిఖితపూర్వకంగా ఎన్నికల సంఘం అధికారులకు సమర్పించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలకు అధిపతులుగా పనిచేస్తున్నవారిని తొలగించి వారిస్థానంలో కొత్త వారిని నియమించాలని కూడా ప్రతిపక్షాల నాయకులు తమ మెమొరాండంలో ఇ సికి విజ్ఞప్తిచేశారు. నిజంగా తప్పుచేసిన వారిపై దాడులు జరగడంలేదని, అధికార పార్టీ – ప్రతిపక్షాలమధ్య దారుణ వివక్షతో ఉద్దేశపూర్వకంగా దాడులు, సోదాల పేరుతో అరెస్టులకు పాల్పడుతున్నారని, దేశ రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి వెన్నుపోటు పొడుస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వి మీడియాతో మాట్లాడుతూ, ఇది సాధారణ ఫిర్యాదు కాదని, భారతదేశ రాజ్యాంగానికి, దాని మౌలిక స్వరూప స్వభావాలకు తీవ్ర విఘాతం కలించి ప్రభావం చూపించే అతిపెద్ద సమస్య అనీ అన్నారు. ''రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు, ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా దేశంలో ఎన్నికలు జరపాలి, అప్పుడే దేశంలో ప్రజాసస్వామ్యానికి న్యాయం జరుగుతుంది, ఈ విధానమే దేశ ప్రజాస్వామ్యానికి ఆత్మ, సుప్రీంకోర్టు ఈ విషయం పదే పదే చెప్పింది'' అని సింఘ్వి చెప్పారు. 20 ఏళ్ళ క్రితం నాటి కేసులు కూడా బయటకు తీసి ఈ ఎన్నికలవేళ కక్షసాధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ విధమైన అరెస్టును జూన్, జులై వరకూ ఎందుకు వాయిదా వేయకూడదు? ఇవన్నీ కక్ష సాధింపు చర్యలే, 75 ఏళ్ళ దేశ చరిత్రలో పార్టీ జెండా రంగు ఏదైనాగానీ ఒక ముఖ్యమంత్రిని ఏనాడూ అరెస్టు చేయలేదు, కానీ ఈ ఎన్నికల వేళ బిజెపి ఆ పని చేసిది, మేం ఎన్నికల సంఘాకి సలహా ఇచ్చాం, మీరే నియామక బాధ్యతలు ఎందుకు చేపట్టకూడదని ప్రశ్నించాం, మీకు (ఎన్నికల సంఘానికి) చట్టపరమైన అధికారాలు ఉన్నాయి, మీరు పోలీసు ఉన్నతాధికారులను నియమించవచుచ, ఇడి, సిబిఐ, ఐటి అధికారులను కనీసం ఈ ఎన్నికల సమయంలోనైనా నియామకాలు చేయవచ్చు, ఇప్పుడున్న అధికారులను తొలగించి కొత్త వారిని నియమించండి'' అని భారత ఎన్నికల సంఘానికి ప్రతిపక్షాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి 12 గంటలకు మాకు ఈ విషయం తెలిసింది, కొంత మంది నాయకులు లేరు, కానీ మిగిలినవారు తక్కువ సమయంలో హాజరై విజ్ఞప్తి చేశాం అని సింఘ్వి చెప్పారు. దర్యాప్తు సంస్థలు చేసిన పది దాడులు, అమానుష ఘటనలను ఇసి దృష్టికి తెచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ విధమైన దుందుడుకుతనం గత చరిత్రలో ఏనాడూ కనిపించలేదని గుర్తుచేశారు. ఈ చర్యల కారణంగా దేశ ఎన్నికల ప్రక్రియలో పవిత్రత దెబ్బతిన్నదని అన్నారు.

## అంధకారంలో ఆసుపత్రి ప్రాంగణం



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల కేంద్రమైన వీపనగండ్లలో సామాజిక ఆరోగ్య కేంద్రం , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్న ఆసుపత్రి ప్రాంగణంలో రాత్రివేళ విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ఆసుపత్రికి వచ్చే రోగులు చీకట్లోనే ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుందని , ఆసుపత్రి ఆరుబయట విద్యుత్ దీపాలలు లేకపోవడం వల్ల విషపు పురుగుల బారిన పడాల్సిన వస్తుందని వాపోతున్నారు. ఆసుపత్రికి ఇటీవలే ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన రాత్రివేళ ఆసుపత్రి ప్రాంగణంలో విద్యుత్ దీపాలలను వేయాలనే ఆలోచన ఆసుపత్రికి సిబ్బందికి రావటం లలేదని, రాత్రివేళ ఆసుపత్రి ప్రధాన గేట్ నుంచి ఆసుపత్రి వరకు వెళ్లాలంటే చీకట్లోనే వెళ్లాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ఆసుపత్రి ప్రాంగణంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

### కాంట్రాక్టర్ , సూపరిండెంట్ బాధ్యతా రహిత్యంతో

# జీతం అందక కాంట్రాక్ట్ కార్మికుల అవస్థ

### తెలంగాణ హెల్త్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ , ఏజెన్సీ కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్యం వల్ల ఆగస్టు 2022 నెల పెండింగ్ జీతం అందక ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ హెల్త్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ అన్నారు. శుక్రవారం వనపర్తి ఏరియా ఆసుపత్రి ఆవరణలో కార్మికులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 2022 నెల జీతం ఒక్కొక్కరికి రూ. 8400 వంతున 45 మంది కార్మికులకు జీతం ఇవ్వాల్సి ఉందన్నారు. ఏళ్లుగా జీతం ఇవ్వాలని అడుగుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్ జీతం ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను అడిగితే 2017 ఆగస్టు నెలలో ఏరియా ఆసుపత్రి, వైద్య విధాన పరిషత్ నుంచి డిఎంఈ కిందికి మారిందని, అప్పుడు ఆ నెల జీతం తనకు ప్రభుత్వం ఇవ్వలేదంటున్నారని తెలిపారు. సూపరింటెండెంట్‌ను అడిగితే జీతం ఎప్పుడో కాంట్రాక్టర్‌కు ఇచ్చామని ఆయనను అడగండని తప్పించుకుంటున్నారని తెలిపారు. ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టుకుంటూ జీతం ఇవ్వకుండా వేధించటం సరికాదన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ , అప్పటి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కరిస్తామని హామీనిచ్చిన ఇంత వరకు నెరవేరలేదన్నారు. కలెక్టర్ వెంటనే చర్య తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. నిర్లక్ష్యం చేస్తే జీతం సమస్య పరిష్కరించే దాకా సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఏరియా ఆసుపత్రి హెల్త్ కాంట్రాక్టర్ కార్మికుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నర్సింహ, కళావతి, శకుంతల, ప్రమీలమ్మ, భాగ్యమ్మ, రాజశేఖర్ , బాలరాజు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## బోర్డర్ పోలీసుల సమన్వయ సమావేశం



**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం ఉదయం కర్ణాటక రాష్ట్రంలోని కాలబుర్గి జిల్లాలోని చించొలి డిఎస్పీ సంగమంత్ హిరేమత్ ఆధ్వర్యంలో సేడం సర్కిల్ ఆఫీస్‌లో బార్డర్ పోలీసులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు బార్డర్ పోలీసులు సమన్వయంతో పని చేసి ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్ పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టల వద్ద అధికారులు సమన్వయంపాటిస్తూ ఎప్పటికప్పుడు పకడ్బందీగా చర్యలు చేపట్టేలా సమావేశంలో చర్చించాలన్నారు. బోర్డర్లలోని గ్రామాలలో నకిలి ఓటర్లపై నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. బార్డర్ పోలీస్ స్టేషన్లలో క్రైమ్‌కు సంబంధించి రోడ్డు ప్రమాదాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూర్ రూరల్ సిఐ, ఆశోక్ , నారాయణపేట, సిఐ శివ శంకర్ , కొడంగల్ శ్రీధర్‌రెడ్డి, కర్ణాటక బోర్డర్‌లో ఉన్న సిఐలు , ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు తగు చర్యలు

### ఎస్‌పి యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/నారాయణపేట ప్రతినిధి :** జిల్లా పరిధిలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ పోలీసు అధికారులకు తెలిపారు. శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ ఎక్సైజ్ పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిఇగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల విధులను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని జిల్లా పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, పార్లమెంట్ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున నారాయణపేట జిల్లా పరిధిలో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు అక్రమ మద్యం నివారించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద అక్రమంగా తరలించే డబ్బు, మద్యం, గంజాయి, బంగారం, ఇతర విలువైన వస్తువులు రవాణా జరగకుండా పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేసి అధికారులు సమన్వయంతో పని చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ లింగయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్ , పేట, కోస్గీ ఎక్సైజ్ సిఐలు ఆశోక్‌కుమార్ , బాలకృష్ణ, ఎస్ఐలు రమేష్ , గురువయ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఆదమరిస్తే ఆగమైతం

### ఎంఎల్ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఆదమరిస్తే ఆగమైతం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో, బాయిస్ కళాశాల మైదానంలో మార్నింగ్ వాక్ సందర్భంగా మహబూబ్‌నగర్ ఎంపి అభ్యర్థి చల్లా వంశీ చంద్‌రెడ్డితో కలిసి పలువురు వాకర్స్‌తో ముచ్చటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఎంపి స్థానానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంచార్జీగా కొనసాగుతున్నారని, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే ఆలోచన ఆయనకు ఉందని, మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసుకొనుటకు ఇంతకుమించిన అవకాశం మనకు రాదని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని 100 కోట్ల నిధులు తేవడం, ఇంజనీరింగ్ కళాశాల లా కళాశాల ఏర్పాటుకు సంబంధించి మౌలిక ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆయన చెప్పారు. ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే ఈ అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం అవుతాయని ఆయన చెప్పారు. ఎంపి అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ , ఎన్‌పి వెంకటేశ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి సిజె బేనహర్, తదితరులు పాల్గొన్నారు.

## విజయమే లక్ష్యంగా పని చేద్దాం




**ప్రజాపక్షం / కొత్తకోట:** పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోతులపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అనుబంధాలైన బీసీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు జె. రాజు, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఎజాజ్‌లను పట్టణ కకాంగ్రెస్ పార్టీ కకార్యాలయంలో ఘనంగా వారిని సన్మానించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్‌జె బోయోజ్ మాట్లాడుతూ కొత్తకోట పట్టణంలో రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పని చేస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కష్టపడి పని చేస్తూ ముందుకు వెళ్తూ పాలమూరు గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరవేద్దామని రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పని చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, పట్టణ మాజీ సర్పంచి ధన్వాడ బాలస్వామి, మున్సిపాల్టీ కో ఆప్షన్ నంబర్ జెఎం మిషేక్ , మాజీ కో ఆప్షన్ నంబర్ ఎంఎ లతీఫ్ , ప్రచార కార్యదర్శి పి. మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అడుగడుగునా ప్రశ్నిస్తాం... కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తాం

### బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఉచితాల పేరుతో మహిళలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికే అరుణమ్మ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి శుక్రవారం మహబూబ్‌నగర్‌లో మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రశ్నిస్తున్న తెలంగాణ మహిళలు శక్తి కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. డీకే అరుణమ్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పని అయిపోయింది. పాలించే స్థాయి కోల్పోయింది. గతంలో ఎంపీగా గెలిచి నోళ్లు ఎవ్వరు ఇక్కడ లేరు. ఎం అభివృద్ధి చేయలేదు పాలమూరుతో ఇప్పుడు పోటీలో ఉన్నోళ్లు కూడా ఓట్ల కోసం వచ్చినోళ్లే వారెవ్వరికి పాలమూరుతో పేగుబంధం లేదు. కానీ నేను లోకల్ ఈ ప్రాంత బిడ్డగా పాలమూరులో ఓట్లడిగే హక్కు నాకు మాత్రమే ఉంది. పాలమూరు ప్రజల కోసం నిరహార దీక్షలు చేసినా ఆర్‌డిఎస్ తూముల మునివేత కోసం రాయలసీమ రైతులతో పోరాటం చేశానని అన్నారు. అన్నిట్లోనూ మనం సగం భాగంగా ఉంటాం. మీరు తలుచుకుంటే పాలమూరు ఎంపీ అభ్యర్థిగా నా గెలుపును ఎవ్వరు ఆపలేరు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామన్నారు. 100 రోజులు దాటినా అమలు చేయలేదు. మహిళలు, దేశ అభ్యున్నతి కోసం మోదీ చేస్తున్న సూపరిపాలనను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు, మరుగుదొడ్లు నిర్మించాం. ముద్రలోన్స్ ఇచ్చి ఆర్థిక స్వతంత్రాన్ని ఇచ్చాము. అన్ని వర్గాలోని మహిళల కోసం మోదీ ఆలోచిస్తున్నారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ రాజకీయాలోను మహిళలను మోదీ ప్రోత్సాహిస్తున్నాడు.

## కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా డాక్టర్ మల్లురవి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మల్లురవిని గురువారం రాత్రి కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన మూడో జాబితాలో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు దక్కగా నాగర్‌కర్నూల్‌నుంచి మల్లురవికి అవకాశం కల్పించారు. ఎస్సి రిజర్వుడు స్థానమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌బరిలో నిలిచేందుకు కాంగ్రెస్‌నేతలు మల్లురవితోపాటు ఎఐసిసి కార్యదర్శి, అలంపూర్‌మాజీ ఎంఎల్ఎ సంపత్‌కుమార్, మాజీ ఎంపి మందజగన్నాథం, చారగొండ వెంకటేష్, అడ్వకేట్ జగన్‌లు తమ తమ ప్రయత్నాలను చేశారు. పార్టీ అధిష్టానం చివరకు టికెట్ కేటాయించింది. అభ్యర్థి ప్రకటన చేయడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది.

**మల్లురవి రాజకీయ నేపథ్యం**

డాక్టర్ మల్లురవి ప్రస్తుతం టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంతోపాటు ప్రస్తుత ప్రభుత్వహయాంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా పనిచేశారు. మల్లురవి 1980లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూత్‌కాంగ్రెస్‌లో కన్వీనర్‌గా పనిచేశారు. 1991లో కాంగ్రెస్ తరపున మొదటిసారిగా నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 1996లో పోటీచేసి ఓడిపోయిన 1998లో రెండోసారి ఎంపిగా విజయం సాధించారు. 1999లో తిరిగి ఓటమిపాలయ్యారు. 2008లో జడ్చర్ల అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో ఎంఎల్ఎగా గెలిచారు. 2009, 2014లో జడ్చర్లనుంచి ఎంఎల్ఎగా పోటిచేసి ఓడిపోయారు. 2019లో నాగర్‌కర్నూల్ లోక్‌సభకు కాంగ్రెస్ తరపున మరోసారి పోటిచేసిన మల్లురవిపై టిఎస్ఎస్ అభ్యర్థి పోతుగంటి రాములు 1,89,748 ఓట్లమెజార్టీతో గెలిచారు.

## చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి

### జిల్లా ఎస్‌పి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్



**ప్రజాపక్షం/వెల్దండ :** పార్లమెంట్ ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌పి వైభవ్ రఘునాథ్‌గైక్వాడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొట్రగేట్‌వద్ద అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద వచ్చిపోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి అక్రమంగా డబ్బు, మద్యం, బంగారం, విలువైన వస్తువులు తరలకుండా చూడాలన్నారు. రూ.50వేలకంటే ఎక్కువ నగదు తీసుకువెళుతుంటే వాటికి తగిన ధృవపత్రాలు లేకుంటే సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా సమస్యాత్మకంగా చెక్‌పోస్టులను గుర్తించి కేంద్ర పారామిలటరి, సిఆర్పిఎఫ్, స్థానిక పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లాలో అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు మన్ననూర్ అంతర్‌జిల్లా చెక్‌పోస్టులను మర్రిపల్లి, కొట్రచౌరస్తా, ఊర్కొండ, పెంట్లవెల్లి, మంగనూర్ ఏర్పాటుచేసినట్లుతెలిపారు. అంతకుముందు చెక్‌పోస్టు వద్దరికార్డులను పరిశీలించి వాహనాలను తనిఖీచేశారు. ఆయనవెంట స్థానిక ఎస్ఐ రవి సిబ్బంది ఉన్నారు.

**ఊర్కొండ పోలీస్‌స్టేషన్ రికార్డులు పరిశీలన**

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఇటీవల రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ ముచ్చర్లపల్లివద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు కేంద్రాన్ని, జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ సందర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అంతర్‌జిల్లా చెక్‌పోస్టు కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి జిల్లా ఎస్‌పి పలు సూచనలు చేశారు. అనంతరం ఊర్కొండ పోలీస్‌స్టేషన్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటిపై తక్షణమే పరిష్కరిస్తామని సిబ్బందికి భరోసా నిచ్చారు. నూతన పోలీస్‌స్టేషన్ నూతన భవనం ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించడం జరిగింది. నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించడానికి వెంటనే అన్ని ఏర్పాట్లు చేయాలని కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ వీరబాబులను ఎస్‌పి గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ ఆదేశించారు.



## వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి** : మెదక్ జిల్లా పోచారం లో ఉన్న వన విజ్ఞాన కేంద్రన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా సందర్శించారు. 4.5 కిలో మీటర్లు సఫారీ వాహనం లో అటవీ ప్రాంతం తిరిగి జింకల ప్రత్యుత్పత్తి కేంద్రంను జింకలని, నెమళ్ళు, మనుబోతులు, పక్షులను, ఇతర అటవీ జంతువులను పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు ఎక్కువ గా ఉండడం వల్ల వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, జంతువులకు ఆహారం, త్రాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు, అటవీ విస్తీర్ణం, సందర్శకుల సమయ పాలన గురించి అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ జంతువులకు త్రాగు నీరు, ఆహారం, రక్షణ ఏ విధంగా ఇస్తారు అని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, హవేలీ ఘనపూర్ మండల్ తహసిల్దార్ నారాయణ, అటవీ సెక్షన్ అధికారి శ్రావణ్ కుమార్, బీట్ ఆఫీసర్ ప్రసాద్ గౌడ్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## భూదాన్ భూమిని అక్రమంగా తీసుకున్న వారిపై చర్యలు

సిపిఐ రాష్ట్ర నాయకుడు పర్వతాలు డిమాండ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** భూదాన్ భూమిని అక్రమంగా తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు, నందిగామ మండల కార్యదర్శి గడ్డం జంగయ్యలు డిమాండ్ చేశారు. నందిగామ రెవిన్యూ శివారులోని భూదాన్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకొని కబ్జా చేసిన వ్యక్తిపై ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వేనంబర్ 545లో మొత్తం 11ఎకరాల 22గుంటల భూమి రికార్డులను తారుమారు చేసి అక్రమంగా రిజిస్ట్రేషర్ చేయించుకొని కబ్జా చేశారని, ఆ వ్యక్తిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కబ్జా చేసి వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు అట్టి భూమిని పేదలకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకొరి స్వాధీనం చేసుకొకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు చేతపట్టి భూదాన్ భూమిని పేదలకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములను రెవిన్యూ అధికారులు కాపాడకుంటే భవిష్యత్‌లో ప్రభుత్వ భూములు అనేవి లేకుండా పోతాయని వివరించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. నందిగామ మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఇప్పటికే ప్రభుత్వ భూములను పెత్తందారులు, రియల్ ఏస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేశారని వారి నుండి విడిపించేందుకు రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో మరోపోరాటాలకు సిద్దమవుతామని హెచ్చరించారు.

## తెలంగాణ- ఆంధ్రా అంతరాష్ట్ర చెక్‌పోస్టుల పరిశీలన

**ప్రజాపక్షం/కోదాడ:** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా రూరల్ డిసిపి శ్రీనివాసరావులతో కలసి



తెలంగాణ ఆంధ్రా అంతరాష్ట్రాల సరిహద్దుగా ఉన్న రామాపురం క్రాస్ రోడ్డు వద్ద, గరికపాడు వద్ద పోలీస్ చెక్‌పోస్టులను పరిశీలించారు.ఈ సందర్భంగా చెక్ పోస్టుల నిర్వహణ,వాహనాల తనిఖీలు,అక్రమ రవాణాపై ఇరు రాష్ట్రాల సరిహద్దులతో సమాచారాన్ని చేరవేసుకోవడం లాంటి అంశాలపై సరిహద్దు జిల్లాల ఎస్పీలు సమీక్షించి పలు సూచనలు చేశారు. నగదు,మద్యం తరలింపు,అసాంఘీక కార్యకలాపాలా నిర్వహణ మొదలగు వాటిపై ఇరు రాష్ట్రాల సరిహద్దు అధికారులు నిఘా ఉంచి అప్రమత్తంగా పనిచేసి ఎన్నికల నియావళి పటిష్టంగా అమలుచేయాలన్నారు.అనంతరం ఇరు రాష్ట్రాల చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు,సలహాలను అందించారు. జాతీయ రహదారి 65కు వచ్చి పోయే అన్ని గ్రామీణ రహదారులపై నిఘా ఉంచాలన్నారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదు తీసుకవెళ్తే సంబంధిత డాక్యుమెంట్లను చూపించాలని, అధిక మొత్తంలో ఆభరణాలు,దుస్తులు,ఎలక్ట్రానిక్ పరికరాలను రవాణా చేస్తున్న ఆధారాలను పరిశీలించాలని కోరారు. ఎన్నికల నియామవళి పటిష్టంగా అమలు చేయడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ రాహుగ్ హెగ్డే అన్నారు.ఈ తనిఖీల నందు కోదాడ డియస్పీ శ్రీధర్‌రెడ్డి, నందిగామ ఏసిపి రవికిరణ్, కోదాడ రూరల్ సిఐ రజితరెడ్డి, జగ్గయ్యపేట ఇన్స్‌పెక్టర్ జానకిరాములు,ఇరు రాష్ట్రాల సరిహద్దు మండలాల ఎస్ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యధిక ఎంపి స్థానాలు కాంగ్రెస్‌వే

మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

**ప్రజాపక్షం/చింతపల్లి** : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక ఎంపి స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొడకొండ్లలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కుందూరు జానారెడ్డి, స్థానిక ఎంఎల్ఏ నేనావత్ బాలూనాయక్ ముఖ్యఅతిధులుగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్‌ను, బిజెపిలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తెలంగాణలో అత్యధిక ఎంపి స్థానాలను గెలుచుకుని రాహుల్‌గాంధీకి కానుకగా ఇస్తామన్నారు. జిల్లాలో నల్లగొండ, భువనగిరి ఎంపి స్థానాలను కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. తదనంతరం బిఆర్ఎస్ పార్టీ నుండి పలువురు నాయకులు జానారెడ్డి, బాలునాయక్ సయక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జానారెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపి అభ్యర్థి రఘువీరారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు దొంతం సంజీవరెడ్డి, ఎంపిపి కొండూరి భవానిపవన్‌కుమార్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణం, నాయకులు యాదయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, ముచ్చర్ల యాదగిరి, నర్సింహ్మారెడ్డి, పూరుషోత్తంరెడ్డి, లక్ష్మయ్య, నర్సిరెడ్డి, హరినాయక్, మేతరి ఏసు, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# నాలుగు నెలలుగా బిల్లులు రావట్లే

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి** : ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రామడుగు మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులను సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు గత నాలుగు నెలలుగా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శ్రమకు తగిన ఫలితం లేకుండా పోతుందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కొలతల ఆధారంగా పని చూడకుండా కూలీల వేతనాలు పెంచాలన్నారు. ఆధార్‌లింకుతో పనిచేసిన డబ్బుల మెసేజ్ వస్తున్న ఖాతాల్లో డబ్బులు పడడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గత పాలకుల నుంచి కేంద్ర ప్రభుత్వ ఉపాధిహామీ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పనులకు మళ్లించడం వల్ల పనిచేసిన 15 రోజులకే బిల్లులు పడాల్సింది పోయి నెలలు పడుతుందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టం ప్రకారం ఉపాధిహామీ కూలీలకు రోజువారీ కూలీ 600 రూపాయలు చెల్లించాలని, 200 రోజులు పని కల్పించాలని, పని ప్రదేశాలు దూరంగా ఉంటే రవాణా ఖర్చులు ఇవ్వాలని, ఉపాధికూలీలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి రూ.5వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ,పని గ్యారంటీ చట్టాన్ని అమలు చేయాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంటె రాజేశం, ఎగుర్ల మల్లేష్, కనకయ్య, ఐలయ్య, రాజవ్వ, విజయ, లక్ష్మి, లలిత, జ్యోతి, మాధవి, వనిత, శైలజ, రాజవ్వ, కనుకలక్ష్మి, మల్లవ్వ, శోభారాణి తదితరులున్నారు.

## కేంద్రంలో బిజెపిని గద్దెదించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి** : కార్మిక, ప్రజ వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. శుక్రవారం హన్మకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ దేశంలో మతోన్మాద రాజకీయాలు చేస్తూ ఐక్యంగా ఉన్న ప్రజలను, కార్మిక వర్గాన్ని విచ్చిన్నం చేసే కుట్రలకు బీజేపి పాల్పడుతున్నదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు, కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతూ పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నిలిచిందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేస్తూ 44 కోడ్‌లుగా ఉన్న కార్మిక చట్టలను నాలుగు కోడ్‌లుగా మార్చి యాజమాన్యాలకు, కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని సైతం మార్చి మనువాద రాజ్యాంగాన్ని తేవాలని కుట్ర చేస్తున్న బీజేపిని రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఓడించాలని కోరారు. కార్మికుల సమస్యలపై రానున్న రోజులలో సమరశీల పోరాటాలు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్ముల రామ్మూర్తి, నాయకులు కర్రె లక్ష్మణ్, గుంటి రాజేందర్, ఆదరి రమేష్, అంకార్ అశోక్, బత్తిని సదానందం, ఇల్లందుల రాములు పాల్గొన్నారు.



## ఉత్పత్తి పైన ఉన్న శ్రద్ధ, కార్మికుల రక్షణపై లేకనే ప్రమాదాలు

సింగరేణి కాలరీస్ వర్కర్స్ రాష్ట్ర (ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్** : సింగరేణి యాజమాన్యానికి ఉత్పత్తి పైన ఉన్న శ్రద్ధ, కార్మికుల రక్షణ పైన లేకపోవడమే గనులలో ప్రమాదాలకు కారణమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ రాష్ట్ర (ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఎస్ఆర్‌పి 1 గనిలో గురువారం జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని నాయకులతో కలిసి గని లోపలికి దిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం పూర్తిగా ఉత్పత్తి పైనే కేంద్రకరించిందని, కార్మికుల రక్షణ విషయాలలో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. కార్మికుల రక్షణతో కాకుండా, ప్రమాదాలతో సాధించే ఉత్పత్తి ఉత్పత్తే కాదని అన్నారు. యాజమాన్యం సేఫ్టీ ట్రైపార్టెడ్ సమావేశాలు నిర్వహించకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే యాజమాన్యం సేఫ్టీ ట్రైపార్టెడ్ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం గని ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన సాదం సత్యనారాయణ చికిత్స పొందుతున్న కరీంనగర్ లోని మెడికవర్ ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె. బాజీ సైదా, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, గని ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య, నాయకులు అఫ్రోజ్ ఖాన్, కామెర వేణు తదితరులు పాల్గొన్నారు.

### కార్మికులపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి సహించేది లేదు

సింగరేణి సంస్థ మనుగడకు ఎల్లప్పుడు తమ శ్రమను అందిస్తూ తోడ్పడే కార్మికుల పైన యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని సహించేది లేదని ఐఎన్‌టియుసి శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్పి1 గనిలో గురువారం మొదటి షిఫ్ట్ లో జరిగిన ప్రమాదంలో సాదం సత్యనారాయణ అనే హ్యామర్ మెన్ కార్మికుడు తీవ్ర గాయాల పాలై తన రెండు కాళ్లు కోల్పోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గనిలోని కార్మికులను కలిసి జరిగిన ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యం కార్మికుల రక్షణ పైన శ్రద్ధ చూపకపోవడం, మార్చి నెల ముగుస్తున్న తరుణంలో యాజమాన్యం పూర్తిగా ఉత్పత్తి పైన శ్రద్ధ చూపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేణ శ్యామ్, ఏరియా సెక్రటరీలు వెంగల కుమారస్వామి, రావుల అనిల్, ఏరియా నాయకులు ఎంబడి తిరుపతి, నీలం సదయ్య పాల్గొన్నారు.

## సంఘర్షణలోంచే మంచి కవిత్వం పుట్టుకొస్తుంది

కేయు ప్రొఫెసర్, ప్రముఖ విమర్శకురాలు కాత్యాయని విద్మహే



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్** : సంఘర్షణలోంచే మంచి కవిత్వం పుట్టుకొస్తుందని కేయూ ప్రొఫెసర్, ప్రముఖ విమర్శకురాలు కాత్యాయని విద్మహే అన్నారు. హన్మకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు, కవయిత్రి డాక్టర్ బండారి సుజాత పుస్తకాల ఆవిష్కరణలో కాత్యాయని విద్మహే ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. శ్రీలేఖ సాహితి సమితి వరంగల్ అధ్యక్షులు డాక్టర్ టి. శ్రీరంగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బండారి సుజాత రచించిన కవితా సంపుటి వేకువ పుష్పం, వెలుతురు చూడని యెన్నియలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ విమర్శకురాలు కాత్యాయని విద్మహే మాట్లాడుతూ కవిత్వంలో సాంద్రత,వ్యక్తీకరణతో పాటు సాదారణ వ్యాక్యానిక భిన్నంగా కవిత్వం ఉండాలని, లోతైన భావాలతో కవి నిరంతరం సంఘర్షణకు గురైనప్పుడే మంచి కవిత్వం వస్తుందని అన్నారు. డాక్టర్ బండారి సుజాత రచనలలో సామాజిక అంశాలు ఎక్కువగా చోటు చేసుకోవడం విశేషమని అన్నారు. కవి, ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్ పుస్తకాన్ని సమీక్షిస్తూ డాక్టర్ బండారి సుజాత ఉపాధ్యాయురాలుగా, పరశోధకురాలుగా, కవిగా, రచయితగా కొనసాగుతూనే పలు ప్రజాస్వామిక సంస్థలతో కలిసి పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా అన్నవరం దేవేందర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి రజిత, రాపోలు సత్యనారాయణ, సింగరాజు రమాదేవి,పి.చందు,నాగిళ్ల రామశాస్త్రి, పల్లె నాగేశ్వర్ రావు, కోడం కుమారస్వామి,గట్టు రాధిక, శంకర్, రాజు,బాలబోయిన రమాదేవి,వల్సపైడి, విద్యా దేవి,లీల,సోమన్న,ప్రభాకర్, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి పార్లమెంట్ స్థానం బిసిలకు ఇవ్వాలి

భువనగిరి ఎంపి టికెట్ కోసం నేను దరఖాస్తు చేయలేదు..

పార్టీ ఆదేశిస్తే 17 పార్లమెంట్ స్థానాలలో ప్రచారం చేస్తా : ఎంఎల్ఏ రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం / మునుగోడు** : భువనగిరి పార్లమెంట్ టికెట్ బిసిలకు ఇస్తే అధిక మెజార్టీతో గెలిపిస్తామని భువనగిరి ఎంపీ టికెట్ తన భార్య లక్ష్మి కోసం అధిష్టానని ఆశించలేదని కనీసం అప్లై చేయలేదని ఎంపి టికెట్ తన భార్య లక్ష్మి కోసం ఆశిస్తున్నానడం అవాస్తవమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలో తన సొంత క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే పదవులను త్యాగం చేస్తాం తప్పా పదవుల కోసం పాకులాడమని స్పష్టం చేశారు. భువనగిరి పార్లమెంట్ టికెట్ కోసం సర్వే చేసి ఎవరికిచ్చిన రాష్ట్రంలో అత్యధికంగా బోనగిరి ఎంపి అభ్యర్థికి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రంలో 17 పార్లమెంటు స్థానాలలో ప్రచారం చేసేందుకు పార్టీ ఆదేశిస్తే ప్రచారం చేస్తానని అన్నారు. తన భార్య లక్ష్మి సామాజిక సేవలకు పరిమితమైంది తప్పా రాజకీయాలలో పోటీ చేయాలన్న ఆలోచన లేదని గతంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరిక మేరకు ఎమ్మెల్సీగా పోటీ చేసిందన్నారు. అధిష్టానం పోటీ చేయాలని ఆదేశిస్తే ఆలోచన చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగిస్తున్న కెసిఆర్‌ను గద్దె దించాలనుకున్న తన లక్ష్యం నెరవేరిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిసిసిబి డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు,చౌటుప్పల్ ఎంపీపీ తాడూరు వెంకటరెడ్డి, నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమాదేవి, మునుగోడు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, చౌటుప్పల్ మండల పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, నాంపల్లి మండల అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి, చండూరు మండల పార్టీ అధ్యక్షుడు ఓంకార్, మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి** : ప్రైవేట్ పరిశ్రమలు, విద్యాసంస్థల్లో జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు వారధి సొసైటీ ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వారధి సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో నిరుద్యోగ యువతకు కల్పించిన ఉద్యోగ అవకాశాలు, దీంతోపాటు ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు పలు అంశాలపై కలెక్టర్ చర్చించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. వారధి సొసైటీ కార్యక్రమాలను మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో అనేక పరిశ్రమలు, విద్యాసంస్థలతో పాటు ఐటి టవర్ ఉందని తెలిపారు. ఇందుకు పరిశ్రమల జీఎం, వారధి సొసైటీ కలిసి నిరుద్యోగ యువతకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించే అంశంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ప్రైవేట్ ఉద్యోగాలపై యువత దృష్టిసారించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల పోటీపరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఇందుకు వారికి సమగ్రంగా శిక్షణ అందించాలన్నారు. మరోచోట లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగాల నియామకం కోసం జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సారధ్యంలో ఐదుగురు సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ జి.ఆంజనేయులు, జడ్పి సీఈవో శ్రీనివాస్, డీఈవో జనార్ధన్‌రావు, డిఐజి జిఎం నవీన్ కుమార్, మెప్మా పిడి రవీందర్, డీఆర్‌డీవో శ్రీధర్, ఎస్సీ డెవలప్‌మెంట్ డిడి నతానియల్, బిసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్ కిరన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దేవేందర్‌రావు తదితరులున్నారు.

## చింతపల్లిలో రూ.5లక్షల నగదు పట్టివేత

**ప్రజాపక్షం/చింతపల్లి** : లోక్‌సభ ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని మండల పరిధిలోని ఘడిగౌరారం ఎక్స్‌రోడ్ వద్ద నాగార్జునా సాగర్ జాతీయ రహదారిపై శుక్రవారం స్థానిక ఎస్ఐ బి యాదయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన వెల్దండ శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా తన మోటర్‌సైకిల్ పై ఐదు లక్షల రూపాయలను తరలిస్తున్నారు. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో కలసి మోటర్‌సైకిల్‌ను తనిఖీ చేయగా ఐదు లక్షల రూపాయల నగదును గుర్తించారు. పట్టుబడిన రూపాయలను మధ్యవర్తుల సమక్షంలో పంచనామ నిర్వహించి సేఫ్ కస్టడీ కోసం నల్లగొండ డిటిఓకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల నిమయాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## నాయకులు మారినా గానీ.. పాత చైర్మన్ల నేమ్‌ప్లేట్లు మారలేదు

నల్లగొండ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : మున్సిపాలిటీ చైర్మన్‌లు ఇద్దరు మారినా పాత చైర్మన్ పేరుతోనే కార్యాలయంలో బోర్డు దర్శనమిస్తుంది. నల్లగొండ మున్సిపాలిటీ చైర్మన్‌గా అప్పటి బిఆర్ఎస్‌కు చెందిన మందడి సైదిరెడ్డి 2020లో పదవి బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బిఆర్ఎస్‌కు చెందిన చైర్మన్ సైదిరెడ్డిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టగా అవిశ్వాసంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు నెగ్గారు. అనంతరం చైర్మన్ పదవి కోల్పోయిన మందడి సైదిరెడ్డి పదవిలో వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న అబ్బగోని రమేష్ గౌడ్ ఇంచార్జీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. కొద్ది కాలం తరువాత కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకొని అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లగానే చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్ కో ఆప్షన్ సభ్యుల పేర్లు తెలిపే విధంగా బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ఇంచార్జీ చైర్మన్‌గా అబ్బగోని రమేష్ గౌడ్ తో పాటు చైర్మన్‌గా బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికైనా కానీ ఇద్దరు చైర్మన్‌లు మారినా మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి చైర్మన్‌గా ఉన్న బోర్డును మార్చడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించడం గమనార్హం.

## భారత్–భూటాన్ మధ్య రైలు బంధం

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందాలపై రెండు దేశాలమధ్య సంతకాలు జరిగాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. బహుముఖ సంబంధాలను పటిష్టం చేసుకునే విషయంపై రెండు దేశాల ప్రధానమంత్రులూ చర్చలు జరిపారని ప్రకటన పేర్కొంది. పునర్వినియోగ ఇంధనం, వ్యవసాయం, యువత పరస్పర రాకపోకలు, పర్యావరణం, అటవీ శాఖ, టూరిజం రంగాలలో ఒప్పందాలు జరిగాయి. ప్రధామంత్రి పర్యటన సందర్భంగా పారో నుండి థింపూ వరకూ భూటాన్ ప్రజలు నరేంద్రమోడీకి అభివాదాలు తెలియజేశారు. రెండు దేశాలమధ్య దీర్ఘకాలికంగా గాఢమైన అనుబంధం ఉందనీ, మంచి సంబంధాలు కొనసాగుతున్నాయనీ, పరస్పరం అవగాహనతో రెండు దేశాలూ పనిచేస్తున్నాయని విదేశీ వ్యవహారాలశాఖ తన ప్రకటనలో పేర్కొంది. రెండు దేశాల ప్రధానమంత్రులూ డిజిటల్ లావాదేవీల అనుబంధం, అంతరిక్షం, ఇంధనం, వాణిజ్యం, వ్యవసాయం, యువతీ యువకుల పరస్పర రాకపోకలు వంటి అంశాలపై క్షుణ్ణంగా చర్చించి అవగాహనా పత్రాలపై సంతకాలు చేశారని ప్రకటన పేర్కొంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com